www.prajasakti.com
PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ◆
ప్రజాశక్తి
ప్రతి అక్షరం ప్రజల పక్షం
Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu
సంపుటి : 39 Vol సంచిక : 20 No | విజయవాడ, సోమవారం 21 జనవరి 2019 | 12 +12 పేజీలు వెల : 4.00 Rs

Lalithaa
లలితా జ్యువెల్లరి
మన విజయవాడలో





Lalithaa

గ్రౌండ్‌ఫ్లోర్‌ను ప్రారంభించువారు
గౌ॥ శ్రీ. యనమల రామకృష్ణుడు గారు
ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు,
శాసనసభా వ్యవహారాలశాఖ మంత్రి, ఆంధ్రప్రదేశ్.

ఫస్ట్‌ఫ్లోర్‌ను ప్రారంభించువారు
గౌ॥ శ్రీ. దేవినేని ఉమామహేశ్వరరావు గారు
జలవనరుల శాఖ మంత్రి, ఆంధ్రప్రదేశ్

వజ్రాభరణాలు, వెండివస్తువుల విభాగాన్ని ప్రారంభించువారు
గౌ॥ శ్రీ ఎ. సుభాస్కరన్ గారు
చైర్మన్, లైకా గ్రూపు



విజయవాడలో
లలితా జ్యువెల్లరి షోరూం బ్రహ్మాండమైన ప్రారంభోత్సవం.
ప్రపంచంలోనే అతి పెద్ద షోరూంలలో ఒకటి!
నేడు, ఉ॥10.00 గంటలకు. సుస్వాగతం!

నాలుగు మాటలు.. మీ ఆత్మీయబంధం కోసం..!

నేను ధనవంతుడిగా పుట్టలేదు. నెల్లూరులో నగలు తయారు చేసే కేంద్రంలో పన్నెండేళ్ల వయస్సులో కూలీగా చేరా. పేదరికాన్ని అనుభవించినందువల్ల, ఈ రోజుకీ సగటు వ్యక్తి కష్టనష్టాలను అర్థం చేసుకోగలను. వేళకు తినక, అహర్నిశలు శ్రమిస్తూనే ఉన్నాం, ఎందుకు?..
రక్తపోటు, మధుమేహం వంటి సమస్యలను సైతం లెక్కచేయక శరీరానికి విశ్రాంతి లేకుండా పనిచేస్తున్నామే, ఎందుకు? నాలుగు కాసులు సంపాదించుకోవడానికేగా!.. ఆ డబ్బును పిచ్చుకగూడులా చేర్చుకోవడానికేగా? ఇంటి పనులు చూసుకుంటూ, పిల్లల్ని పెంచి పోషిస్తూ, ఉద్యోగానికి కూడా వెళ్తున్నారే మహిళలు- ఎందుకు? కుటుంబ ఆర్థిక పరిస్థితులను మెరుగు పరచడానికేగా?..
ఇలా కష్టపడి సంపాదించిన డబ్బును వృథా చేయవచ్చా? ఒక వస్తువును కొనుగోలు చేసేటప్పుడు దానికి న్యాయంగా చెల్లించాల్సిన డబ్బు కన్నా ఎక్కువగా చెల్లించడం తప్పేగా?

మనదేశంలో బంగారం ఓ అలంకార వస్తువు మాత్రమే కాదండి, అది ఇంటికే ఓ భద్రత! అవసరానికి ఆదుకునే ఆపద్బాంధవ పెట్టుబడి. మరి అలాంటి బంగారాన్ని సరైన ధరకు కొనడం ఎంత ముఖ్యం?
10,000 కోట్ల రూపాయల, దక్షిణాదిలో ప్రముఖంగా భాసిల్లుతున్న ఓ నగల సంస్థ అధినేతగా, వ్యాపారవేత్తగా అడగడం లేదు. దయచేసి మీలో ఒకడిగా నన్ను భావించండి. మేం పొందే 1% మార్జిన్ ఆదాయంతో ఎంతో సంతోషపడుతున్నాం. సరైన అవగాహనతో ప్రజలు నగలు కొనాలన్నదే మా ఆశయం.

ప్రతి రూపాయికీ లెక్క చూసుకోండి. ఏమాత్రం తప్పులేదు.. ఎందుకంటే అది మీ డబ్బు. ఇంకో విషయం..
BIS 916 హాల్‌మార్క్ బంగారంతో తయారు చేసిన ఆభరణమేనా అని సరిచూసుకోండి.
వజ్రాభరణమైతే అంతర్జాతీయ స్థాయి సర్టిఫికెట్ తప్పకుండా ఉండాలి. అలాగే వజ్రాభరణాలు క్యారెట్‌కు రూ.46,000, V.A. గ్రాముకు రూ.975 కన్నా ఎక్కువగా ఇవ్వకండి.

ఇది నగాజ్ ఆభరణం, ఇది కాస్టింగ్ ఆభరణం, నగ పనితనం ఎక్కువ అన్న కథలను ఏమాత్రం నమ్మొద్దు. ఎంత పనితనం ఉన్నప్పటికీ మీరు పొందాల్సిన బంగారం బరువులో రాజీ పడొద్దు. టీ, కాఫీ, కూల్‌డ్రింక్స్ వంటి మైమరపించే ఆతిథ్యాలకు, 'ఏమండి బాగున్నారా; ఇంట్లో అంతా కుశలమా..' వంటి పలకరింపులు విని మీ దృష్టిని ఏమాత్రం మరల్చకండి. మా ఎస్టిమేట్ స్లిప్, మొబైల్‌లో ఫొటో పెట్టుకుని నాలుగైదు షోరూంలలో పోల్చిచూడండి. మార్కెట్‌లోని ఆఫర్లను కూడా లెక్కలోకి తీసుకోండి. ఇదివరకు ఎంతో శ్రమకోర్చిన నగదును అధిక ధరల నగల కోసం వృథా చేసింది చాలు. ఇకపై వాటికి స్వస్తి పలకండి. తయారీ ధరకే బంగారు నగలు, వజ్రాభరణాలు మరియు వెండి వస్తువులు అందజేస్తుండటం చాలా సంతోషంగా ఉంది. మార్కెట్‌లోనే తక్కువ ధరకే మావద్ద నగలు లభ్యమవుతాయి.

విజయవాడ, చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలకు బంగారమంటే ఎంత ఇష్టమో నాకు బాగా తెలుసు. ఉన్నతమైన సంప్రదాయలు, నిండుమనసులు, తెలుగుదనం నిండిన ప్రతిష్ఠాత్మకమైన విజయవాడలో మా 20వ షోరూంను ప్రారంభించడం నాకు ఆనందంగా ఉంది. విజయవాడకు మాత్రమే కాదండి. నా జీవితానికి కూడా ఇది సువర్ణప్రదమైనరోజు. లలితా జ్యువెల్లరికి మిమ్మల్ని సాదరంగా ఆహ్వానిస్తున్నాం. మీ ఇల్లు బంగారం కావాలని మంచి మనసుతో లలితా జ్యువెల్లరి కుటుంబం తరపున మనసారా కోరుకుంటున్నాం.

డా॥ యం. కిరణ్‌కుమార్,
చైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్, లలితా జ్యువెల్లరి మార్ట్ ప్రై. లిమిటెడ్.

ఇది నా మనవి:
మీ విలువైన సూచనలు, ఏవైనా సమస్యలుంటే నా వ్యక్తిగత మెయిల్ ఐడీకి పంపించండి. తద్వారా మీకు మరింత మెరుగైన సేవలను అందించగలను.
chairman@lalithaajewellery.com

లలితా జ్యువెల్లరి
మన విజయవాడలో



60-9-10, పిన్నమనేని పాలిక్లినిక్ రోడ్, సిద్ధార్థ నగర్, సిద్ధార్థ క్యాటరింగ్ కాలేజ్ ఎదురుగా.
ఫోన్: 0866-2481133, 91332 98333, 91332 98444. www.lalithaajewellery.com

100% నాణ్యత - BIS 916 హాల్‌మార్క్ | లక్షలాది డిజైన్లు!

లలితా జ్యువెల్లరి మార్ట్ ప్రై. లిమిటెడ్

విజయవాడ • విశాఖపట్నం • తిరుపతి • హైదరాబాద్ • చెన్నై • తిరువళ్లూరు • మదురై • తిరుచ్చి • పుదుచ్చేరి
కుంభకోణం • రామనాథపురం • కోయంబత్తూరు • సేలం • నాగర్‌కోవిల్ • ఈరోడ్ • బెంగళూరు

Live telecast of Vijayawada showroom inauguration at www.lalithaajewellery.com/live

త్వరలో రాజమండ్రిలో!

సిఎంను కలిసిన ఆలీ
గుంటూరు తూర్పుపై ఆసక్తి

ప్రజాశక్తి - గుంటూరు జిల్లా ప్రతినిధి

సినీ హాస్యనటుడు ఆలీ సిఎం నారాచంద్రబాబు నాయుడిని ఆదివారం కలిశారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో గుంటూరు తూర్పు నియోజకవర్గం నుంచి పోటీచేసేందుకు ఆయన తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికే ఆయన జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను కలిశారు. వైసిపి అధినేత వైఎస్ జగన్‌ను విమానాశ్రయంలో కలిశారు. ఈ నెల 9న ఆలీ వైసిపిలో చేరుతారని ప్రచారం కూడా జరిగింది. అయితే గుంటూరు తూర్పు నియోజకవర్గం నుంచి టిక్కెట్ విషయంలో జగన్, పవన్ నుంచి స్పష్టమైన హామీ లభించకపోవడంతో చివరికి చంద్రబాబును కలిసినట్లు సమాచారం. 15 రోజుల క్రితమే సినీ నిర్మాత అశ్వనీదత్‌తో కలిసి ఆలీ చంద్రబాబును కలిశారు. రెండో విడత ఆదివారం మళ్లీ కలిసినప్పుడు తూర్పు నియోజకవర్గం నుంచి పోటీకి చంద్రబాబు వద్ద ఆలీ ఆసక్తి కనబర్చినట్లు తెలిసింది.



రౌండ్‌టేబుల్ సమావేశంలో నిరసన తెలుపుతున్న సిపిఐ కార్యదర్శి కె రామకృష్ణ, ప్రత్యేక హోదా సాధన సమితి శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు గంగాధర్ తదితరులు

హోదా ఉద్యమం ఉధృతం

- కేంద్రం బడ్జెట్ ప్రవేశపెట్టే రోజున రాష్ట్ర బంద్
- రౌండ్ టేబుల్ సమావేశంలో తీర్మానం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రత్యేక హోదా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయాలని రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు పిలుపునిచ్చారు. రాష్ట్రప్రజల ఆకాంక్షను కేంద్రానికి తెలియజేస్తూ విభజన హామీల అమలు కోసం పోరాటాన్ని తీవ్రతరం చేయాలని నిర్ణయించారు. ఎన్నికలు సమీపిస్తున్నందున హోదా సాధనలో ఈ ఉద్యమం తుది పోరాటం కావాలని ఆకాంక్షించారు. ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి ఆధ్వర్యంలో విజయవాడలోని శ్రీరామ పంక్షన్ హాల్‌లో ఆదివారం రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. కేంద్రప్రభుత్వం బడ్జెట్ ప్రవేశపెట్టే రోజున రాష్ట్రంలో బంద్ నిర్వహించాలని, జాతీయ రహదారుల్ని నిర్బంధించాలని, విద్యార్థులతో భారీ ర్యాలీ ,బహిరంగ సభ నిర్వహించాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. కార్యాచరణను సోమవారం ప్రకటిస్తామని నేతలు వెల్లడించారు. సమితి కన్వీనర్ చలసాని శ్రీనివాస్ అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ మాట్లాడుతూ ప్రత్యేక హోదా కోసం సమిష్టి నిర్ణయాలతో పోరాటం చేయాలన్నారు. హోదా కోసం ఉద్యమించిన నాయకులపై ఢిల్లీలో రక్తమోడేలా లాఠీ ఛార్జ్ చేయటం అమానుషమన్నారు. రాష్ట్ర పర్యటనకు మోడీ ఎప్పుడొచ్చినా ఖాళీ కుండలతో నిరసన తెలియజేస్తామన్నారు. హోదా విషయంలో రాష్ట్ర ప్రజల్ని మోసం చేసిన ప్రధాని నరేంద్ర మోడీకి తగిన గుణపాఠం చెప్పాలని ఆర్టీసీ చైర్మన్ వర్ల రామయ్య అన్నారు. సమితి చేసే ఉద్యమానికి టిడిపి సంపూర్ణ మద్దతిస్తుందన్నారు. గతంలో హోదా ఉద్యమంలో పాల్గొన్న వారిపై కేసులు ఎత్తి వేసే అంశాన్ని సిఎం దృష్టికి తీసుకెళ్తామని హామీనిచ్చారు. సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు గంగాధర్, ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు రవీంద్ర నాథ్, ఎమ్మెల్సీలు కత్తి నరసింహారెడ్డి, బుద్దా వెంకన్న, ఆమ్‌ఆద్మీ పార్టీ నాయకులు రామారావు, ఎపిఎన్జివో అధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి, ఎపిజెఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కృష్ణాంజనేయులు, మాజీ ఎమ్మెల్సీ జెల్లి విల్సన్ తదితరులు పాల్గొన్నారు.



కొనసాగుతున్న అల్పపీడన ద్రోణి

ప్రజాశక్తి-గ్రేటర్ విశాఖ బ్యూరో

ఆగ్నేయ బంగాళాఖాతంలో హిందూ మహాసముద్రంలోని భూమధ్య రేఖా ప్రాంతంలో రెండ్రోజులుగా అల్పపీడన ద్రోణి కొనసాగుతోంది. దీనికి అనుబంధంగా 1.5 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల ఆవర్తనం కొనసాగుతున్నట్లు భారత వాతావరణ కేంద్రం (ఐఎండి) తెలిపింది. ఇది క్రమంగా బలపడి అల్పపీడనంగా మారి 24 గంటల్లో మధ్య బంగాళాఖాతానికి చేరుతుందని పేర్కొంది. ఇది రాష్ట్రానికి దూరంగా ఉన్నందున ఎలాంటి ప్రభావమూ చూపదని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. కోస్తా, రాయలసీమల్లో అక్కడక్కడా రాత్రి వేళ, ఉదయం పొగమంచు, చలి మంచు కురుస్తుందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. అదే సమయంలో కోస్తా, సీమల్లో పగటి పూట ఉష్ణోగ్రతలు 1 నుంచి 2 డిగ్రీల చొప్పున పెరగనున్నాయని, దీంతో కొద్దిగా వేడి పరిస్థితులు నెలకొంటాయని వివరించింది.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగ పడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి దినపత్రిక, ఎంబి విజ్ఞానకేంద్రం, డోర్.నెం.27-30-4, గవర్నరుపేట, విజయవాడ-520002కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

ప్రజ్ఞ

1. ప్రధాని మోడీ ఏ రాష్ట్రంలో ఉన్న కొల్లం బైపాస్‌ని జాతికి అంకితం చేశారు?
2. తెలంగాణ రెండో సభాపతిగా ఏవరు ఎన్నికయ్యారు?
3. ఇండియా రబ్బరు ఎక్స్‌పో -2019 ఎక్కడ జరిగింది?
4. ఏషియన్-అమెరికన్ సపిఫిక్ ఐలాండర్స్ అడ్వైజరీ కమిషన్‌లో సభ్యుడిగా ఎన్నికైంది ఏవరు?
5. ఎక్కడ 9వ ఇంటర్‌నేషనల్ మైక్రో ఇరిగేషన్ కాన్ఫరెన్స్ జరిగింది?

సమాధానాలు 7లో

ఎన్నికల తాయిలాలే ఎజెండా

నేడు క్యాబినెట్ సమావేశం



ఫైల్‌ఫొటో

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎన్నికల సందర్భంగా ప్రభుత్వం ఓటర్లకు తాయిలాలు ప్రటించే పనిలో ఉంది. ఇందుకు సంబంధించి సోమవారం సచివాలయంలో జరిగే క్యాబినెట్ సమావేశంలో పలు కీలక నిర్ణయాలను ప్రభుత్వం తీసుకోనున్నట్లు తెలుస్తోంది. మార్చి మొదటి వారంలో ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానుండటంతో ఈలోగానే పలు కొత్త పథకాలకు టిడిపి ప్రభుత్వం వ్యూహరచన చేస్తోంది. ఈ క్రమంలోనే ఇటీవల ఎన్టీఆర్ భరోసా పథకం కింద ఇచ్చే పింఛన్లను రెట్టింపు చేస్తున్నట్లు సిఎం వెల్లడించారు. ఈ అంశంపై మంత్రి వర్గంలో చర్చించి అధికారికంగా ఆమోదముద్ర వేయనున్నారు. డ్వాక్రా సంఘ సభ్యులకు పసుపు కుంకుమ పథకంలో మరో పదివేలు విడతల వారీగా రెండు నెలల్లో చెల్లించే విధంగా కసరత్తు చేస్తోంది. దీంతోపాటు స్మార్ట్ ఫోన్లను అందజేసే ఆలోచనలో ఉంది. ఇందుకు సుమారు రూ.9,600 కోట్లు వ్యయం కానున్నట్లు అంచనా వేస్తోంది. రైతులకు పెట్టుబడి సాయాన్ని అందించేందుకు వీలుగా రైతు రక్ష పథకాన్ని అమలు చేసే అంశాన్ని ఈ సమావేశంలో చర్చించి ఆమోదముద్ర వేయనుంది. ఈ పథకాన్ని కౌలు రైతులకు వర్తింపజేయనుందని సమాచారం. ఆధికార పార్టీ నాయకులకు, భూస్వాములకు మేలు చేసే విధంగా అసైన్డ్ భూములకు సంబంధించిన అంశంపై కూడా ఈ సమావేశంలో అనుమతి ఇవ్వనున్నారు. 20 ఏళ్లుగా అసైన్డ్ భూముల్ని అనుభవిస్తున్న వ్యక్తులకు క్రయవిక్రయాలకు అవకాశం కల్పించేందుకు రంగం సిద్ధం చేశారు. మరోవైపు ఈ నెల 30 నుంచి ఫిబ్రవరి 7 వరకు జరుగనున్న అసెంబ్లీ సమావేశాలపైనా మంత్రివర్గ సమావేశంలో చర్చించనున్నారు.

ఏపి బిల్లులు ప్రవేశపెట్టాలన్న అంశంపై సుదీర్ఘంగా చర్చించి అనుమతి ఇవ్వనున్నారు. ఓటాన్ ఎకౌంట్ బడ్జెట్‌ను మూడు నెలలకే పరిమితం చేయాలా, ఆరు నెలలకు పెంచాలా అనే అంశంపైనా చర్చించనున్నట్లు తెలుస్తోంది. ఎన్నికల్లో కీలకంగా మారనున్న ఉద్యోగుల్ని ప్రసన్నం చేసుకునేందుకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఉద్యోగులకు ఆయా ప్రాంతాల్లో, రాజధానిలో పని చేసే వారికి అమరావతిలో నివాస స్థలాల్ని కేటాయించేందుకు సిఎం చంద్రబాబు సూత్రప్రాయంగా అంగీకరించినట్లు సమాచారం. ఈ అంశంపైనా సమావేశంలో చర్చించి నిర్ణయాన్ని తీసుకోనున్నారు. 11వ పిఆర్సీ నివేదిక వచ్చేందుకు మరికొంత సమయం పట్టే అవకాశం ఉన్నందున, ఉద్యోగ సంఘాల ప్రధాన డిమాండ్ అయిన మధ్యంతర భృతి అంశాన్ని ఈ సమావేశంలో చర్చించకుండా వాయిదా వేసే అవకాశముంది. మరోవైపు రెండు డిఎలు పెండింగ్‌లో ఉండగా ఈ నెల ముగిస్తే మరో డిఎ ఇవ్వాల్సి ఉన్నందున, ఒక డిఎ ఇచ్చేందుకు కూడా నేటి క్యాబినెట్‌లో ఆమోదం తెలపనున్నారు.

రిటర్న్ గిఫ్ట్‌పై టిడిపిలో అంతర్మథనం

టిఆర్ఎస్, వైసిపి, బిజెపిలపై ఎదురుదాడి

పవన్‌పై విమర్శలు గుప్పించొద్దని సూచనలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

'రిటర్న్ గిఫ్ట్'పై టిడిపిలో అంతర్మథనం మొదలయ్యింది. తెలంగాణ సిఎం కెసిఆర్ ఇప్పటికే చంద్రబాబుకు రిటర్న్ గిఫ్ట్ ఇస్తామని ప్రకటించి రాజకీయాలను వేడెక్కించగా, ఆయనొక గిఫ్ట్ ఇస్తే తాను మూడు రిటర్న్ గిఫ్టులు ఇస్తానని సిఎం చంద్రబాబు నాయుడు తాజాగా ప్రకటించిన విషయం తెలిసిందే. గిఫ్టులు ఎలా ఇస్తారనే విషయంలో స్పష్టత లేక పోయినా, ఇప్పటికే దీనిపై రాజకీయపార్టీల్లో చర్చ నడుస్తోంది. ఇప్పటికే ఏపీకి స్పెషల్ ట్రీట్‌మెంట్ ఇచ్చామని కేంద్రం చెబుతోంది. కెటిఆర్, జగన్‌ల భేటీతో తెలంగాణ రిటన్ గిఫ్ట్ పేరుతో గేమ్‌ను మొదలుపెట్టారనే వాదన పార్టీలో చర్చకు తెరలేపింది. ప్రతిపక్షనేత జగన్‌పై విశాఖ ఎయిర్‌పోర్టులో జరిగిన కత్తి దాడి సంఘటన కేసును ఎన్ఐఎకు ఇచ్చి, రాష్ట్ర ప్రభుత్వాన్ని బదనాం చేసే విధంగా కేంద్రం అడుగులేస్తోంది. ఈ కేసును రాష్ట్ర ప్రభుత్వం దర్యాప్తు చేస్తున్న సమయంలో కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవడం రాష్ట్ర హక్కుల్ని హరించడమేననే వాదన తెరపైకి తెచ్చింది. ఎన్ఐఎకు కేసు దర్యాప్తు నుంచి తప్పించాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం శనివారం హైకోర్టులో హౌస్ మోషన్ పిటీషన్ వేసింది. సోమవారం రెగ్యులర్ కోర్టులో ఈ కేసు విచారణకు రానుంది. మరో వైపు కెటిఆర్, జగన్ భేటీ కాగానే తనపై సోషల్ మీడియాలో అభ్యంతర కరమైన పోస్టింగ్‌లు తెర వెనుక ఉండి టిడిపి ప్రచారం చేస్తోందని ఆరోపిస్తూ షర్మిల హైదరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేయడం కెసిఆర్ రిటన్ గిఫ్ట్‌లో భాగమేనన్న అభిప్రాయం రాజకీయ వర్గాల్లో వినపడుతోంది. ఎన్నికలకు సమయం దగ్గర పడుతున్నందున ఈ ఫిర్యాదుతో ఏపీలో శాంతి భద్రతలు లేవని, మహిళలకు రక్షణ లేదని వంటి సంకేతాలు ఇవ్వడంతో పాటు, టిడిపి సానుభూతిపరులను భయబ్రాంతులకు గురిచేయడం వీరి వ్యూహమై ఉండవచ్చనే చర్చ నడుస్తోంది.

కాంట్రాక్టుల కోసమే కేసిఆర్‌తో జగన్ భేటీ

- చరిత్రలో రాయలసీమ ద్రోహిగా నిలిచిపోతారు
- జలవనరుల శాఖా మంత్రి దేవినేని



ప్రజాశక్తి-అమరావతిబ్యూరో

తెలంగాణ సిఎం కెసిఆర్ ఇచ్చే కాంట్రాక్టులు, డబ్బుల కోసం కక్కుర్తి పడ్డ జగన్, రాష్ట్ర ప్రయోజనాల్ని తాకట్టు పెట్టి ఆయనతో భేటీ అయ్యారని జలవనరుల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు ఆరోపించారు. శత్రువు పక్షాన చేరి చరిత్రలో రాయలసీమ ద్రోహిగా మిగిలిపోతారన్నారు. జలవనరులు శాఖ కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలోని ప్రాంతీయ రాజకీయ పార్టీలు కలిసి కలకత్తాలో ఒకే వేదిక పైకి చేరి ప్రజాఫ్రంట్ ర్యాలీని విజయవంతం చేశాయని, 2019లో దేశానికి కొత్త ప్రధాని రాబోతున్నారనడానికి ఈ ర్యాలీయే నిదర్శనమని అన్నారు. మోడీ నిరంకుశత్వానికి వ్యతిరేకంగా, దేశానికి మార్గదర్శకత్వం చేసే విధంగా తదుపరి అమరావతిలో నిర్వహించబోయే ప్రజాఫ్రంట్ ర్యాలీ ఉంటుందని చెప్పారు. కలకత్తా ర్యాలీకి జగన్, కేసిఆర్ ఎందుకు రాలేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పాలమూరు-రంగారెడ్డి, దిండి ప్రాజెక్టులతో రాష్ట్రంలోని 35 లక్షల ఎకరాలకు నష్టం వాటిల్లుతున్నా కెసిఆర్‌ను ప్రశ్నించకుండా జగన్ మిన్నకుండిపోయారని, అలాంటి అవినీతిపరులు రాష్ట్రానికి అవసరమా అని దేవినేని ప్రశ్నించారు. పోలవరం పనులు ఇప్పటికే 64.34 శాతం పూర్తయ్యాయని, నెలాఖరులోపు వైకుంఠపురం బ్యారేజ్, చోడవరం ప్రాజెక్టు, వంశధార-బహుదా నదుల పనులకు సంబంధించిన టెండర్లు పూర్తి చేసే కార్యక్రమంలో ఉన్నామన్నారు.

టిఆర్ఎస్ అడ్డుపడుతున్నా ప్రశ్నించరెందుకనీ: మంత్రి కొల్లు

జాతీయ, రాష్ట్ర విద్యాసంస్థల విభజనకు పదేపదే టిఆర్ఎస్ నేతలు అడ్డుపడి ఏపీ విద్యార్థుల భవిష్యత్తును చీకటి మయం చేస్తున్నా ప్రతిపక్షనేత వైయస్ జగన్ ఎందుకు ప్రశ్నించడం లేదని రాష్ట్ర యువజనశాఖ, న్యాయశాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. ఈ మేరకు జగన్‌కు పలు ప్రశ్నలు సంధిస్తూ బహిరంగలేఖను ఆయన విడుదల చేశారు. కె సిఆర్ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నా ఎందుకు నోరు మెదపడం లేదని ఆయన లేఖలో పేర్కొన్నారు. "హైదరాబాద్‌లోని ఏపీ ఉన్నత విద్యామండలికి చెందిన రూ.135 కోట్లు ఉమ్మడి ఆస్తుల్ని ఏకపక్షంగా స్వాధీనం చేసుకునేందుకు కెసిఆర్ ప్రయత్నిస్తే మీరు ప్రశ్నించరా? విభజనచట్టం 10వ షెడ్యూల్‌లో పొందుపరిచిన ఉన్నత విద్యామండలి, ఇంటర్మీడియట్ బోర్డు, స్టేట్ కౌన్సిల్ ఆఫ్ రీసెర్చ్‌లతో పాటు 21కిపైగా విద్యా సంస్థల విభజనలో రాష్ట్రానికి అన్యాయం చేసిన కెసిఆర్‌తో జగన్ అంటకాగడం దేనికి సంకేతం. కేంద్రీయ విద్యాసంస్థలు, ఉన్నత విద్యా సంస్థల్లో ఇంటర్వ్యూలు నిర్వహించి ఏపీ విద్యార్థులకు అన్యాయం చేస్తున్నా మీరు ఎందుకు మాట్లాడటంలేదు" అని ఆయన ప్రశ్నించారు.

మోడీ దివాలాకోరుతనానికి నిదర్శనం : యనమల

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

దోపిడీ దారులందరూ ఒక్కటయ్యారని ప్రధాని మోడీ అనడం అతని దివాలాకోరుతనానికి నిదర్శనమని, 'సిల్వాసా'లో మోడీ చేసిన వ్యాఖ్యలు ఆయనలోని భయాన్ని వ్యక్తపరుస్తున్నాయని ఆర్థిక శాఖ మంత్రి యనమల రామకృష్ణుడు అన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కోల్‌కతాలో యునైటెడ్ ఇండియా ర్యాలీలో 22 పార్టీల నేతల్ని ఒకే వేదికపై చూడటంతో మోడీ బెంబేలెత్తిపోతున్నారని తెలిపారు. రాఫెల్ కన్నా దోపిడీ ఏముంటుంది? రూ.43వేల కోట్ల దోపిడీ మోడీ ఘనత కాదా? వేల కోట్లు బ్యాంకులకు నీరవ్ మోడీ, చోక్సీ, సందేసరా ఎగ్గొట్టిన జాబితాలో ఉన్నారని, మోసగాళ్ల పరారీ వెనుక ఎవరి హస్తం ఉందని ఆయన ప్రశ్నించారు. రాఫెల్ ధరలు 41శాతం అధికంగా నిర్ణయించి, 14శాతం మాత్రమే ఎక్కువ పెట్టామని చెప్పడాన్ని ఎవరూ నమ్మరని పేర్కొన్నారు. విమాన ధరల్ని పెంచామని ఒప్పుకున్నారని, ప్రజలకు సంజాయిషీ ఇవ్వాల్సిన దుస్థితికి మోడీ చేరారని తెలిపారు. బిజెపి ప్రభుత్వం పతనం అంచున ఉందని, అందుకే మోడీలో అసహనం కనబడుతోందని ఆయన పేర్కొన్నారు. మోడీ పాలన పట్ల వ్యతిరేకతను కోల్‌కతాలో చేపట్టిన ర్యాలీ అద్దం పట్టిందన్నారు. బిజెపి హయాంలో ఎస్సీ, ఎస్టీ, బిసి, ముస్లిం మైనార్టీల్లో అభద్రత నెలకొందని తెలిపారు. కేంద్రంలో మోడీ నియంతృత్వానికి, ప్రజాస్వామ్యానికి మధ్య, రాష్ట్రంలో చంద్రబాబు నీతివంతమైన పాలనకు, జగన్ అవినీతి కుంభకోణాలకు మధ్య రానున్న ఎన్నికల్లో పోటీ ఉంటుందని యనమల పేర్కొన్నారు.

ఇసిబిసి అమలుతో 22 శాతం విద్యుత్ ఆదా : సిఎస్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆంధ్రప్రదేశ్ ఇంధన సంరక్షణ బిల్డింగ్ కోడ్(ఎపిఇసిబిసి)-2017 అమలు వల్ల 20 నుంచి 22 శాతం వరకు విద్యుత్ ఆదా అవుతుందని ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి(సిఎస్) అనిల్ చంద్ర పునేఠా తెలిపారు. ఇంధన సామర్థ్య రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు దీన్ని అమలు చేయాలని, ఫలితంగా ఎపి విద్యుత్ రంగం మరింత బలోపేతమవుతుందని సూచించారు. ఎపిఇసిబిసి అమలుపై ఇంధన, పురపాలక శాఖల అధికారులతో సిఎస్ ఆదివారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. రాజధాని ప్రాంతమంతా బ్లూ, గ్రీన్, అత్యంత ఇంధన సామర్థ్య ప్రాంతంగా ఉండాలని సిఎం ఆకాంక్షిస్తున్నారని తెలిపారు. రాజధాని నగర పరిధిలోని వాణిజ్య భవనాలన్నీ ఇసిబిసి-2017 నిబంధనలకు అనుగుణంగా నిర్మించాలని, దీనివల్ల సామాన్యులకు, సమాజానికి, పర్యావరణానికి లబ్ధి చేకూరుతుందన్నారు. దేశంలో మొత్తం విద్యుత్ వినియోగంలో భవనాల వాటానే 31శాతం ఉందని, 2030 నాటికి ఇది మరింత పెరుగుతుందని వివరించారు. ఇసిబిసి-2017 ముసాయిదా జీవోకు మున్సిపల్ మంత్రి నారాయణ ఆమోదముద్ర వేశారని, త్వరలోనే జీవో విడుదల చేస్తామని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి కరికాల వలవెన్ చెప్పారు. ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి అజయ్‌జైన్, ఎపి ట్రాన్స్‌కో సిఎండి కె విజయానంద్, సిఆర్‌డిఎ కమిషనర్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

హోంగార్డు వేధింపులు తాళలేక యువకుడి ఆత్మహత్యాయత్నం



ప్రజాశక్తి - నందిగామ

హోంగార్డు వేధింపులు తాకలేక యువకుడు ఆత్మహత్యయత్నానికి పాల్పడిన సంఘటన కృష్ణాజిల్లా నందిగామలో ఆదివారం సాయంత్రం చోటు చేసు కుంది. బంధువుల వివరాల ప్రకారం.. స్థానిక నెహ్రూ నగర్‌కు చెందిన ఎస్‌కె షరీఫ్‌పై పోలీస్ స్టేషన్‌లో గతంలో పలు కేసులు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో షరీఫ్ కోర్టు ను ఆశ్రయించగా అతనిపై ఉన్న కేసులను కోర్టు కొట్టివేసింది. మరోమారు షరీఫ్‌పై పేకాట కేసు నమోదైంది. ప్రస్తుత సిఐ పివి రమణ అతనికి కౌన్సెలింగ్ నిర్వహించారు. బంధువుల పూచీకత్తుతో విడుదలయ్యాడు. ఈ నేపథ్యంలో స్థానికంగా ఉండే హోంగార్డు షరీఫ్‌ను ఎక్కడ కనపడితే అక్కడ అవహేళనగా మాట్లాడటం ప్రారంభించాడు. రెండురోజుల క్రితం మయూరి సెంటర్‌లో తన స్నేహితులు, బంధువులతో షరీఫ్ ఉండగా అటుగా వచ్చిన హోంగార్డు తీవ్రపదజాలంతో దూషించాడు. దీంతో షరీఫ్ మనస్తాపం చెందాడు. ఆదివారం కూల్‌డ్రింక్‌లో ఎలుకల మందు కలుపుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన బంధువులు వెంటనే స్థానిక ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యంకోసం విజయవాడ తరలించారు.



పాటలతో చైతన్య పరచిన 'వడ్లమూడి'

ప్రజానాట్యమండలి మాజీ అధ్యక్షులు జగ్గరాజు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

దేశభక్తి పాటలతో పాలకుల ప్రజావ్యతిరేక విధానాలను ఎండగడుతూ ప్రజల్ని చైతన్న పరచిన నాయకుడు వడ్లమూడి నాగేశ్వరరావు అని ప్రజానాట్యమండలి ఉమ్మడి రాష్ట్ర మాజీ అధ్యక్షుడు జగ్గరాజు అన్నారు. ప్రజానాట్యమండలి నిర్మాత, ప్రజాకవి వడ్లమూడి నాగేశ్వరరావు 34వ వర్ధంతి సందర్భంగా రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో స్థానిక మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం సభ నిర్వహించారు. మొదట వడ్లమూడి నాగేశ్వరరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జగ్గరాజు మాట్లాడుతూ వడ్లమూడి అనేక పాటల్ని రచించారని, అమ్మ నాటకాన్ని తెలుగీకరించారని తెలిపారు. ప్రజానాట్యమండలి పునర్నిర్మాణంలో ఆయన కషి వెలకట్ట లేనిదని అన్నారు. ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ అనిల్ కుమార్ మాట్లాడుతూ వడ్లమూడి నాగేశ్వరరావు స్ఫూర్తితో అనేకమంది రచయితలుగా మారారని, ఆయన పాటకు మరణం లేదని అన్నారు. దోపిడీ వ్యవస్థ ఉన్నంతకాలం ఆయన పాట జీవించి ఉంటుందని పాలకుల గుండెల్లో బాకులా గుచ్చుకుంటాయని అన్నారు. ఈ కార్యక్రమంలో పశ్చిమ కష్ణా కార్యదర్శి పి.అప్పన్న, తూర్పు కష్ణా అధ్యక్ష, కార్యదర్శులు జి రంగారెడ్డి, ఎస్ కె ఖాశిం, విశాఖపట్నం జిల్లా కార్యదర్శి గుర్రం రమణ, వడ్లమూడి పద్మ, డివి రాజు, లెనిన్ బాబు, బాలరాజు తదితరులు పాల్గొని వడ్లమూడికి నివాళులర్పించారు.

సెలవుదినం విషాదమయం

మంటల్లో కాలి బాలికకు తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి:

ఆదివారం సెలవు దినాన తీవ్ర విషాదం అలముకుంది. వేర్వేరు ఘటనల్లో ఐదుగురు చిన్నారులు ప్రాణాలపైకి తెచ్చుకున్నారు. కల్తీ శీతల పానీయాలు తాగి నలుగురు చిన్నారులు తీవ్ర అస్వస్థతకు గురికాగా, కట్టెల పొయ్యిను రాజేస్తూ పదమూడేళ్ల బాలిక ప్రమాదవశాత్తూ మంటల్లో కాలి తీవ్రంగా గాయపడింది. ఈ రెండు సంఘటనలు బుచ్చినాయుడు కండ్రిగ మండలం ఆలత్తూరు, శ్రీకాళహస్తి మండలం మద్దిలేడు గ్రామాల్లో చోటు చేసుకున్నాయి. స్థానికుల వివరాల మేరకు.. ఆలత్తూరు పట్టాభి గిరిజన కాలనీకి చెందిన ప్రసాద్ పక్కనే ఉన్న ఓ మోతుబరి రైతు మామిడి తోటలో కాపలా ఉంటున్నాడు. ఈ క్రమంలో ఆదివారం మధ్యాహ్నం తన ఇద్దరు పిల్లలతో కలిసి తోటకు వెళ్లాడు. వీరితో పాటు పక్కింటికి చెందిన ఇద్దరు పిల్లలు కూడా ఆడుకోవడానికి వెళ్లారు.

ఫిబ్రవరి 26న దేశవ్యాప్త ఆందోళనలు

- ప్రతి నిరుపేదకూ భూమివ్వాలి
- బికెఎంయు జాతీయ అధ్యక్షులు పెరియస్వామి



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వ్యవసాయ కార్మికుల సమస్యల్ని పరిష్కరించాలని కోరుతూ ఫిబ్రవరి 26న దేశవ్యాప్తంగా ఆందోళనా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ (బికెఎంయు) జాతీయ అధ్యక్షులు పెరియస్వామి తెలిపారు. రాబోయే ఎన్నికల్లో బిజెపిని ఓడించడమే ముందున్న రాజకీయ లక్ష్యమన్నారు. విజయవాడలోని దాసరి భవన్‌లో ఆదివారం నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర జనరల్ కౌన్సిల్ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు, వ్యవసాయ కార్మికులు, గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేదల సమస్యల్ని ప్రధాని మోడీ పట్టించుకోలేదన్నారు. కార్పోరేట్లు, బడా పారిశ్రామికవేత్తలకు ఊడిగం చేస్తూ కార్మికులకు తీరని అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. నిరుపేదలందరికీ భూమిని పంపిణీ చేయాలని, ఇళ్ల మంజూరు చేయాలని, నరేగాలో ఎలాంటి అవకతవకలకూ తావులేకుండా సమర్థవంతంగా అమలు చేయాలని, పేదలకు విద్య, వైద్యాన్ని అందించాలని, అంటరానితనాన్ని నిర్మూలించాలన్న డిమాండ్లతో ఉద్యమించాలని నిర్ణయించినట్లు చెప్పారు. వ్యవసాయ రంగం సంక్షోభంలో కూరుకుపోవడంతో గ్రామీణ పేదలంతా ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడ్డారన్నారు. కేంద్రంలో మోడీ, రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వాలు పేద ప్రజల వ్యతిరేక ప్రభుత్వాలుగా మారాయని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. రాష్ట్రంలో చంద్రబాబు అధికారంలోకొచ్చి నాలుగున్నరేళ్లు గడుస్తున్నా ఎక్కడా పేదలకు ఒక్క ఎకరం భూమి కూడా పంపిణీ చేయలేదన్నారు. వేలాది ఎకరాల భూముల్ని రైతుల నుంచి ప్రభుత్వం సేకరించి కార్పోరేట్లకు కట్టబెడుతోందన్నారు. భూమికోసం, భుక్తికోసం బికెఎంయూ నాయకత్వంలో జరుగుతున్న పోరాటంలో వ్యవసాయ కార్మికులు, చేతివృత్తిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎపి వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జల్లి విల్సన్, ఆవుల చంద్రశేఖర్, జాతీయ కార్యవర్గ సభ్యులు బండి వెంకటేశ్వరరావు, పి.కేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జలవనరుల శాఖకు గ్లోబల్ ప్లాటినమ్ అవార్డు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

దేశ స్థాయిలో రైతులను ప్రాజెక్టుల్లో భాగస్వాములను చేసినందుకు 'ఎనర్జి ఎన్విరాన్‌మెంట్ ఫౌండేషన్' ఇండియా స్కిల్ డెవలప్‌మెంట్ కేటగిరీ కింద ఎపి రాష్ట్ర జలవనరుల శాఖకు 2019 సంవత్సరానికి గాను గ్లోబల్ ప్లాటినమ్ అవార్డును ప్రకటించిందని ఆ శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు విలేకరులకు తెలిపారు. ఫిబ్రవరి 17న ఢిల్లీలో జరిగే గ్లోబల్ పెట్రో కోల్ అంతర్జాతీయ సదస్సులో అవార్డు తీసుకోవాడానికి రావాల్సిందిగా ఆహ్వానం అందిందని వివరించారు.

నేడు స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ సర్వసభ్య సమావేశం

స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ 13వ సర్వసభ్య సమావేశం సోమవారం సచివాలయంలో మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి ఛాంబర్‌లో జరుగనుంది. పట్టణాల్లో ప్రతిపాదిత ఘన వ్యర్థాల నిర్వహణ, వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ ప్రాజెక్టుల పురోగతిపై బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లు చర్చించనున్నారు.

ఎమ్మార్పీఎస్ సభకు సిపిఐ మద్దతు

ఎస్సి రిజర్వేషన్ల వర్గీకరణకు చట్టబద్ధత కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యానికి నిరసనగా ఫిబ్రవరి 19న ఎమ్మార్పిఎస్ నిర్వహించతలపెట్టిన విశ్వరూప మహాసభకు సిపిఐ రాష్ట్ర కమిటీ సంపూర్ణ మద్దతునిస్తున్నట్లు అపార్టీ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ తెలిపారు. ఎమ్మార్పిఎస్ జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ ఆదివారం విజయవాడ దాసరి భవన్‌లో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణని కలిసి విశ్వరూప సభలో పాల్గొనాలని ఆహ్వానించారు.

23 నుంచి రక్షణ సిబ్బంది సమ్మె

- పాల్గొననున్న నాలుగుల లక్షలమంది ఉద్యోగులు
- సంపూర్ణ మద్దతు ప్రకటించిన సిఐటియు

8

www.prajasakti.com
PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ◆
ప్రజాశక్తి
ప్రతి అక్షరం ప్రజల పక్షం
Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu
సంపుటి : 39 Vol సంచిక : 20 No | విజయవాడ, సోమవారం 21 జనవరి 2019 | 12+12 పేజీలు వెల : 4.00 Rs

అట్టహాసంగా ప్లెమింగో ఫెస్టివల్



శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా సూళ్లూరుపేట మండలం నేలపట్టులో ఆదివారం ప్లెమింగో ఫెస్టివల్ ప్రారంభమయింది. మూడ్రోజుల పాటు జరిగే ఈ ఫెస్టివల్లో దేశ, విదేశాల నుంచి వచ్చిన పక్షులను తిలకించేందుకు పర్యాటకులు తరలివచ్చారు.



170 మంది జలసమాధి

లిబియా తీరంలో రెండు పడవలు మునక

జెనీవా : లిబియా రాజధాని ట్రిపోలికి ఈశాన్యంగా 93 కి.మీ దూరంలో రెండు పడవలు శుక్రవారం మునిగిపోవడంతో అందులో ప్రయాణిస్తున్న 170 మంది వలసకూలీలు జలసమాధి అయినట్లు భావిస్తున్నారు. ఇటాలియన్ తీర గస్తీ దళాలు ముగ్గురు వలసకూలీలను రక్షించి జెనీవా ఒడ్డుకు చేర్చాయి. గురువారం లిబియా నుంచి 120 మందితో బయల్దేరిన ఒక పడవ మధ్యధరా సముద్రంలో మునిగిపోతుండగా ఇటాలియన్ నావల్ హెలికాప్టర్ రంగంలోకి దిగి ముగ్గురిని రక్షించింది. మిగతావారి జాడ తెలియరాలేదు. గల్లంతయినవారిలో రెండు మాసాల పాప కూడా వున్నారు. మొరాకో నుంచి 53 మందితో బయల్దేరిన మరో పడవ ప్రమాదానికి గురి మిగతా 9లో



జల్లికట్టులో విషాదం

ఇద్దరు మృతి

విరాలిమలై (తమిళనాడు) : తమిళనాడులోని విరాలిమలైలో రికార్డు స్థాయిలో నిర్వహించ తలపెట్టిన మెగా జల్లికట్టు విషాదంగా మారింది. మెగా జల్లికట్టులో పాల్గొన్న ఇద్దరు యువకులు మృతి చెందారు. పుదుకొట్టయ్ జిల్లా ఇల్లుపూర్‌కు చెందిన రాము (32), ట్రిచి జిల్లా జియాపురానికి చెందిన సతీష్ కుమార్ (35)లు చనిపోయినట్లు సంబంధిత అధికారులు తెలిపారు. మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో పలు ఎద్దులను జల్లికట్టు ప్రాంగణంలో వదిలిపెట్టారు. చెల్లాచెదురుగా పరిగెడుతున్న ఎద్దుల్లో ఒకటి రామును పొడవడంతో ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. అనంతరం కొద్ది సేపటికి సతీష్‌ను మరో ఎద్దు పొడిచింది. సతీష్‌ను మిగతా 9లో


తల్లి,కూతుళ్లపై లైంగిక వేధింపులు

తట్టుకోలేక తల్లి ఆత్మహత్య


ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పని ప్రదేశంలో తల్లి,కూతుళ్లపై యజమాని వేధింపులు తట్టుకోలేక తల్లి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన హైదరాబాద్ నగర శివారులోని మైలార్‌దేవ్‌పల్లిలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... కాటేదాన్‌లోని మౌనిక వస్త్రాల షాపింగ్‌మాల్ యజమాని పులిజల వివేకానంద (40) అక్కడే పనిచేస్తున్న ఓ అమ్మాయిపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. తన లైంగిక అవసరాలు తీర్చేందుకు పంపాలంటూ ఆమెను, అమె తల్లి కన్యాకుమారి (45)ని కూడా వేధించాడు.

ముగ్గురిలో ఒకరు ఎస్సీ ఎస్టీలే!



- అండర్ ట్రయల్ ఖైదీలు
- ముస్లింలూ పెద్ద సంఖ్యలోనే
- బిసిలకు అత్యధిక మరణశిక్షలు



'ఒక్క నిర్దోషి కూడా శిక్ష అనుభవించకూడదు' అన్నది న్యాయశాస్త్ర విద్యార్థులకు చెప్పే తొలి పాఠం. నేరం చేశారో లేదో స్పష్టం కావాలంటే విచారణ ప్రక్రియ పూర్తి కావాల్సిందే! కానీ ఎటువంటి విచారణ లేకుండా సంవత్సరాల తరబడి జైళ్లలో మగ్గుతున్న వారు ఎందరో! వారిలో కూడా అత్యధికులు ఎస్సీ,ఎస్టీలే! ఆ తరువాతి స్థానం ముస్లింలది! వివిధ కారణాలతో మరణశిక్షకు గురైన వారిలో అత్యధికులు ఓబిసిలు! ఇటీవల జరిగిన ఒక అధ్యయనంలో వెలుగులోకి వచ్చిన ఈ వివరాలు ప్రస్తుతం చర్చనీయాంశంగా మారాయి.

9

వైసిపికి రాధా గుడ్‌బై

జగన్‌కు రాజీనామా లేఖ

2-3 రోజుల్లో కార్యాచరణ

ప్రజాశక్తి - విజయవాడ సిటీ ప్రతినిధి



మాజీ ఎంఎల్ఎ, వైసిపి నేత వంగవీటి రాధాకృష్ణ ఆదివారం ఆ పార్టీకి రాజీనామా చేశారు, సార్వత్రిక ఎన్నికల సమయం దగ్గర పడుతున్నా విజయవాడ సెంట్రల్ సీటుపై పార్టీ అధిష్టానం నుంచి హామీ లభించకపోవడంతో రాజీనామా చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. ఈ మేరకు రాజీనామా లేఖను పార్టీ అధినేత జగన్‌కు పంపారు. రాధాను బుజ్జగించేందుకు పార్టీ సీనియర్ నేత బొత్స సత్యనారాయణ రంగంలోకి దిగినా శాంతించలేదు. 'పేద ప్రజల స్ఫూర్తి, ఆకాంక్షలకు అనుగుణంగానే నా ప్రయాణం. ప్రజల ఆశయాలను కొనసాగించే దిశలో ప్రయాణం సాగించాలన్నదే నా ఆకాంక్ష. సిఎం కావాలన్న మీ కాంక్ష నెరవేరాలంటే వైసిపిలో అందరికీ ఆంక్షలు విధించడం తప్పనిసరి. నా ఆకాంక్ష నెరవేరాలంటే ఆంక్షలు లేని ప్రజా ప్రయాణం తప్పనిసరి' మిగతా 9లో

ప్రభుత్వ విధానాలతో అసమానతలు



కంఠంనేని రవీంద్రరావు స్మారకోపన్యాస సదస్సులో మాట్లాడుతున్న రామన్ మెగసెసే అవార్డు గ్రహీత పాలగుమ్మి సాయినాథ్

- వ్యవసాయాన్ని హైజాక్ చేసిన కార్పొరేట్లు
- గ్రామీణ సమస్యలపై మీడియా దృష్టి పెట్టాలి
- కంఠంనేని రవీంద్రరావు స్మారకోపన్యాసంలో ప్రముఖ పాత్రికేయులు పాలగుమ్మి సాయినాథ్

12

ఢిల్లీని ముంచెత్తిన పొగమంచు

29 విమానాలు ఆలస్యం, 25 రైళ్లు రద్దు

8

ఆదర్శ కమ్యూనిస్టు నరసింహయ్య

కొనియాడిన బివి రాఘవులు

అంతిమ యాత్రలో అశేష జనవాహిని

11





బతుకు చెట్టు!

మనిషి కన్నీటిని తుడిచే
మరో మనిషి కరువైన కాలంలో
గీత కార్మికుడి కన్నీళ్ళను
తనలోకి ఒంపుకొని
అతడిచ్చిన మూడో కన్నులోంచి
ఒక్కో బొట్టూ రాలుస్తూ
ఆ లొట్టి నింపడానికీ
అతడి పొట్ట నిండడానికీ
అలుపెరుగక ప్రయత్నించే
ఈత చెట్టు మనిషికన్నా గొప్పదే!

కార్మికుడి కష్టాల్నీ బాధల్నీ
దాచుకున్నందుకేమో
దాని దేహానికి అన్ని గురుకు గాట్లు!
వట్టి పోయిన నేలమ్మ
వేర్లకు తడినివ్వక పోయినా
మన గొంతుల్ని అమృతంతో
తడిపేందుకు తహతహ లాడుతుంది!

ఎడారి పరిస్థితులను తట్టుకుంటూ
ఎదిగే ఆ ఈత చెట్టు మనిషికి
బతుకు పాఠాలెన్నో నేర్పుతుంది!
ఆ ఈత కొమ్మలు
గాలికి కదులుతూంటే
ఆరోగ్యాలింగనానికి
రారమ్మని పిలుస్తున్నట్లుంది!

ఏ ఆచ్ఛాదన లేని ఎండిన కాయానికి
ఈత కమ్మల గుడిసె అవుతుంది
తాను కార్చిన లొట్టెడు కల్లే
ఆ ఇంట్లో పసిదానికి
కూసింత అన్నమౌతుంది..!
ఈత చెట్టు కార్మికుడి
బతుకు చెట్టయి నిలబడుతుంది!

– వెన్నెల సత్యం
94400 32210

ఈ పేజీలో ప్రచురణార్థం రచయితల నుంచి సాహిత్య వ్యాసాలను, సాహిత్య విమర్శలను ఆహ్వానిస్తున్నాం. వ్యాసాలను కంపోజు చేసి పంపేవారు సాఫ్ట్ కాపీని, పిడిఎఫ్‌ని కలిపి పంపాలి. సమకాలీన రచనలపై విమర్శనాత్మక వ్యాసాలకు ప్రాధాన్యం ఉంటుంది. సమీక్ష కోసం పుస్తకాలను పంపేవారు రెండు కాపీలను పంపాలి. చిరునామా : అక్షరం, ప్రజాశక్తి సాహిత్య పేజీ, ప్రజాశక్తి కార్యాలయం, ఎంబి విజ్ఞాన కేంద్రం, గవర్నరుపేట, విజయవాడ - 2.
prajasavvadi@gmail.com



'వృద్ధ జగతి సమాధిపై
నవధర్మం ప్రభవించును
నిద్దుర చీకటి వెలుపల
వేకువ మెలకువ పుట్టును..'
- అవంత్స సోమసుందర్

పద ప్రయోగాల కేళి 'సినీవాలి'

ప్రయోగం

ఆధునికాంధ్ర సాహిత్యలోకంలో పుట్టని బిడ్డకు పేరు పెట్టబడిన ఒకే ఒక వచన కవితాత్మక కథా కావ్యం డాక్టర్ ఆరుద్ర గారి 'సినీవాలి'. దీనికో కథ– కమామీషూ ఉంది. కాటూరి వేంకటేశ్వరరావు గారు భారత సాహిత్య అకాడమీ పక్షాన 'తెలుగు కావ్యమాల' గ్రంథాన్ని సంకలనం చేస్తూ.. ఆరుద్ర రచనలను కొన్నింటిని చేరుస్తూ 'త్వమేవాహం' పేరును రాయడం మరచి 'సినీవాలి' అని పేర్కొన్నారు. ఆరుద్ర సినీ కవి కాబట్టి బహుశా ఆ పేరును పేర్కొని ఉండొచ్చు. అది గ్రహించి, ఆరుద్ర ఊరుకోకుండా వచన కవితా కథాకావ్యాన్ని రాసి, కాటూరి వారి మాటను నిజం చేసి కూర్చున్నారు. దీన్ని సినీనటుడు జగ్గయ్యకు అంకితం చేశారు. కాటూరి వారిచే 'బారసాలనాడు' అన్న పేరుతో ప్రస్తావనను రాయించారు. అల్లుడయ్య జగ్గయ్య కూడా 'ఆమెన్' స్వీకరిస్తూ, సంతోషంగా నాలుగు మాటలను రాశారు.

ఇంతకీ, 'సినీవాలి' అంటే చంద్రకళ కనబడే అమావాస్య అనీ, సర్వమంగళ అయిన పార్వతి అనీ అర్థాలు. ఈ కావ్యారంభంలో ప్రత్యేకంగా 'స్వవిషయసూచిక'గా 'సాహిత్యోపనిషత్ అనే పేరుతో ఒక సుదీర్ఘ కవితా ఖండిక కనిపిస్తుంది. ఇది ఆరుద్ర, శ్రీశ్రీ, వరద రాజేశ్వరరావుల మధ్య సంభాషణాత్మకంగా జరిగిన ఆధునికాంధ్ర కవిత్వంపై గొప్ప విశ్లేషణ. నేటి సాహితీ యువతరం తెలుసుకోదగిన రచన ఇది. 'నిన్నటి నుంచి ఇవాళలాగ నిరుటి కవుల నుంచి నేటి కవులు పుడతారు. వానలాగ ప్రజల హృదయాల్లో వర్షించి కొత్త భావాల బీజాలు జల్లేది కవిత్వం... 'ప్రజాస్వామ్యాన్ని అంగీకరిస్తూనే కవి మెజారిటీకి అందని ఊహలు వెదకాలి..' (పుట–2) కవిత్వం సైన్సు కారాదు కవి రచన కఠినమైన థీసిస్సు కావాలి అది ఏడాదిలో ఒయాసిస్సు అనుభవాల తేటసదస్సు (పుట–3), 'నవత్వం ప్లస్ మానవత్వం ఇజీక్వల్ టు కవిత్వం (పుట–7). ఈ మాటలు నేటికీ కవితాలోకంలో వ్యాప్తిలో ఉన్నాయి.

ఈ 'సినీవాలి' వచన కావ్యం అయిదు ప్రకరణాలతో, చివర తప్పొప్పులు పట్టిక' అన్న వచన కవితా ఖండికతో కూడి ఉంది. ఇందులో క్లార్కు సూర్యారావు జీవిత గాథ ఉంది. ఇతడు సగటు మనిషి. జీవితంపై అనేక ఊహలూ, ఆశలూ, ఆశయాలూ ఉన్నవాడు. ఇతడు నాగరికతల గరం గరంతో వేగిపోయే నవీన నగరంలో నివసించాలనే కోరికలున్నవాడు. 'నేడమావాస్య' (పుట–19) అన్న వాక్యంతో ప్రారంభించి మొదటి ప్రకరణంలో ఆరుద్ర అపూర్వంగా ఆధునిక నగరాన్ని వర్ణిస్తారు. 'ఒకరితో ఒకరికి సంబంధం ఉండీ ఉండనట్టు అంటీ ముట్టనట్టు తెలిసీ తెలియనట్టు జీవిస్తున్నా ఆధునిక కవిత్వంలోని పద్య పాదాల్లో కనబడుతున్నా ఆధునిక నగరంలోని ప్రజలు ఒకే హారంలోని పూసలు (పుట–21) అంటారు ఆరుద్ర. 'ఆడదాని మీసాల్లాగ అసందర్భంగా మొలచిన పేటలతో... నగరం నిన్ను ఆహ్వానిస్తుందంటారు. 'అసమర్థుని పరిపాలనలాగ అంధకారం ఆవరించింది నగరాన్ని' (పుట–24) అని అంటారు. 'కన్నీళ్ళ సిరాతో కావ్యాలు విరచించేవారు వ్రయ్యలైన హృదయ శకలాలతో బొమ్మరిల్లు కట్టుకొనేవారు' (పుట–28) నగరంలో ఎక్కువ అని అంటారు. ఒక తాతగారికీ, సూర్యానికీ జరిగిన సంభాషణగా నగరంలోని విశేషాలను విశిష్టంగా వర్ణించిన పిమ్మట 'రాజకీయ ననంద' (అంటే 'ననంద' అనే పేరుగల రాజకీయమనే స్త్రీ అన్నమాట) జీవన ఫలాన్ని ఇస్తానంటే క్లార్కు సూర్యారావు వంటి వాళ్లు 'మీరిచ్చే జీవన ఫలం నన్ను పేకాటలో గెలిపిస్తుందా? నా దరిద్రం బట్టతల మీద సిరుల కురులు మొలిపిస్తుందా? (పుట–40) ఇత్యాదిగా కోరతారన్నట్లుగా నగర ప్రజల స్వభావాన్ని విశిష్టంగా వ్యక్తీకరిస్తారు

రెండో ప్రకరణాన్ని తండ్రి చాటు బిడ్డైన సూర్యారావు పెండ్లి చూపుల ముచ్చటను స్వయంవర సన్నివేశ రూపంలో సంభాషణాత్మకంగా, ఉత్కంఠ భరితంగా నడిపిస్తారు. విశేషణం లేని పదంలాగ వివాహం కాని జీవితం అసుందరం





(పుట–42) అంటాడు. తండ్రి – సూర్యారావుతో ఈ పోలిక నాఘ్రాతకుసుమం విశేషణం అనేది నామవాచకానికి ఎంత విలువనిస్తుందో, ఆ భాషాశాస్త్ర సౌందర్యాన్ని మనిషి వివాహ జీవితానికి ఉపమాన వస్తువుగా చెప్పడంలోనే 'ఆరుద్రతనం' అనేది ఉంది. అప్పుడు కొడుకు సూర్యారావు 'నిజమే నాన్నగారూ! జీవితం రేడియో సెట్టుకి భర్త ఏరియల్ భార్య ఎర్తు రెండూ ముఖ్యమేగాని నా జీవితంలో అంత నిర్దుష్టమైన ప్రసారం అక్కర్లేదు. నా జీవితానికి ఎంత వాల్యూము కావాలో నాకు తెలుసు.. నాకు కావలిసిన సఖురాంధ్ర స్టేషన్లు నేను వెతుక్కోగలను (పుట–44) అని అంటాడు. ఇలాంటి ఆధునిక రూపకాలంకారాలు ఈ కావ్యంలో కోకొల్లలుగా కనిపిస్తాయి. అప్పుడు తండ్రి 'పెండ్లి యీడు కొడుకున్న తండ్రికి రావలసిన కట్నం పోకూడదు.. ఇక్కడికి ముగ్గురు విలాసినులొస్తారు వాళ్ళు ఎంతెంతో కట్నం తీసుకొస్తారు. నీ చేతిలో ఈ మలాకా జాంపండు పెడుతున్నాను నీకు నచ్చిన కన్యకది బహూకరించు' అంటాడు.

మొదటగా వచ్చినవారు శ్రీమంతులు. 'మీకేదంటే ఇష్టం?' అని అడిగిన సూర్యంతో ఆ మొదటి అమ్మాయి 'ఊరవతల చెరువుగట్టు మీద ఇంద్రధనస్సు రంగుల గొడుగుల కింద కూల్‌డ్రింక్స్ తాగుతూ కులాసా కబుర్ల కన్నా ఏం కావాలి? ఇత్యాదిగా చెబుతూంటే 'ఖరీదైన ఆడవాళ్ల భర్తలు ఖరీదైన పెంపుడు కుక్కలు' అని ఆమెను తిరస్కరిస్తాడు. రెండో అమ్మాయిని ప్రవేశ పెట్టమని సూర్యారావు సేవకుని ఆదేశిస్తే వాడు 'నాన్నగారు రావద్దా, బాబూ? పెద్దోళ్ళు సెప్పందే పెళ్ళి సూపులు పద్దాలు (పద్యాలు) లేని నాటకంలా ఉంటుంది.' అని అంటాడు. ఇది కూడా ఆరుద్ర మార్కు పోలికే. ఆ రెండో అమ్మాయి 'ఆధునిక వ్యాపారమంటే నాకిష్టం' అంటుంది. ఆమె భావాలు సూర్యారావుకు నచ్చవు. అయితే పొరపాటున ఆమెకు మలాకా జాంపండునిస్తాడు. 'అది నాకు ఇచ్చేయండి ఈ యాపిలు పండు తీసుకోండి... ఏ ఎండకా గొడుగు పట్టే వాళ్ళని ఎన్నడూ క్షమించలేము' అని అంటాడు. ఆమెను తిరస్కరిస్తాడు.

మూడో అమ్మాయి ఇంకా రాలేదు. ఈలోగా సూర్యారావు ఎదుట ఒక ఊహాసుందరి వచ్చి నిలబడినట్లుగా ఆరుద్ర కల్పన చేస్తారు. 'నీ వెవరవ'ని అడుగుతాడు సూర్యారావు. ఆకాశంలో పల్టీలు కొడుతున్న తెగిన గాలిపడగనీ, సరోవరంలోని నీటి బడగనీ ఎవరు మీరని అడిగితే ఏమని సమాధానం చెప్తాయి?' అని ప్రశ్నకు ప్రశ్నగానే బదులిస్తుంది. 'నీవెందుకు వచ్చావ'ని అడిగితే 'పుష్పం ఎందుకు వికసిస్తుందో పుష్పానికి తెలుసునా? గాలి ఎందుకు వీస్తుందో ఎవరికి తెలుసు?' అంటుంది. ఇక్కడికి రావడానికి ముందు ఎక్కడ నుంచి బయలుదేరారు? ఇక్కడి నుంచి మీరు ఎక్కడికి వెళ్తారు?' అని ప్రశ్నించిన సూర్యారావుకి 'చీకట్లో బయలు దేరాను వెలుగులోకి వెళ్లానుకుంటాను. ఒంటరిగా బయల్దేరాను జంటను వెతుక్కోవాలను కుంటున్నాను.' అంటుంది. ఊహాసుందరి 'నిన్నటి దాకా జైల్లో ఉన్నాను ఇప్పుడే ఇలా వచ్చాను.' అని కూడా అంటుంది. 'ఏమిటి మీరు చేసిన నేరం?' అని అడుగుతాడు సూర్యారావు. 'అక్షరాల్లో పరుషాలుండకూడదన్నాను.. అనాథగా, అసహాయంగా ఉండడం నా నేరాలు...' అని అంటుంది. 'అక్షరాల్లో పరుషాలుండకూడదన్నాను' అన్న వాక్యం ప్రతీకాత్మకం. అంటే జీవితంలో కష్టాలుండకూడదని భావార్థం. జీవితం అన్న తర్వాత కష్టాలు రాకుండా ఉంటాయా? కానీ ఊహల్లో మాత్రం కష్టాలను దరికి రానివ్వం' ఆశయాల బియ్యంలో అవరోధాల మట్టిబెడ్డలుండకూడదన్నాను..' అన్నది రూపకాలంకార రూపవాక్యం. 'శ్రేయంసి బహువిఘ్నాని' మంచి పనులకు ఆటంకాలు ఎక్కువగా వస్తాయి మరి. ఇలా ప్రతీకాత్మకంగా కొత్త పోలికలతో రూపకాలతో నడపడం ఆరుద్రకు ఒక సరదా. అసలిది నల్లేరుపై బండినడక ఆయనకు. చివరికి 'చైతన్యం కావాలి జీవించడానికి చలనం కావాలి' అన్న అభిప్రాయాన్ని వ్యక్తీకరించిన ఊహా సుందరికి తన హృదయమనే జాంపండునిచ్చేశాడు సూర్యారావు.


ఇంతలో మూడో అమ్మాయి వస్తుంది. తండ్రితో మా అమ్మాయి నచ్చితే వెంటనే పెళ్ళి చేసుకో.. భరతనాట్యం నేర్పించానంటాడు తండ్రి. 'భర్త ఉద్దేశాల తాళాలతో భరతనాట్యం చెయ్యగలను' అని అంటుంది ఆ మూడో అమ్మాయి. ఊహా సుందరియే తన పంచప్రాణాలంటాడు సూర్యారావు. మూడో ప్రకరణంలో క్లార్కు సూర్యుడు 'వైవాహిక జీవితమనే స్విమ్మింగ్ పూల్లో వైపుతో ఈదడానికి ముందు ప్రణయమనే షవర్‌బాత్ ప్రారంభించాడు.' అంటారు ఆరుద్ర. నాలుగో ప్రకరణంలో క్లార్కు సూర్యారావు జీవితంలో నిజమైన అమావాస్య మొదలైంది. చిక్కని సంతోషాల చిలుకలెగిరిపోయాయి. ఇక్కట్ల గబ్బిలాలు ఇంట్లో స్థిరపడ్డాయి. దేవాలయాల కెన్నడూ పోనివాడీనాడు దేవుడనే లాటరీ టిక్కెట్టును కొన్నాడు. యన్‌జీవో సూర్యుని అనంతర జీవన విధానాన్ని వర్ణించడంలో జవ జీవం గలిగిన రూపకాలంకారాలను ఆరుద్ర చేవకొద్దీ వాడినట్లుగా పాఠకులకు తెలుస్తుంది. ఆనందాన్ని కలిగిస్తుంది. క్రమంగా అతనికి నిద్ర కరువైంది. నిద్రలో, తెలివిలో తన బాధలకు కారణాలను అనేక రకాలుగా భావిస్తాడు. సూర్యారావు చైతన్య సీమలో ప్రశ్నల గాలివాన చెలరేగిందంటారు ఆరుద్ర. 'బతుకెందుకింత చేదు? నాకెందుకు సుఖం లేదు' అన్న ప్రశ్నలతో నాలుడో ప్రకరణం ముగుస్తుంది.

అయిదో ప్రకరణలో కూడా పార్కులో క్లార్కు సూర్యారావు ప్రశ్నల జవాబుల అన్వేషణే కనిపిస్తుంది. పుస్తె కట్టిన ఆలు పుట్టింటికి వెళ్లిందంటారు. ఆరుద్ర కొత్త సౌఖ్యాలను మళ్ళీ కలగంటాడు. ప్రశ్నోపనిషత్తు కలతగా కొనసాగుతూనే ఉంటుంది. మృత్యువు సమీపానికి వచ్చిన అనుభూతిని పొందుతాడు సూర్యారావు. 'అయ్యా మృత్యువుగారూ పిల్లల వాణ్ణి దయ చేసి కనికరించండి. పండక్కి కొర్కెల గోడలు వెల్లవేయించండి. పడిపోయిన యౌవనం పెరటి గోడలు ఏడైనా మరమ్మతు చేయించండి.' అని రాస్తారు. అమావాస్య లాంటి మధ్య తరగతి జీవితంలో ఆశారూప చంద్రకళను ఆకాంక్షిస్తున్నాడు. అలా ఆకాంక్షించడం మధ్య తరగతి మానవుని స్వరూపం అన్నట్లుగా రచన చేశారు ఆరుద్ర. యన్‌జీవో సూర్యుడు ఆత్మహత్య మాత్రం చేసుకోడు. సగటు మనిషి జీవితం ఎంతగా 'తప్పొప్పుల పట్టిక' అయినా (ఈ పేరుగల కవితతోనే ఈ కావ్యానికి ముగింపు) 'కొత్త టైపు సృష్టించుకుందాం. మొత్తం కావ్యం పునర్ముద్రిద్దాం' అన్న ఆత్మవిశ్వాసంతోనే ఉంటాడట.. అలా ఉండాలిట సాధారణ మానవుడు. అందుకే 'సమకాలిక జీవన విభావరిలో (జీవనరాత్రిలో) తమస్సులు ఘనీభవించాయనుకోవడం తప్పు. అతి సన్నని వెలుగురేక లేదనుకోవడం తప్పు. ఆశా చంద్రకళ గల ఇది సినీవాలి అనడం ఒప్పు' అని కావ్యాన్ని ముగించి, 'సినీవాలి' అన్న పేరును సార్థకం చేశారు ఆరుద్ర. మొత్తం మీద ఒక్క వాక్యంలో చెప్పాలంటే కవితా ప్రతీకల, విశిష్టపద ప్రయోగాల కేళి ఆరుద్ర 'సినీవాలి'.

– డాక్టర్ రామడుగు వేంకటేశ్వర శర్మ,
98669 44287

మట్టిరంగు కవిత్వం బొమ్మలు

పుస్తకం



అపుడెపుడో 'నా చూపుడువేలు మీద భూగోళాన్ని నిలబెడతాను' అన్నాడు ఓ నియంత. ఇపుడు 'నాగళ్లమొనల మీద' కవిత్వాన్ని నిలబెట్టాడు సిరికి స్వామినాయుడు. భూగోళాన్ని చూపుడువేలు మీద నిలబెడతానని విర్రవీగిన నియంత కాలగర్భంలో కలసిపోయాడు. అతడి చరిత్ర ప్రజల కన్నీటి ప్రవాహంలో కొట్టుకుపోయింది. నాగళ్లమొనల మీద కవిత్వాన్ని నిలబెట్టిన కవి కాలంలో నిలిచిపోయాడు. ప్రజల కష్టాల్నీ, కన్నీళ్లనీ కవిత్వీకరించి సరికొత్త చరిత్రకు ప్రాణం పోసేడు. ఈ సత్యాన్ని ఎప్పుడో గ్రహించిన మహాకవి జాషువా ..

'రాజు మరణించెనొక తార రాలిపోయె
కవియు మరణించెనొక తార గగనమెక్కె
రాజు జీవించె రాతి విగ్రహములందు
సుకవి జీవించె ప్రజల నాల్కల యందు' అన్నారు.

ఇపుడు అదే సత్యాన్ని వర్తమాన తరానికి చాటిచెప్పేందుకు సిరికి స్వామినాయుడు 'నాగళ్ళ మొనలమీద' కవిత్వం చెక్కుతున్నాడు. తూరుపువాకిట కవిత్వం కళ్లాపి చల్లుతున్నాడు. కొత్త ఉదయాలకోసం అక్షరతోరణాల్ని కడుతున్నాడు. తను పుట్టిన మట్టితో... తను నిలబడ్డ మట్టితో... తను ప్రాణవాయువు పీలుస్తున్న మట్టితో... కవిత్వం బొమ్మలు తయారుచేస్తున్నాడు. కళింగాంధ్ర నేలమీద అభివృద్ధి పేరుతో జరుగుతున్న విధ్వంసాన్ని నిలదీస్తున్నాడు. తన ధిక్కార స్వరానికి కొత్తరంగు పులుముకొని కవిత్వాన్ని, విల్లమ్ముగా ఎక్కుపెడుతున్నాడు.

స్వామినాయుడు ఉత్తరాంధ్ర ప్రాంత ప్రజా సంక్షోభాల్లోంచి పుట్టిన కవి. ఉద్యోగరీత్యా ఉపాధ్యాయుడై, గిరిజన ప్రాంతాల్లో పనిచేయడం వల్ల, అక్కడి ప్రజల నిత్యజీవితాల్లోని అలజడిని దగ్గరగా చూడగలిగారు. నేలను నమ్ముకున్న రైతులకు, రైతుల్ని నమ్ముకున్న నిరుపేద కూలీలకు జరుగుతున్న అన్యాయాన్ని కళ్లారా చూసి, పేగులతో దుఃఖాన్ని పేనుకొని, ఆ బాధను కవిత్వంగా ఆవిష్కరించారు. కవి నిరంతరం రగిలే నిప్పుకొండలాంటి వాడు. నిత్యం ప్రవహించే నదిలాంటి వాడు. కవి సామాజిక స్థితిగతులను చూసి రగిలిపోవాలి. కవిత్వమై ప్రవాహంలా సాగిపోవాలి. స్వామినాయుడు 2011లోనే 'మంటి దివ్వె'ను వెలిగించారు. తన ఆర్తినీ ఆవేదననూ గుండెచప్పుళ్లనూ కవిత్వంగా మార్చి తానేమిటో నిరూపించుకున్నారు.

ఈ నేపథ్యంలోనే పత్రికల్లో వచ్చిన కవిత్వం ద్వారా స్వామినాయుడు నాకు పరిచయమయ్యారు. నాయుడి వాక్యాల్లో తళతళ మెరిసే కవిత్వ సిరి'ని చూసి, నేను వారికి అభిమానినయ్యాను. మంచి కవిత్వం ఎక్కడ కనబడ్డా భుజంతట్టే స్వభావమున్న మా గురుదేవులు డాక్టర్ నాగభైరవ కోటేశ్వరరావుగారిలాగే నేనూ చాలామంది వర్తమాన కవుల 'పెన్ను' తడుతూ కవిత్వాన్ని ముద్దుచేస్తున్నాను. స్వామినాయుడుగారి 'మట్టిరంగు బొమ్మ'లన్నీ కవిత్వంతో మెరిసిపోతున్నాయి. తన కలంతో తమను సృజించినందుకు మురిసిపోతున్నాయి.

'పడమటనదిలో మునిగిపోయింది – పొద్దు' అంటాడు కవి. ఇక్కడ 'పొద్దు' అన్నంముద్ద కరువైన మనిషికి సంకేతం. 'పడమటనది' ప్రపంచీకరణకు చిహ్నం. ఆకలితో అతడి బతుకు తెల్లారబోతుందని చెప్పడానికి 'తమ రెక్కలపై చీకటిని మోసుకొస్తూ – పక్షులు', పంటపోయిన పత్తిపొలం లాగుందీ – ఆకాశం', 'దిగులుమబ్బుల మాటున ఒంటరి రైతులా – నెలవంక' ఈ ప్రతీకలన్నీ స్వామినాయుడి కలం ఎగరేసిన సరికొత్త కవితాపతాకాలు. పొలాలెందుకు మృత్యుశాలలుగా మారుతున్నాయో... బాగా తెలిసిన స్వామినాయుడికి పొలానికెళ్లిన రైతు, యుద్ధభూమిలో సైనికుడిగా కనిపించాడు. మట్టిని ప్రేమించి, పూజించి, మట్టిలోనే పొలి అయ్యేందుకు ఇష్టపడే రైతును గురించి రాసే ఒకరిద్దరి ఆధునిక కవుల్లో స్వామినాయుడు గారూ ఒకరైందుకు గర్వపడుతున్నాను. రైతును గురించి రాయకపోతే ఆ కలానికి కవిత్వానికి సార్థకత లేదు.

'ఉద్దానమా... ఊపిరి తీసుకో!' కవిత చదివి కంటతడి పెట్టాను. కవిత్వానికి కంటతడి పెట్టించే శక్తి ఉందా?... అంటే స్వామినాయుడు గారి కవిత్వపు బొమ్మలకుందని కళ్లారా చూసాను. 'అంతుచిక్కని మరణాల వెనుక ఆరని కన్నీటిజలపాతాల్ని' గుర్తించిన నాయుడు 'జీడిపిక్కంత మూత్రపిండం జీవనాథుల్ని తెంపేస్తోందన్నాడు. 'మందలో మేకపిల్ల మాయమైనట్టు మందిలో ఒకడై పలకరించిన మనిషి మరోసారి కానరాని దైన్యాన్నీ, 'పాడెత్తని రోజే వాళ్లకు పండగ' అంటూ తీవ్రవిషాదాన్నీ మన కళ్లముందు కుప్పపోసాడు . 'పచ్చని పల్లెల్లో వల్లకాటి వైరాగ్యం' దాపురించిందని కుమిలిపోయాడు. 'జనన మరణాల మధ్య జీవితాలు– చిట్లిపోతున్న నీటిమొగ్గ'లంటాడు. 'ఊళ్లకు ఊళ్లు వల్లకాళ్లు'గా మారిపోతున్న ఉద్దానాన్ని చూసి 'వలవలా ఏడుస్తోంది వంశధార' అని అనగానే ఒక్కసారిగా నా కళ్లల్లో గుళ్లకమ్మలు ప్రవహించాయి.

ఈ దుస్థితికి కారణమెవరని నేను అడగడం లేదు. కనీసం మనిషివేపు కన్నెత్తి చూడని పాలకవర్గాల దుర్మార్గాన్ని ప్రశ్నిస్తున్నాను. ప్రశ్నించని వాడు కవి కాడు. కవిత్వం శాశ్వత ప్రజాపక్షమంటాడు స్వామి నాయుడు. ప్రజలపక్షాన నిలబడి గొంతెత్తనినాడు కవికి ఉనికి లేదు. స్వామినాయుడు అక్షరాలా ప్రజలకవి. పీడితసమాజం నుంచి పుట్టుకొచ్చిన కవి. స్వార్థపురెక్కల్ని తెగనరుకుతున్న కవి. పాలక వర్గాల దుశ్చర్యల్ని తూర్పారపడుతున్న కవి. నిర్భయగళంతో కలమెత్తి కవిత్వపుకాన్వాసు మీద కొత్తరంగుల్ని అద్దుతున్న కవి. సిక్కోలు మట్టిపొరల్ని చీల్చుకొని శిరసెత్తిన కవిత్వపు మొలకలాంటి కవి. కవిత్వం ఒక 'ఎదురీత'ని తెలిసినా 'అనివార్యం'గా 'చితిమంటల కెరటాలమీద' నడుస్తున్న సాహసి స్వామినాయుడు. నేలపొరల్లో ఇంకిపోయిన తరతరాల గాయాల చరిత్రను బయటకు తీసి ఏమంటున్నారో చూడండి .

'చాలుపోసే నేలమీద స్మార్ట్ సిటీలు/ హలాలు తిరిగే పొలాల మీద హబ్ లు పుట్టుకొచ్చాక/ రైతులు లేని రాజధానులు నిర్మితమయ్యాక/ నేలమీద అనాదిగా నాగేటికర్ర ఆలపించే జీవనగీతం మూగపోతుంది.'

ఈ పంక్తి చాలు, సిరికి స్వామినాయుడి కవితాసిరి ఎంతగొప్పదో చెప్పటానికి. వర్తమాన సంక్షోభాన్ని కళ్లముందు నిలిపే వస్తువు, దాపరికంలేని భాష, ప్రవాహంలా సాగిపోయే భావధార, ఈ మూడింటినీ కలిపే అభివ్యక్తి నైపుణ్యం స్వామినాయుడుని విలక్షణకవిగా నిలబెట్టాయి. కవిత్వంలోనే కాదు, జీవితంలోనూ కొన్ని సామాజిక విలువలుండాలని బలంగా నమ్మే నాయుడు, ఉత్తరాంధ్ర ప్రాంతపు వర్తమాన కవులకూ కథకులకూ ఆరాధ్యుడైన గంటేడ గౌరునాయుడు గారికి ఈ కవితా సంపుటిని అంకితమిచ్చి తన నిలువెత్తు సంస్కారాన్ని చాటుకున్నారు. 165 పేజీల ఈ కవితా సంకలనంలో ఏ పుటను తెరచినా పుటం పెట్టిన బంగారంలాంటి కవిత్వం మెరిసిపోతుంది. మంచి బంగారానికి మెరుగుతో పనేముంది ?

'కవిత్వం రాయడమంటే/
తెల్లని ఆకాశం మీద నాలుగు సిరాచుక్కలు కక్కటం కాదు,
ఒక వాక్యంకోసం నిద్ర లేని రాత్రుల్నీ
మెతుకు ముట్టని పూటల్నీ మోసుకు తిరగాల!
నిధి కోసం తవ్వినట్టు
ఏ అట్టడుగు పొరల్లోనో దాగున్న పదంకోసం
గుండెను తవ్వుకు పోవాల !
నిన్ను నువ్వు నిట్టనిలువునా దహనం చేసుకోవాల !
కన్నీళ్లలోంచి మొలకెత్తి కవితగా రూపు కట్టాల !

ఎలా రాస్తే కవిత్వమవుతుందో తెలిసిన సిరికి స్వామినాయుడి కవిత్వానికి వీరాభిమానిని నేను. నా మాట నిజం కాకపోతే స్వామినాయుడుని అవార్డులతో సత్కరించిన వాళ్లను అడగండి. మంచి కవిత్వాన్ని ఇష్టపడే మిత్రులారా... ఈ మట్టిరంగు బొమ్మల్ని తడిమిచూడండి. మీ గుండె బరువెక్కకపోతే నన్నడగండి!

– డాక్టర్ బీరం సుందరరావు
94911 63932

దామోదరం సంజీవయ్య స్మారక రచనల పోటీ

ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య స్మారకార్థం కథ, కవితల పోటీ నిర్వహిస్తున్నాం. కథకు : మొదటి, రెండవ, మూడవ బహుమతులు వరుసగా రూ.3,000, రూ.2,000. రూ.1,000; కవితకు : వరుసగా రూ. 2,000, రూ.1,116, రూ.1,000 అందిస్తాం. కథలు చేతిరాతలో 5–7 పేజీలు, కవితలు 30 పంక్తులు మించకూడదు. జిరాక్స్ కాపీలు పంపవద్దు. రచనలు చేరేందుకు ఆఖరు తేదీ : ఫిబ్రవరి 21. పంపవలసిన చిరునామా : డి.ఎస్. సిద్ధార్థ సాంస్కృతిక, సామాజిక సేవా సంస్థ, ప్లాట్ నెంబరు 105, మహాలక్ష్మీ టవర్స్, దేవాపురం 5వ లైను, ఎన్టీఆర్ మున్సిపల్ స్టేడియం వెనుక, బృందావన్ గార్డెన్స్, గుంటూరు – 522006. మరిన్ని వివరాలకు చరవాణి : 80081 89979.

– ఎస్ఆర్ రావు

కథల పోటీ

అర్చన ఫైన్ ఆర్ట్స్ అకాడెమీ, శ్రీశారద సత్యనారాయణ మెమోరియల్ చారిటబుల్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో కథల పోటీ– 2019 నిర్వహిస్తున్నాం. మొదటి బహుమతులు ఐదు.. ఒక్కోటి రూ.2,000 చొప్పున; రెండవ బహుమతులు 10 ఒక్కోటి రూ.1.000 చొప్పున. బహుమతి పొందిన కథలు ప్రముఖ వెబ్ పత్రికల్లో ప్రచురింపబడతాయి. హైదరాబాద్‌లో జరిగే సభలో విజేతలకు బహుమతీ ప్రదానం ఉంటుంది. ఇతివృత్తం మీ ఇష్టం. వర్డ్‌ఫైల్‌లో నాలుగైదు పేజీల్లోపు ఉంటే మంచిది. యునికోడ్‌లో టైపు చేసిన స్క్రిప్టులు మాత్రమే పంపాలి. కథలు పంపాల్సిన మెయిల్ ఐడి : rachanalu2019@gmail.com

– కోసూరి ఉమా భారతి
అర్చన ఫైన్‌ఆర్ట్స్ అకాడెమీ

23న 'వెన్నెల కౌగిళ్ళు' పుస్తకావిష్కరణ

నవ్యాంధ్ర రచయితల సంఘం ఆధ్వర్యంలో ఈనెల 23వ తేదీ బుధవారం సాయంత్రం 6 గంటలకు విజయవాడ గాంధీనగర్ హోటల్ ఐలాపురం ఏసీ కాన్ఫరెన్స్ హాల్లో వెన్నెల రచించిన 'వెన్నెల కౌగిళ్ళు' పుస్తకావిష్కరణ జరుగుతుంది. ఆవిష్కర్త– ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి.రజని. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ ఛైర్మన్ ఆచార్య కొలకలూరి ఇనాక్, పద్మశ్రీ డా.తుర్లపాటి కుటుంబరావు, ఎ.విజయ్‌కుమార్, అద్దంకి శ్రీధర్‌బాబు, సాహితీవేత్తలు జల్ది విద్యాధరరావు, బిక్కి కృష్ణ తదితరులు పాల్గొంటారు.

– కలిమిశ్రీ

కవితా పోటీ విజేతలు

తెలుగుపూల తోట ఫేస్‌బుక్ గ్రూప్ ఆధ్వర్యంలో నిర్వహించిన రెడ్నం సత్యవతమ్మ స్మారక కవితా పోటీ ఫలితాలు న్యాయ నిర్ణేతగా ప్రముఖ కవి, విమర్శకులు డా.ఎస్.రఘు వ్యవహరించారు.

ప్రథమ బహుమతి : పద్మావతి రాంభక్త, విశాఖపట్నం; ద్వితీయ బహుమతి : యెలిశాల నాగమోహన్; తృతీయ బహుమతి : బి.వి.శివప్రసాద్. ప్రోత్సాహక బహమతులు :కటుకోఝ్వల రమేశ్, సమ్మెట విజయ, గొంటు ముక్కల గోవిందు, చొక్కాపు లక్ష్మునాయుడు, మంత్రవాది మహేశ్వర్, సి.ఎస్ రాంబాబు, గంగిరెడ్డి ప్రద్యుమ్న కుమార్ రెడ్డి, సిహెచ్‌వివిఎస్ మూర్తి (ఎక్వేరియం).

– వెన్నెల సత్యం, శాంతికృష్ణ

29న జగన్నాథ శర్మకు జైనీ పురస్కారం

ప్రముఖ కథా రచయిత, నవ్య వారపత్రిక సంపాదకులు జగన్నాథ శర్మ గారి 'మొదటి పేజి కథలు' కథాసంపుటికి 'లక్ష రూపాయల నగదుతో 'లక్ష్మీనారాయణ జైనీ జాతీయ సాహితీ పురస్కార (2019) మహోత్సవం' 29.1.2019 మంగళవారం జరుగుతుంది. ఆరోజు సాయంత్రం 6 గంటలకు హైదరాబాద్లోని రవీంద్ర భారతిలోపురస్కార ప్రదానం చేయబడుతుంది. ముఖ్య అతిథిగా తెలంగాణా సాహిత్య అకాడెమీ అధ్యక్షులు నందినీ సిధారెడ్డి, ప్రముఖ రచయిత, సుధామ పాల్గొంటారు.

– డా. ప్రభాకర్ జైనీ, ఛైర్మన్,
జైనీ ఇంటర్నేషనల్ ఫౌండేషన్

JEEVANA
జీవన
the family



చెక్స్‌తో సరికొత్త లుక్!

రానున్నది పెళ్లిళ్ల సీజన్. పెళ్ళిళ్లంటే.. ఎక్కువగా ప్రాధాన్యతనిచ్చేది పట్టు చీరలే. అయితే ఎప్పుడో ఉన్న పాత పట్టుచీరలు బాగా బరువుగా ఉండడమే గాక, పాత ఫ్యాషన్‌తో ఓల్డ్‌గా అనిపిస్తుంటాయి. అందుకే ఇప్పుడు లేటెస్ట్ ట్రెండ్‌గా వస్తున్న చెక్స్ పట్టుచీరలు తేలికగానూ, చూడ్డానికి హుందాగానూ ఉంటున్నాయి. అదీగాక ఈ పట్టుచీరలు ఏ వయసువారైనా కట్టుకోవచ్చు. ఈ సొగసైన పట్టుచీరల్ని చూస్తుంటే చెక్స్‌తో సరికొత్త లుక్ వచ్చినట్లన్పించడం లేదూ?!

బైక్.. అందంగా, భద్రంగా..!

ఇష్టంగా కొనుక్కున్న బైక్ మీద చిన్న గీత పడినా ఎంతో బాధపడతాం. కొన్నిసార్లు బయటి వాతావరణం వల్ల బైక్ కలర్ తొందరగా డల్ అయినట్లు కనిపిస్తుంది. అలాంటి సమస్యలనుంచి బయటపడేందుకు ఇప్పుడు స్ప్రే పాలిష్‌లు, స్క్రాచ్ రిమూవర్లు అందుబాటులో ఉన్నాయి. బైక్‌పై గీతలు పడిన చోట స్క్రాచ్ రిమూవర్‌ను ఉపయోగించడం ద్వారా అవి కనబడకుండా చేసుకోవచ్చు. స్ప్రే పాలిష్‌తో మన బైకుకు కొత్త మెరుపును అందించవచ్చు. వీటిని వినియోగించే ముందు బైకునుగానీ, వాటిని ఉపయోగించే భాగాలనుగానీ షాంపూతో రుద్ది, దుమ్ము, మరకలు వంటివేవీ లేకుండా కడిగేయాలి. ఆ తర్వాత తుడిచి, కాసేపు ఆరనివ్వాలి. పూర్తిగా ఆరిన తర్వాత.. ఏదైనా దుమ్ము పడి ఉంటే తొలగించేందుకు కాటన్ వస్త్రంతో తుడిచి, స్క్రాచ్ రిమూవర్‌ను గానీ, స్ప్రే పాలిష్ ను గానీ ఉపయోగించాలి. ముఖ్యంగా చెప్పాలంటే ఆయా ఉత్పత్తులపై పేర్కొన్న విధంగా.. వాటిని అప్లై చేస్తే ఫలితం మెరుగ్గా ఉంటుంది. స్ప్రే పాలిష్/ స్క్రాచ్ రిమూవర్‌లు నాణ్యతను, పరిమాణాన్ని బట్టి ధర ఉంటుంది. అలాగే, ఇటీవల కాలంలో బైక్ భద్రత విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాల్సిన పరిస్థితి ఉంది. రెప్పపాటులో బైక్‌లను మాయం చేసే మాయగాళ్ళు పెరిగారు. బైక్‌ను ఎవరూ ఎత్తుకుపోకుండా, కదిలించకుండా ఉండేందుకు తోడ్పడేలా డిస్క్ బ్రేక్ లాక్, ఫ్రంట్ వీల్ లాక్‌లు అందుబాటులో ఉన్నాయి. చిన్నగా ఉన్నా అత్యుత్తమ రక్షణ అందించడం వీటి ప్రత్యేకత. డిస్క్ బ్రేక్ సదుపాయం ఉన్న బైకులకు డిస్క్ బ్రేక్ లాక్, లేని వాటికి ఫ్రంట్ వీల్ లాక్ తోడ్పడుతుంది. డిస్క్ బ్రేక్ లాక్ చాలా చిన్నగా ఉంటుంది. అవసరమైతే జేబులో వేసుకుని వెళ్లొచ్చు. డిస్క్ బ్రేక్ ప్లేట్ పై ఉండే రంధ్రం గుండా చిన్న పాటి





ఐరన్ లాక్‌ను చొప్పించి తాళం వేయవచ్చు. తాళం చెవి లేకుండా దీనిని తీయడం చాలా కష్టం. వీటి ధరలు 150 నుంచి 250 రూపాయలు వరకు మాత్రమే ఉంటాయి. ఫ్రంట్ వీల్ లాక్ ముందు ఉండే చక్రానికి మధ్యలో అమర్చవచ్చు. చక్రం ఫోక్ లేదా అల్లాయ్ వీల్ రాడ్‌ను రెండు వైపులా అడ్డుకునేలా దీనిలో ఏర్పాటు ఉంటుంది. ఈ లాక్ వేస్తే బైకును ముందుకు, వెనుకకు ఏ మాత్రం కదిలించలేరు.

★

జీవన సౌరభం


పది మంది మంచి కోసం ఒకసారి తల వంచినా ఏంకాదు. కానీ ఒకరి మెప్పు కోసం మన వ్యక్తిత్వాన్ని తాకట్టు పెట్టకూడదు.



మీకోసం

ఎండలో తిరిగి చర్మం కమిలిపోయినట్లుగా అయితే మీగడను రాస్తే ఫలితం ఉంటుంది.

నిద్రపట్టేలా చేసే.. మధుర ఫలాలు



రాత్రిపూట ఎంత ప్రయత్నించినా సరిగ్గా నిద్రపట్టడం లేదా..? అయితే రోజూ రాత్రి నిద్రకు ముందు కొన్ని ద్రాక్షపండ్లను తినడం మంచిదని నిపుణులు చెబుతున్నారు. అలా చేస్తే నిద్ర బాగా పడుతుందని వారు స్పష్టం చేస్తున్నారు. ద్రాక్షల్లో నిద్రకు ఉపయోగపడే మెలటోనిన్ అనే హార్మోన్ ఉంటుంది. ఇది నిద్ర చక్కగా పట్టేలా చేస్తుంది. సాధారణంగా సాయంత్రం నుంచి ప్రతి ఒక్కరి శరీరంలో మెలటోనిన్ స్థాయిలు పెరుగుతాయి. దీంతో రాత్రవుతున్న కొద్దీ ఎవరికైనా నిద్ర వస్తుంది. అయితే నిద్రలేమి ఉన్నవారిలో ఈ మెలటోనిన్ స్థాయిలు తక్కువగా ఉంటాయి. అందుకే వారికి నిద్ర సరిగ్గా పట్టదు. కనుక మెలటోనిన్ స్థాయిలను పెంచేందుకు ద్రాక్షలను తినాలి. దీంతో నిద్ర బాగా పడుతుందని ఇటలీకి చెందిన శాస్త్రవేత్తలు తమ అధ్యయనాల్లో తేల్చారు. మెలటోనిన్ ఎక్కువగా ఉండే బాదం పప్పు, అరటిపండ్లు, వాల్‌నట్స్, చెర్రీలు, తేనె తదితర ఆహారాలను తీసుకున్నా నిద్రలేమి సమస్య నుంచి బయటపడొచ్చని నిపుణులు వివరిస్తున్నారు.

★

కలతలోనూ కల సాకారం

జీవితం సాఫీగా సాగిపోతుందని చెప్పేవారు అతి తక్కువ మంది ఉంటారు. ఎందుకంటే జీవితమంటేనే ఒడుదుడుకుల ప్రయాణం. ఎక్కడ ఏ ప్రమాదం ముంచుకు వస్తుందో చెప్పడం కష్టమే. సాధ్యమైనంత జాగ్రత్తగా ఉండటమే మన చేతుల్లో ఉండేది. ఒక్కోసారి ప్రమాదాల్లో అత్యంత విలువైనవి కోల్పోయినా ఏమీ కానట్టు ధైర్యంగా నిలబడతారు కొందరు. జీవితాన్ని నిజంగా ప్రేమించేవారే అలా ఉండగలరు. అలాంటి వ్యక్తే కేరళకు చెందిన 24 ఏళ్ల యువకుడు వైషక్.

పదకొండేళ్ళ క్రితం నాటి మాట.

ఐసియూలో తను మగతగా మూలుగుతున్నాడు. తన కుడి కాలులో సలపరంపుట్టే నొప్పి. పక్కనే ఉన్న తన అంకుల్‌తో కాలుని మర్దనా చేయమని అడిగాడు. వెంటనే తన అంకుల్ దుఃఖాన్ని ఆపుకోలేక బయటకి పరుగెత్తడం గమనించాడు వైషక్. ఆ మగతలోనే తన కాలుని తానే మర్దనా చేసుకోవడానికి చేయి కదిపాడు. అయితే చేతికి ఎలాంటి స్పర్శా తగలలేదు. ఆశ్చర్యంతో లేచి చూసిన వైషక్ మెదడు కొంతసేపు మొద్దుబారింది. తన కుడికాలు కనిపించలేదు.

చిన్నతనంలో అందరికీ ఉన్నట్లే వైషక్ జీవితంలోనూ కోరికలుండేవి. అయితే మిలటరీలో చేరాలని, లేకపోతే ఫుట్‌బాల్ ప్లేయర్‌గా రాణించాలనే కలలు కనేవాడు. నాలుగు గోడల మధ్య కూర్చొని చదవడం కంటే బయట వాతావరణంలో గడపడమంటేనే వైషక్‌కు ఎక్కువ ఇష్టం.

సెలవలొచ్చాయంటే చాలు స్నేహితులతో కలిసి రోజంతా ఫుట్‌బాల్ ఆటతోనే గడిపేవాడు. తనకు 13 ఏళ్ల వయసున్నప్పుడు కాలికట్‌లో ఫుట్‌బాల్ జట్టు కోసం సెలక్షన్స్ జరుగుతున్నాయి. ఎలాగైనా అందులో ఎంపికవ్వాలనే బలమైన కోరికతో అప్పటికే చాలా ప్రాక్టీస్ చేసుకున్నాడు వైషక్. సెలక్షన్లు జరిగే ప్రాంగణానికి వెళ్లడానికి తన సోదరుడు బైక్ పైన బయలుదేరాడు. బైక్ స్టార్ట్ అయిన కొంతసేపటికే ఒక బస్ చాలా వేగంగా వచ్చి ఢీ కొట్టింది. రక్తసిక్తమై రోడ్డుపై పడున్న వైషక్ కాలిపైన మరో వాహనం ఎక్కింది. అప్పుడు తన నోటి వెంట 'నేను ఇక బతకను' అనే మాట పదేపదే వచ్చిందని.. సంఘటన జరిగిన తర్వాత చుట్టు పక్కల వాళ్లు చెప్పారు వైషక్‌కి.



ఆపరేషన్ తర్వాత తన దేహంలో ఒక కాలు కోల్పోయాడు. మరో కాలికి రాడ్డుతో సహకారం అవసరమయ్యింది. ఇంత జరిగినా వైషక్ మనసులో ఉన్నదల్లా ఒకటే ఆలోచన 'ఇకపై నేను ఫుట్‌బాల్ ఆడటం ఎలా?'

కొన్ని నెలలు తన ఎడమ మోకాలు పట్టు సాధించడానికి ఫిజియోథెరపీ చికిత్స తీసుకున్నాడు. తనపై ఎక్కడ జాలి చూపిస్తారోనని ఎవ్వరికీ తన బాధను చెప్పుకోకపోగా అందరితో మామూలుగానే ఉండటానికి ప్రయత్నించేవాడు. ఈ సాధనలో తన స్నేహితులు మరింత సహకారం అందించారు. పాఠశాల



పూర్తవ్వగానే స్నేహితులంతా వచ్చి వైషక్‌తో కారమ్స్, చెస్ లాంటి ఆటలు ఆడేవాళ్లు. ఇలా ఒక ఏడాది గడిచింది. ఇక ఇంట్లోనే ఉండలేకపోయాడు వైషక్. తన సైకిల్ పట్టుకొని బయటకి వచ్చాడు. ఒక్క కాలితో చాలా శ్రమ కోర్చి, సైకిల్‌ని తొక్కగలిగాడు. ఇదే ప్రేరణతో ఒక్కకాలితో ఈదడమే కాదు, కారు నడపడమూ నేర్చుకున్నాడు. అయితే తన రెండు చేతుల్లో క్రచ్చస్ ఉన్నప్పుడు చాలా వేగంగా నడవడం గమనించాడు. ఇంత వేగంగా నడవగలిగినప్పుడు బాల్‌ని కూడా వేగంగానే కొట్టగలను కదా అనుకున్నాడు. అంతే తనకు అత్యంత ఇష్టమైన ఫుట్‌బాల్ గ్రౌండ్‌కి పరుగులు పెట్టాడు. ఇప్పుడు ఫుట్‌బాల్ ఆడుతున్నప్పుడు తాను చేసే ఫౌల్‌ని స్నేహితులు ఫౌల్‌గానే గుర్తిస్తుంటే మిగతా ఆటగాళ్లకు లాగానే తననీ ఒక ఫుట్‌బాల్ ప్లేయర్‌గానే చూస్తున్నారని గర్వపడతాడు వైషక్.

అంగవైకల్యంతో ఆడే క్రీడల్లో ఫుట్‌బాల్ లేదని తెలుసుకున్న వైషక్ కేరళ తరపున భారత జాతీయ జట్టులో వాలీబాల్ క్రీడాకారుడిగా అందర్నీ మెప్పించాడు. అయితే ఒక ప్రొఫెషనల్ ఫుట్‌బాలర్‌గానే ఉండాలనే తన కోరికకు ఇటీవలే ఒక ఊతం దొరికింది. ఈ మధ్యనే ఇండియన్ ఫుట్‌బాల్ ఫెడరేషన్ అంగవైకల్యమున్న ఫుట్‌బాల్ క్రీడాకారులను ఏషియన్ కప్‌లో ఆడటానికి మొట్టమొదటిసారి ప్రయత్నం మొదలుపెట్టింది. ఇప్పుడు ఆ టీమ్‌లో వైషక్ కూడా ఒక సభ్యుడు. అధికారికంగా వైషక్ భారత ఆంప్యూటీ ఫుట్‌బాల్ జట్టులో సభ్యుడు.

★

డీఎస్సీ, ఎస్జీటీ పరీక్షల ప్రత్యేకం

సమాసాలు -ప్రత్యయాలు



ఎ.నాగమల్లేశ్వరరావు
స్కూల్ అసిస్టెంట్, జడ్జీహెచ్ఎస్ స్కూల్
చుండూరు.

సమాసాలు..

– సమాసాలను పరిచయం చేసుకునే ముందు కొన్ని ప్రాథమికమైన అంశాలను గురించి తెలుసుకుందాం.

– సమర్థంబులగు పదార్థంబులేక పదార్థంబగుట సమాసంబు.

1. సమాసం అంటే ఏమిటి ?

జ : భిన్నమైన అర్థాలను కలిగి ఉండే పదాలు ఒకే పదంగా ఏర్పడితే సమాసం అంటారు.

ఉదా : సీతారామలక్ష్మణులు అడవికి వెళ్ళిరి.

పై వాక్యంలో 1) సీత 2) రాముడు 3) లక్ష్మణుడు అనే పదాలు ఒక్కొక్కటి విడివిడిగా వేరు వేరు అర్థాలను కలిగిస్తాయి. అయితే ఈ పదాలను ఒకే పదంగా రాసినప్పుడు, అది అర్థవంతమైన ఒక వాక్యంగా తయారయ్యింది. ఇట్లా "అర్థవంతమైన పదాల సముదాయమే సమాసం" అంటాం.

2. సమాసాన్ని ఎట్లా గుర్తించాలి ? (లేదా) విగ్రహవాక్యం అంటే ఏమిటి ?

జ : సమాసాన్ని గుర్తించడానికి, లేదా ఒక వాక్యం ఏ సమాసానికి చెందిందో తెలుసుకోవడానికి ఉపయోగపడే వాక్యాన్ని విగ్రహవాక్యం అంటారు. విగ్రహవాక్యం ఆధారంగా సమాసాన్ని గుర్తించవచ్చు.

ఉదా : నా కలం.

పై పదబంధం ఏ సమాసానికి చెందిందో మామూలుగా చదివినప్పుడు తెలియదు. అయితే దానిని "నా యొక్క కలము" అని రాశామనుకోండి, స్పష్టంగా బోధపడుతుంది. ఇట్లా స్పష్టపడటానికి ఉపయోగపడింది. – "యొక్క" అనే ప్రత్యయం. ఇది "షష్టీ తత్పురుషం" అనే సమాసంలోది. అంటే "నా కలము" అనే పదబంధం షష్టీతత్పురుష సమాసానికి చెందిందన్న మాట.

అందుకే సమాసం పేరు తెలియడానికి విగ్రహవాక్యం అవసరం.

3. సమాసంలో ఎన్ని పదాలుంటాయి ? వాటి పేర్లేమిటి ?

జ : సాధారణంగా సమాసంలో రెండు పదాలుంటాయి. అంటే సమాసంగా ఏర్పడ్డ పదబంధం లేదా వాక్యంలో రెండు భాగాలు ఉంటాయి. వీటినే పదాలు అంటారు. ఇందులో మొదటి పదాన్ని – 'పూర్వపదం' అనీ – రెండోపదాన్ని – పరపదం లేదా 'ఉత్తరపదం' అనీ అంటుంటారు.

4 సమాసం ఎన్ని విధాలు ? అవి ఏమిటి ?

జ : సమాసాలు ఎన్నో ఉన్నాయి. అయితే కొన్ని సందర్భాలను ఆలోచించినపుడు సమాసాలను ప్రధానంగా మూడు విధాలుగా భావించవచ్చు.

అవి : 1) తత్పురుష సమాసాలు
2) కర్మధారయ సమాసాలు
3) ద్వంద్వం, ద్విగు, రూపకం మొదలయినవి.

సమాసాలు - అందలి భేదాలు- లక్షణాలు

సూత్రం : తత్పురుషాదులకు లక్షణాలు ప్రాయికంబుగ సంస్కృతోక్తంబయగు – బాలవ్యాకరణం.

- సంస్కృతోక్తమైన సమాసభేదాలు :

1.తత్పురుషాలు (తత్పురుష సమాసం)

– సమాసంలోని రెండోపదానికి, అంటే పర (ఉత్తర) పదానికే

ప్రాధాన్యం ఉంటుంది. ఇట్లా ఉండటమే తత్పురుష సమాసం అంటారు. ఇలాంటి సమాసాన్ని 'వ్యధకరణ' సమాసం అని కూడా అంటారు. అంటే ఈ సమాసంలో ఉండే రెండు మాటలకు (పూర్వ పరపదాలకే) వేర్వేరు అధికరణాలు ఉంటాయన్న మాట ! 'అధికరణం' అంటే ఆధారం లేదా అధికారం అనీ చెప్పుకోవచ్చు. ఈ పూర్వ, పరపదాల్లో మొదటి (పూర్వ) పదం ఏ ప్రత్యయంపై ఆధారపడి ఉంటుందో తెలుసుకుంటే, ఆ వాక్యం లేదా ఆ పదబంధం ఏ తత్పురుషానికి చెందిందో అర్థమవుతుంది.

– తత్పురుష సమాసాల్లో కొన్నింటికి ఒకే అక్షరం, కొన్నింటికి రెండేసి అక్షరాలు, మరికొన్నింటికి మూడేసి అక్షరాలు ఉంటాయి. ఆ అక్షరాలను లేదా ఆ పదాలను "ప్రత్యయాలు" అంటారు. ఇంతకుముందు ఈ విభాగంలోని మూడో ప్రశ్నకు సంబంధించిన జవాబులో "యొక్క" అనే పదం ఉంది. ప్రత్యయానికి ఇది ఒక ఉదాహరణ ! ఇలాంటి ప్రత్యయాలు దాదాపుగా 25 వరకూ ఉన్నాయి. అవి ఏమిటో? వాటికి గల "తత్పురుషా"లు ఏమిటో? ఈ కింది పట్టికలో చూడండి.

ప్రత్యయాలు		తత్పురుషాలు
1) డు–ము–వు–లు (రు)	–	ప్రథమా విభక్తి
2) నిన్–నున్–లన్–కూర్చి–గురించి	–	ద్వితీయా విభక్తి
3) చేతన్–చేన్–తోడన్–తోన్	–	తృతీయా విభక్తి
4) కొఱకున్–(కోసం) కై	–	చతుర్థీ విభక్తి
5) వలనన్–(వల్ల)–కంటెన్–పట్టి	–	పంచమీ విభక్తి
6) కిన్–కున్–యొక్క–లోన్–లోపలన్	–	షష్ఠీ విభక్తి
7) అందున్–(ఎందున్, ఇందున్)–నన్	–	సప్తమీ విభక్తి

– వీటితోపాటుగా "నఞ్ తత్పురుషం, సంబోధనం" కూడా ఉన్నాయి.

– సంస్కృతంలో విభక్తి ప్రత్యయాల ననుసరించి సమాసాన్ని తెలుసుకోవచ్చు. కానీ తెలుగు భాషలో కాస్త తికమక కలుగుతుంది. తెలుగులో షష్టీతత్పురుషాలు ఎక్కువ.

- ప్రథమా తత్పురుష సమాసము : ప్రథమా విభక్తి చివర కలిగిన పూర్వపదం, రెండో పదం కూడా ప్రథమా విభక్తిని కలిగి ఉంటుంది. ఉత్తర పద అర్థ ప్రాధాన్యం కలిగి ఉన్న సమాసము ప్రథమా తత్పురుష సమాసం.

ఉదా : 1) మధ్యాహ్నము - అహ్నము యొక్క మధ్యభాగము
2) నడిరేయి-రేయి యొక్క నడిమి భాగము



గమనిక : కొందరు ప్రథమా తత్పురుష సమాసం లేదని 'ఏకాదేశ సమాసం' అని దీన్ని అంటారని చెబుతారు. అయినా ప్రథమా తత్పురుషం వ్యవహారంలో ఉంటూనే ఉంది.

(పాఠ్యాంశంలోని ఉదాహరణలను పరిశీలిద్దాం)

క్ర.సం.	ఉదాహరణ పదము	విగ్రహ వాక్యం
1.	మధ్యాహ్నం	అహ్నం మధ్య భాగము (అహ్నము యొక్క మధ్యభాగము)
2.	నడిరేయి	రేయి యొక్క నడి
3.	అర్ధనగ్నము	నగ్నమైన అర్ధభాగము
4.	పావుగంట	గంట యొక్క పావు భాగం

- ద్వితీయ తత్పురుష సమాసము : ద్వితీయ విభక్తితో కూడిన పూర్వపదము గల తత్పురుష సమాసమును "ద్వితీయ తత్పురుష సమాసము" అంటారు.

ఉదా : 1. కష్టాశ్రితుడు - కష్టుని ఆశ్రయించినవాడు
2 నెలతాల్పు - నెలను తాల్చినవాడు

- తృతీయ తత్పురుష సమాసము : తృతీయా విభక్తితో కూడిన పూర్వపదము గల తత్పురుష సమాసమును "తృతీయా తత్పురుష సమాసము" అంటారు,

ఉదా : 1. వాక్కలహము - వాక్కు చేత కలహము.
2. వంశహీనుడు - వంశము చేత హీనుడు.
3. బుద్ధిహీనుడు - బుద్ధిచేత హీనుడు .

- చతుర్థీ తత్పురుష సమాసము : చతుర్థి విభక్తితో కూడిన పూర్వపదము గల తత్పురుష సమాసమును 'చతుర్థీ తత్పురుష సమాసము' అని అంటారు.

ఉదా : 1. ధనాశ - ధనము కొఱకు ఆశ
2. గోసుఖం - గోవుల కొఱకు సుఖం .

- పంచమీ తత్పురుష సమాసము : పంచమీ విభక్త్యంతమైన పూర్వ పదముగాగల తత్పురుష సమాసమును "పంచమీ తత్పురుష సమాసము" అని అంటారు.

ఉదా : 1. దొంగ భయము - దొంగ వలన భయము
2. పాప ముక్తుడు - పాపము వలన ముక్తుడు

- షష్ఠీ తత్పురుష సమాసము: షష్ఠీ విభక్త్యంతమైన పూర్వపదము గల తత్పురుష సమాసమును "షష్ఠీ తత్పురుష సమాసము" అని అంటారు.

ఉదా: 1. రాజపుత్రుడు - రాజు యొక్క పుత్రుడు
2. యజ్ఞఫలము - యజ్ఞము యొక్క ఫలము

- సప్తమీ తత్పురుష సమాసము : సప్తమీ విభక్త్యంతమైన పూర్వపదము గల తత్పురుష సమానమును 'సప్తమీ తత్పురుష సమాసము' అని అంటారు.

ఉదా: 1. నీతి పారగుడు - నీతి యందు పారగుడు
2. మాట నేర్పరి - మాటయందు నేర్పరి

- నఞ్ తత్పురుష సమాసం : నఞ్ తత్పురుష సమాసాన్ని సంస్కృతంలో రకరకాలుగా ప్రయోగిస్తున్నప్పటికీ తెలుగుభాషలో మాత్రం వ్యతిరేకార్థాన్ని సూచించడానికే వాడుతుంటాము. అంటే "ఒకటి, లేదా రెండు అక్షరాలతో వ్యతిరేకార్థాన్ని కలిగించేదే "నఞ్ తత్పురుష సమాసం"

దీని ప్రత్యయాలు : "అన్, అ" అనేవి.

- సూత్రం : నఞ్ కు తరవాత అచ్చుతో ప్రారంభం అయ్యే పదాలకు వ్యతిరేకార్థం వచ్చే సందర్భంలో "అన్" చేరుతుంది.

(ఆసక్తి పదానికి నఞ్ ముందు చేరితే వ్యతిరేకం ఎట్లా అవుతుందో చూడండి)

ఉదా: 1. అనాసక్తి - నఞ్ + ఆసక్తి - నఞ్ + ఆ + సక్తి - అన్ + ఆ +సక్తి
- అనా + సక్తి - అనాసక్తి
2. అనంతము - నఞ్ + అంతము + నఞ్ + అం + తము - అన్ + అం + తము - అనంతము

- మరిన్ని ఉదాహరణలు :

- సూత్రం 2 : నఞ్ కు తరువాత హల్లుతో ప్రారంభం అయ్యే పదాలు వ్యతిరేకార్థాన్ని సూచించేటట్లయితే "నఞ్" ప్రత్యయం 'అ' గా మారుతుంది.

ఉదా : అసత్యం

1. అసత్యం – నఞ్ + సత్యం – అ + సత్యం – అసత్యం
2. అభయం – నఞ్ + భయం – అ + భయం – అభయం
3. అలఘు – నఞ్ + లఘు – అ + లఘు – అలఘు.

2. కర్మధారయ సమాసం

1. కర్మధారయం అంటే ఏమిటి ?

జ : నామవాచకం (విశేష్యం)తో, విశేషణం కలిసి ఉంటే అది కర్మ ధారయం. కర్మధారయంలో 'సమానాధికరణం' ఉంటుంది. అంటే సమాసంలో గల పూర్వపదంగానీ, "పర (ఉత్తర) పదంగానీ ఒకే వస్తువు. ధర్మాన్ని బోధిస్తాయి.

2 కర్మధారయం ఎన్ని విధాలు ? వాటి పేర్లు ఏమిటి ?

జ : కర్మధారయ సమాసంలో ఉండే "విశేషణా"న్ని అనుసరించి

ఈ సమాసం ఆరు రకాలుగా ఉంది. "రూపకం" అనే సమాసాన్ని కలుపుకొని, మొత్తం ఏడు విధాలుగా భావించవచ్చు.

1) విశేషణ పూర్వపద కర్మధారయ సమాసం
2) వివేషణ ఉత్తరపద కర్మధారయ సమాసం
3) ఉపమాన పూర్వపద కర్మధారయ సమాసం
4) ఉపమాన ఉత్తరపద కర్మధారయ సమాసం
5) విశేషణ ఉభయపద కర్మధారయ సమాసం
6) సంభావన పూర్వపద కర్మధారయ సమాసం
7) అవధారణ పూర్వపద కర్మధారయ (రూపక) సమాసం

– విశేషణ పూర్వపద కర్మధారయ సమాసం.

- సూత్రం : కర్మధారయ సమాసంలో విశేషణం పూర్వపదంగా ఉంటే అది విశేషణ పూర్వపద కర్మధారయ సమాసం.

పదం	విగ్రహవాక్యం
1. వృద్ధ కపోతం	వృద్ధమైన కపోతం
2. నీలమేఘం	నీలమైన మేఘం
3. బంధుర ధ్వాతముల్ ధ్వాంతములు	బంధురములైన
4. మహోగ్రసలిలంబు సలిలంబు	మహోగ్రమైన

– ఇందులో పూర్వపదాలన్నీ విశేషణాలే కనుక ఇది విశ్లేషణ – పూర్వపద కర్మధారయ సమాసాలు.

★

ఉద్యోగాలు

ఎన్‌పీసీఐఎల్‌లో 162 ఉద్యోగాలు

భారత ప్రభుత్వరంగ సంస్థ అయిన న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఎన్‌పీసీఐఎల్) కాక్రపర్ గుజరాత్ సైట్‌లో ఖాళీగా ఉన్న 162 స్టైపెండరీ ట్రైనీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టుల వివరాలు:

స్టైపెండరీ ట్రైనీ/సైంటిఫిక్ అసిస్టెంట్ (ఇంజనీరింగ్ డిప్లొమా అభ్యర్థులు): 51

విభాగాల వారీ ఖాళీలు: మెకానికల్–26, ఎలక్ట్రికల్–17, ఎలక్ట్రానిక్స్–5, కెమికల్–3.

స్టైపెండరీ ట్రైనీ/సైంటిఫిక్ అసిస్టెంట్ (సైన్స్ గ్రాడ్యుయేట్లు): 6

విభాగం: కెమిస్ట్రీ

సైంటిఫిక్ అసిస్టెంట్/బి (సివిల్ ఇంజనీరింగ్ డిప్లొమా అభ్యర్థులు): 7

స్టైపెండరీ ట్రైనీ/టెక్నీషియన్- ప్లాంట్ ఆపరేటర్: 51

స్టైపెండరీ ట్రైనీ/టెక్నీషియన్-మెయింటెయినర్: 47

విభాగాల వారీ ఖాళీలు: ఫిట్టర్–17, ఎలక్ట్రీషియన్–6, ఎలక్ట్రానిక్స్ మెకానిక్–10, ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్–7, వెల్డర్–3, మెషినిస్ట్–3, డీజిల్ మెకానిక్–1.

అర్హత: పోస్టును బట్టి సైన్స్ సబ్జెక్టులతో పదో తరగతి, 10+2/ఐఎస్‌సీ, ఐటీఐ, ఇంజనీరింగ్ డిప్లొమా, బీఎస్సీ ఉత్తీర్ణత, పని అనుభవం ఉండాలి.

ఎంపిక: రాత పరీక్ష, ప్రిలిమినరీ టెస్ట్, అడ్వాన్స్‌డ్ టెస్ట్, స్కిల్ టెస్ట్, పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక ఉంటుంది.

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో.

దరఖాస్తుకు చివరితేదీ: జనవరి 31, 2019.

వివరాలు : వెబ్‌సైట్‌లో పరిశీలించొచ్చు.

వెబ్‌సైట్: https://npcilcareers.co.in

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

హరిత విప్లవం - సమీక్ష

ఇండియన్ ఎకానమి



ఎస్.ఎం. సువర్ణకుమార్
డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్, ఏలూరు.
సెల్ : 9441169869

నూతన శాస్త్ర సాంకేతిక పద్ధతులను వినియోగానికి 1960వ దశకం తరువాత భారతదేశ వ్యవసాయ రంగంలో సాధించిన గణనీయ ప్రగతి హరిత విప్లవంగా పేర్కొంటారు. 1950 తర్వాత భారతదేశంలో ఆహారధాన్యాల తీవ్ర సంక్షోభం ఏర్పడింది. వ్యవసాయ రంగంలో మనం సాధించిన ఉత్పత్తి మన అవసరాలకు అనుగుణంగా లేదు. భారీ ఎత్తున విదేశాల నుంచి దిగుమతి చేసుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ఇందుకోసం ఎక్కువ మొత్తంలో విదేశీ మారక ద్రవ్యం వెచ్చించాల్సి వచ్చింది. అమెరికా, కెనడా, అర్జెంటీనా వంటి దేశాల నుంచి దిగుమతులు చేసుకున్నాం. అలీన దేశాల కూటమికి నాయకత్వం వహిస్తూ నాటో దేశాల నుంచి ఆహార ధాన్యాలు దిగుమతి చేసుకోవడం వల్ల దేశ విదేశాంగ విధానానికి ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడ్డాయి. కనీస జీవనావసరాల కోసం విదేశాలపై ఆధారపడి, విధానపర నిర్ణయాలలో అంతర్జాతీయంగా ఆయా దేశాలను విమర్శించడం దేశాన్ని ఇబ్బందికర పరిస్థితుల్లోకి నెట్టివేసినట్లయ్యింది.

ఆహారధాన్యాల ఉత్పత్తి స్వయం సమృద్ధి కోసం 1950లాగే విధానపరమైన నిర్ణయాలు తీసుకున్నారు. మొదటిగా సాగుభూమి విస్తీర్ణం పెంచాలని నిర్ణయించారు. అయితే దీనికి పరిమితులున్నాయి. కనుక పెరుగుతున్న ఆహార అవసరాల కోసం, స్థానిక ఉత్పత్తి కోసం ఇంటెన్సివ్ అగ్రికల్చరల్ ఏరియా ప్రోగ్రాంను ప్రారంభించారు. ఎంపిక చేసిన జిల్లాల్లో మొదటిగా ప్రారంభించి, క్రమంగా ఇతర జిల్లాలకు విస్తరించారు. ఇదే క్రమంగా హరిత విప్లవానికి దారితీసింది.

1. దేశవాళీ, సాంప్రదాయ విత్తనాల స్థానంలో అధిక దిగుబడి ఇచ్చే మేలు రకపు అధిక దిగుబడి ఇచ్చే వంగడాలు ప్రవేశపెట్టారు. జీవసాంకేతిక విధానంలో అభివృద్ధి చేయబడిన మేలురకపు వంగడాలను ఇందుకు ఎన్నుకున్నారు. గోధుమలో కల్యాణ్, సోనాలిక వంటి రకాలు, వరలో ఐఆర్ సిరీస్ వంగడాలను ఇందుకు వినియోగించారు. ఇందులో ప్రధానంగా ఐఆర్–8 అత్యధిక ఫలితాలను ఇచ్చింది.

2. అల్ప ఫలన కాలపు పంటలను ప్రవేశపెట్టారు. ఇందువల్ల ఏటా ఒక పంట మాత్రమే పండించే భూముల్లో రెండు లేదా మూడు పంటలు పండే అవకాశం కలిగింది. ఐఆర్–3, పద్మ, జయ వంటి వంగడాల వల్ల నాలుగు నెలలకే దిగుబడి చేతికి రావడం సాధ్యం అయ్యింది.

3. సాంప్రదాయక ఎరువులకు బదులుగా కృత్రిమంగా తయారుచేసిన రసాయనిక ఎరువులు ప్రవేశపెట్టారు. నైట్రోజన్, ఫాస్పరస్, పొటాషియం ఎరువులు ప్రవేశపెట్టారు. పంటలు పెరిగే క్రమంలో ఆధునిక సస్యరక్షణ చర్యలు చేపట్టారు. రసాయనిక పురుగుమందులు, కీటక నాశనులనగా ఆధునిక సస్యరక్షణ చర్యల్లో భాగంగా చేపట్టారు.

4. వ్యవసాయ కాలం వృథా కాకుండా శ్రామిక శక్తితో పాటు ఆధునిక యంత్ర పరికరాలను వ్యవసాయ రంగంలో ప్రవేశపెట్టారు. ట్రాక్టర్లు, హార్వెస్టర్‌లు, పంపుసెట్లు మొదలైన ఆధునిక యంత్ర పరికరాలు ప్రవేశపెట్టారు.

5. ఆధునిక వ్యవసాయ వ్యూహం అనుసరించడానికి అధిక పెట్టుబడి అవసరం గనుక సంస్థాగత వ్యవసాయిక పరపతిని విస్తరించారు. సహకార బ్యాంకులు, వాణిజ్య బ్యాంకులు, భూ అభివృద్ధి బ్యాంకులు స్వల్పకాలిక, దీర్ఘకాలిక పరపతిని అందించడంలో కీలకమైన పాత్ర పోషించాయి. గ్రామీణ రైతులకు ఋణ సౌకర్యాలను అందించారు.

6. మార్కెట్ యార్డులు, గిడ్డంగుల నిర్మాణం చేపట్టారు. వ్యవసాయ ఉత్పత్తుల అమ్మకానికి, నిల్వకు వసతులు విస్తృతం చేశారు.

7. 1964 నుంచి దేశవ్యాప్తంగా ఆహార ధాన్యాలకు మద్దతు ధరలు ప్రకటించారు. దీనివల్ల కొత్త రకాల పంటలు, వంగడాలు వినియోగించినపుడు రైతుకు నమ్మకం, ప్రోత్సాహం, విశ్వాసం కలిగించడం కోసం ఈ చర్యలు చేపట్టారు. ఆహారధాన్యాల ధరల విధానంలో సలహాలు ఇవ్వడం కోసం వ్యవసాయ ధరల కమిషన్‌ను ఏర్పాటు చేశారు. ఆహారధాన్యాల కొనుగోలు కోసం 1965లో భారత ఆహార సంస్థ (ఎఫ్‌సిఐ)ను నెలకొల్పారు.

హరిత విప్లవం వల్ల పొందిన ప్రయోజనాలు

1. పంటల దిగుబడులు గణనీయంగా పెరిగాయి. ప్రధానంగా గోధుమ, వరి ఉత్పత్తులపై దీనిప్రభావం ఎక్కువగా ఉంది. 1980–85 నాటికి ఆహారధాన్యం విషయంలో స్వయం సమృద్ధి సాధించారు. ఆహారధాన్యాల దిగుమతులు నిలిపివేయబడ్డాయి.

2. హరిత విప్లవ ప్రభావం పంటల తీరులో మార్పు ఏర్పడింది. మొత్తం మీద తృణధాన్యాల ప్రాధాన్యత పెరిగి, పప్పుధాన్యాల ప్రాధాన్యత తగ్గుతూ వచ్చింది.

3. కాలువలు, గొట్టపు బావుల ద్వారా సేద్యపునీటి వసతులు విస్తరించబడ్డాయి. భారీ నీటి పారుదల ప్రాజెక్టులు వాటి ఆయకట్టు కింద కాలువలు నిర్మించబడ్డాయి.

4. పంటల తీవ్రత పెరిగింది. వ్యవసాయ రంగ సామర్థ్యం పెంచబడింది.

5. సాంప్రదాయక పద్ధతులకు బదులు ఆధునిక సాంకేతిక పద్ధతుల వల్ల వ్యవసాయరంగంలో భూమి ఉత్పాదకత పెరిగింది. దీనివల్ల రైతుల ఆదాయం పెరిగింది.

6. ఆహారధాన్యాల ఉత్పత్తి మెరుగుదల వల్ల మిగులు నిల్వలు ఏర్పాటు చేసుకుని, ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా చౌక ధరలలో ఆహారధాన్యాల పంపిణీ జరిగింది. దీనివల్ల పేదరికం తగ్గడానికి హరిత విప్లవం కొంత మేరకు దోహదం చేసింది.

7. వ్యవసాయ రంగం ఆధునికీకరణ వల్ల ఎరువులు, క్రిమిసంహారక మందులు, యంత్రాలు, పనిముట్ల వాడకం పెరిగినందు వల్ల వాటిని ఉత్పత్తి చేసే వ్యవసాయ రంగంలో ఉత్పాదకత, ఉత్పత్తి పెరిగాయి. వ్యవసాయ ఉత్పత్తులు వినియోగించే పరిశ్రమలు వృద్ధి చెందాయి. వ్యవసాయం, పరిశ్రమల మధ్య సంబంధాలు బలపడ్డాయి.



8. వ్యవసాయరంగంలో పరిశోధనా సంస్థలు, వ్యవసాయ విశ్వవిద్యాలయం, సేద్యపు నీటి ప్రాజెక్టులు స్థాపించారు.

ప్రతికూల ప్రభావాలు

1. హరిత విప్లవం అన్ని ప్రాంతాలకూ కాకుండా కొన్ని ప్రాంతాలకే పరిమితం అయ్యింది. పంజాబ్, హర్యానాలలో సట్లేజ్, యమునా ప్రాంతం, కృష్ణా, గోదావరి డెల్టా ప్రాంతం, పశ్చిమ ఉత్తరప్రదేశ్‌లోని గంగా, యమునా ప్రాంతం, మలబార్ తీర ప్రాంతాలలో హరిత విప్లవం విజయవంతమైంది. ఆంధ్రప్రదేశ్‌లోని రాయలసీమ, తెలంగాణ వంటి ప్రాంతాలలో హరిత విప్లవ ప్రభావం కనిపించదు.

2. వ్యవసాయ రంగంలోని అన్ని పంటలకూ విస్తరించలేదు. గోధుమ, వరి తప్ప మిగిలిన తృణధాన్యాలలో హరిత విప్లవం ప్రభావం కనబడదు. వాణిజ్య పంటలలో బంగాళాదుంప అత్యధిక ప్రయోజనం పొందింది.

3. హరిత విప్లవానికి అధిక స్థాయిలో పెట్టుబడులు అవసరమయ్యాయి. భారతదేశ వ్యవసాయ దారులలో సన్నకారు, ఉపాంత రైతులు 70–80 శాతం వరకూ ఉన్నారు. వారికి ఉత్పదకాలపై అధిక పెట్టుబడి పెట్టే ఆర్థిక స్థోమత లేదు. భారీ పెట్టుబడి పెట్టగల ధనిక రైతులకే ఈ విధానం ప్రయోజనకారిగా మారింది. ఈ విధానం వ్యవసాయ రంగంలో పెట్టుబడిదారీ విధానాన్ని ప్రోత్సహించింది. పెట్టుబడులు పెట్టలేక చిన్న, సన్నకారు రైతులు తమ భూములను పెద్ద రైతులకు అమ్ముకున్నారు. అంటే ఈ విధానం భూమి బదలాయింపుకు దారితీసింది. ఒకవైపు భూ సంస్కరణలు అమలు చేస్తుండగా, మరోవైపు ధనిక రైతుల వద్ద భూ కేంద్రీకరణ ఏర్పడింది. పరస్పర వైరుధ్యం గల ఈ పరిణామం రాజ్యాంగం వాంఛించిన సామాజిక న్యాయానికి విరుద్ధంగా ఉంది.

4. సేద్యపు వసతులు ఉన్నచోట పెట్టుబడులు కుమ్మరించడం వల్ల ఖండాంతర భాగాలు, సేద్యపు వసతులు లేని ప్రాంతాలలో పెట్టుబడులు తగ్గడం వల్ల దిగుబడులు తగ్గి వ్యవసాయ రంగం దిగజారింది. ప్రధానంగా మెట్ట ప్రాంత వ్యవసాయం దెబ్బతింది.

5. గ్రామీణ ప్రాంతాల్లో ఆదాయ పంపిణీ మీద హరిత విప్లవం ప్రతికూల ప్రభావం ఏర్పరచింది. హరిత విప్లవ ప్రయోజనాలు అన్ని వర్గాల రైతులు పంచుకున్నప్పటికీ పెద్ద రైతులు, చిన్న రైతులు మధ్య భూస్వాములు, సొంత భూమిలేని కూలీలు, కౌలుదారుల మధ్య సాంకేతిక మార్పులు, ఆదాయ వ్యత్యాసాలను పెంచాయి.

6. ప్రాంతీయ అసమానతలు మరింతగా విస్తరించాయి. ఆర్థికంగా వెనుకబాటుతనం, నిరుద్యోగం వల్ల ఆయా ప్రాంతాల్లో వేర్పాటు వాదం, తీవ్రవాదం పెరగడానికి హరిత విప్లవం దారితీసింది.

7. హరిత విప్లవంలో భాగంగా వరి, గోధుమలో రెండు మూడు రకాల వంగడాలు వినియోగించడం వల్ల జన్యు వైవిధ్యం తగ్గిపోయింది. సాంప్రదాయికంగా వినియోగించే రెండొందల రకాల వంగడాల స్థానంలో కేవలం 4, 5 రకాల సాగు వల్ల జన్యు వైవిధ్యం లోపించి పంటలకు చీడ, పీడలను తట్టుకునే సామర్థ్యం తగ్గిపోయింది. దీర్ఘకాలంలో పంటల దిగుబడి తగ్గి, వ్యవసాయ వ్యవస్థల సామర్థ్యం తగ్గింది.

8. హరిత విప్లవంలో చిరు ధాన్యాలకు ప్రాధాన్యం లేకపోవడం వల్ల వరి, గోధుమ వ్యవసాయ ఉత్పత్తుల అధిక వినియోగం వల్ల పోషకాహార సమస్యలు ఏర్పడ్డాయి. అధిక పోషకాలు, పీచు పదార్థాలు గల చిరుధాన్యాల స్థానంలో వరి, గోధుమ ధాన్యాల వినియోగం పెరగడం వల్ల మధుమేహం, రక్తపోటు వంటి సమస్యలు పెచ్చరిల్లాయి.

9. విచక్షణా రహితంగా కీటకనాశినులు, రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందుల వినియోగం వల్ల ఆహార గొలుసులో విషపదార్థాలు చోటుచేసుకున్నాయి. వ్యవసాయ ఉత్పత్తులు విషతుల్యంగా మారాయి. దీర్ఘకాలంలో సామాజిక ఆరోగ్యానికి హానికరంగా తయారయ్యాయి. క్యాన్సర్ వంటి వ్యాధులు ప్రబలడానికి కారణమయ్యాయి.

10. విచక్షణా రహితంగా సేద్యపు నీటి వాడకం వల్ల సంవత్సరంలో ఎక్కువ కాలం వ్యవసాయ క్షేత్రంలో నీరు నిలువ ఉండటం వల్ల లవణీయత పెరిగింది. ఫలితంగా దీర్ఘకాలంలో దిగుబడులు తగ్గడానికి కారణమయ్యింది.

మొత్తం మీద హరిత విప్లవం మిశ్రమ ఫలితాలు అందించినా దేశంలో ఆహారధాన్యాల స్వయం సమృద్ధి సాధించడంలో తోడ్పడింది. వనరులు తక్కువగా ఉండి.. తక్కువ పెట్టుబడి సామర్థ్యం వల్ల అతి తక్కువ సమయంలో అత్యధిక ఫలితాలు ఇచ్చే సారవంతమైన నేలలు, సేద్యపునీటి వసతులు, నదీజలాలు పుష్కలంగా లభించే ప్రాంతాలలో కొన్ని పంటలపై కేంద్రీకరించడమైంది. అందువల్ల భూస్వాములు, పెద్ద రైతులు మాత్రమే అధిక ప్రయోజనం పొందారు. మెట్ట ప్రాంతాల సేద్యానికి ప్రాధాన్యత ఇవ్వలేదు.

హరిత విప్లవం దీర్ఘకాలంలో ప్రగతి సాధించలేమని ఆధునిక సాంకేతిక సహాయంతో సాంప్రదాయ వ్యవసాయాన్ని మేళవించడం ద్వారా ప్రగతి దీర్ఘకాలం ఉండేలా నిత్య హరిత విప్లవం దిశగా సాగడానికి నూతన వ్యవసాయ వ్యూహం అమలు చేస్తున్నారు.

1. హరిత విప్లవాన్ని ఇతర ప్రాంతాలకు విస్తరింపజేస్తున్నారు. ప్రధానంగా మెట్ట ప్రాంతాలకు విస్తరిస్తున్నారు.

2. దుర్భిక్షాన్ని తట్టుకునే వంగడాలను అభివృద్ధి చేయడం, స్వల్పకాలంలో పంటనిచ్చే వంగడాలను అభివృద్ధి చేయడం.

3. నీటి అవసరం తక్కువ ఉండే పంటలను ప్రోత్సహించడం, వర్షాకాలంలో వర్షపునీటిని నిలువ చేయడం ద్వారా వాటర్‌షెడ్ పథకాలను అభివృద్ధి చేయడం, బిందు సేద్యాన్ని ప్రోత్సహించడం.

4. పశుపోషణ, ఎపికల్చర్, సెరీకల్చర్ వంటి అనుబంధ వ్యవసాయ రంగాలను ప్రోత్సహించడం.

5. నేలల పోషక విలువలు పెంపొందించడానికి కేవలం రసాయనిక ఎరువులపైనే ఆధారపడకుండా పంటల మార్పిడి వంటి విధానంలో లెగ్యుమినేస్ జాతి పంటలను సాగు చేయడం ద్వారా నత్రజనిని భూమిలో స్థిరీకరించే విధంగా చర్యలు తీసుకోవడం.

6. కంపోస్టు ఎరువులు, సేంద్రీయ ఎరువుల వాడకాన్ని ప్రోత్సహించడం.

7. రసాయన ఎరువులు పరిమితంగా వాడుతూ బ్లూగ్రీన్ ఆల్గే వంటి జీవ ఎరువుల వినియోగాన్ని ప్రోత్సహించడం.

8. సింథటిక్ పెరిత్రాయిడ్స్ మాత్రమేగాక, వేపకాయ ఆధారిత పురుగుమందులు వంటి సాంప్రదాయక పద్ధతులను పాటించడం.

9. బయోపెస్టిసైడ్స్ వినియోగాన్ని ప్రోత్సహించడం.

★

140 కిలోల గంజాయి పట్టివేత

ప్రజాశక్తి- టెక్కలి (శ్రీకాకుళం జిల్లా)

శ్రీకాకుళం జిల్లా టెక్కలిలోని శ్యాంసుందరాపురం గ్రామ జాతీయ రహదారి వద్ద పోలీసులు ఆదివారం 140 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. టెక్కలి పోలీస్‌స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఈ మేరకు కాశీబుగ్గ డిఎస్‌పి బర్ల ప్రసాదరావు తెలిపారు. గంజాయి అక్రమంగా రవాణా అవుతున్నట్లు పోలీసులకు సమాచారం అందడంతో ఒడిశా నుంచి మహారాష్ట్ర వైపు వెళ్తున్న కారును సోదా చేశారు. ఇందులో రెండు కిలోల పరిమాణంగల 70 ప్యాకెట్ల గంజాయి బయటపడటంతో కారు డ్రైవరు శ్రీధర్ డోకేని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.గంజాయి అక్రమ రవాణాముఠాకు చెందిన ఈశ్వర్ దీస్లే, రామ్‌మామ కోసం గాలిస్తున్నామని తెలిపారు.

విశాఖ బహిరంగ సభలో అభివాదం చేస్తున్న సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు నర్సింగరావు, కార్మిక సంఘాల నాయకులు



విశాఖలో రక్షణ రంగ కార్మికుల కవాతు

ప్రజాశక్తి - కంచరపాలెం, విశాఖ

రక్షణ రంగాన్ని పరిరక్షించుకోవడానికి విశాఖ పరిధిలోని రక్షణరంగ సంస్థలన్నింటినీ ఏకతాటి మీదికి తెచ్చిన డిఫెన్స్ కో-ఆర్డినేషన్ కమిటీ ఆధ్వర్యాన రక్షణరంగ పరిరక్షణ, నూతన పింఛను విధానం (సిపిఎస్) రద్దు ప్రధాన ఎజెండాగా నిర్వహించిన ఈ కవాతు కార్మికులలో ఉద్యమ స్ఫూర్తి నింపింది. ఆదివారం ఉదయం ఏడు గంటలకు ఇండస్ట్రీయల్ ఎస్టేట్ వద్ద అరుణ పతాకాన్ని చేతబట్టిన కేంద్ర ప్రభుత్వోద్యోగులు 104 ఏరియా, కరాస మీదుగా ఎన్ఎడి కూడలికి చేరారు. తొలుత కార్మిక సంఘం సీనియర్ నాయకులు ఎవి.థామస్ ఈ కవాతును జెండా ఊపి ప్రారంభించారు. అఖిల భారత స్థాయిలో ఈ నెల 23, 24, 25 తేదీలలో దేశవ్యాప్త సమ్మెకు ఎఐడిఇఎఫ్, ఐఎన్‌డిడబ్ల్యుఎఫ్, బిపిఎమ్ఎస్‌లు ఇచ్చిన పిలుపునకు సంఘీభావంగా నిర్వహించిన ఈ కార్యక్రమం విజయవంతంగా సాగింది. అనంతరం ఎన్ఎడి కూడలిలో ఎన్ఎస్‌టిఎల్ గేటు వద్ద జాతీయ రహదారిపై డిఫెన్స్ కో-ఆర్డినేషన్ కమిటీ ఛైర్మన్ రెడ్డి వెంకటరావు అధ్యక్షతన సభ నిర్వహించారు. ఈ సభకు ముఖ్య అతిథిగా హాజరైన సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.నర్సింగరావు మాట్లాడారు. దేశభక్తి ముసుగులో ప్రధాని మోడీ దేశ ద్రోహానికి పాల్పడుతున్నారని విమర్శించారు. దేశ రక్షణను బడా పెట్టుబడిదారులకు ఫణంగా పెడుతూ రక్షణ రంగాన్ని నిర్వీర్యం చేసి ఆయా సంస్థల్లో పనిచేసే కార్మికోద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని అన్నారు. ఐఎన్‌టియుసి తెలుగు రాష్ట్రాల బాధ్యులు డాక్టర్ కెఎస్.మోహన్‌కుమార్ మాట్లాడుతూ దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

వైద్యరంగానికి, వామపక్ష ఉద్యమానికి తీరని లోటు

డాక్టర్ దొప్పలపూడి సంస్మరణ సభలో వక్తలు

ప్రజాశక్తి-బాపట్ల (గుంటూరు జిల్లా)

కమ్యూనిస్టు పార్టీ బలంగా పునర్నిర్మాణం జరుగుతున్న తరుణంలో డాక్టర్ దొప్పలపూడి మల్లిఖార్జునరావు వంటి నాయకుడిని కోల్పోవడం పార్టీకి తీరని లోటని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు అన్నారు. ఆదివారం గుంటూరు జిల్లా బాపట్లలోని విజయలక్ష్మిపురంలో ఏర్పాటు చేసిన డాక్టర్ దొప్పలపూడి మల్లిఖార్జునరావు సంస్మరణ సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పార్టీ సీనియర్ నాయకులు నూతలపాటి కోటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సంస్మరణ సభలో మధు మాట్లాడారు. మహత్తరమైన ఆశయం, సిద్ధాంతం కోసం చివరి నిమిషం వరకు ఉద్యమానికి అంకితమై పనిచేసిన డాక్టర్ దొప్పలపూడికి సిపిఎం రాష్ట్ర కమిటీ తరపున సంతాపాన్ని ప్రకటించారు. కమ్యూనిజం మాత్రం ఎప్పుడు అజేయమే. దానికి విజయం తప్ప అపజయం ఉండదని అన్నారు. అవినీతిపరుల చర్యలను ఎండగట్టేందుకు ఎర్రజెండా ఎప్పుడూ రెపరెపలాడుతోందన్నారు. ఆ కోవకు చెందిన ప్రజల మనిషిగా, పేదల పక్షపాతిగా డాక్టర్ దొప్పలపూడిని కొనియాడారు. ఆయన ఆశయ సాధనకు, వారి కుటుంబ సభ్యులకు సిపియం అండగా నిలుస్తుందన్నారు. శాసన మండలి ప్రతిపక్ష నాయకులు ఎమ్మెల్సీ డాక్టర్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీ సిద్ధాంతాల కోసం అలుపెరగని పోరాటాలు చేసిన ప్రజావైద్యులు డాక్టర్ మల్లిఖార్జునరావు అకాల మరణం ఈ ప్రాంత నిరుపేదలకు ఎంతో లోటని అన్నారు. వైద్యసేవలే నామమాత్రంగా ఉన్న ఈ రోజుల్లో ఉచిత వైద్యసేవలం దించి ఒక ఆదర్శ ప్రజావైద్యుడిగా ఆయన పేరు గడించారన్నారు. మాజీ ఎమ్మెల్యే మాకినేని పెదరత్తయ్య మాట్లాడుతూ వైద్యసేవలతో పాటు శాస్త్రీయ దృక్పథాన్ని ప్రజల్లో ప్రచారం చేసి మూఢనమ్మకాలను తొలగించేందుకు డార్విన్ సిద్ధాంతాన్ని ప్రచారం చేసేందుకు స్వగృహంలోనే అనేక శాస్త్రవేత్తల విగ్రహాలను, సైన్స్ మ్యూజియంను ఏర్పాటు చేసి ఈ ప్రాంతంలోనే ఒక ప్రత్యేక గుర్తింపును దొప్పలపూడి తీసుకొచ్చారన్నారు.



సంస్మరణ సభలో మాట్లాడుతున్న పి మధు

సభలో మాజీ ఎమ్మెల్యే చీరాల గోవర్ధన రెడ్డి సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి.రమాదేవి, గుంటూరు తూర్పు, పశ్చిమ జిల్లాల కార్యదర్శులు పాశం రామారావు, గద్దె చలమయ్య వేగేశన ఫౌండేషన్ ఛైర్మన్ వేగేశన నరేంద్రవర్మ, డాక్టర్ కొల్లా రాజమోహన్ తదితరులు పాల్గొన్నారు.

మోడీని ప్రజలే ఓడిస్తారు

పిసిసి అధ్యక్షులు ఎన్.రఘువీరారెడ్డి

ప్రజాశక్తి- కళ్యాణదుర్గం రూరల్(అనంతపురం)

మిత్రపక్షాలు దూరమై ఒంటరి, ఏకాకి అయిన ప్రధాని నరేంద్రమోడీని రాబోయేకాలంలో ప్రజలే ఓడిస్తారని, బిజెపి ప్రభుత్వం మునిగిపోయే నావ అని పిసిసి అధ్యక్షులు ఎన్.రఘువీరారెడ్డి అన్నారు. అనంతపురం జిల్లా కళ్యాణదుర్గంలో గ్రామస్థాయి బూత్ కమిటీ సభ్యుల విస్తతస్థాయి సమావేశం నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో రఘువీరారెడ్డి మాట్లాడారు. దేశవ్యాప్తంగా రానున్న సార్వత్రిక ఎన్నికలలో గెలుపే ధ్యేయంగా పనిచేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ఫ్యాన్ గాలి, హవా ఎక్కడా లేదని వైసిపిపై ఎద్దేవ చేశారు. కెసిఆర్, జగన్ ఇద్దరు బిజెపికి 'బి' టీమ్‌లని వారు తెరవెనుక రహస్య ఒప్పందాలు చేసుకున్నారని ఆరోపించారు. వారి ఒప్పందాలు రాష్ట్రానికి, దేశానికి తీవ్ర ద్రోహం చేస్తున్నాయని విమర్శించారు. బిసి అని చెప్పుకొని మోడీ బిసిలకు తీవ్ర అన్యాయం చేశారని చెప్పారు. పెరిగిన జనాభా దామాషా ప్రకారం వెనకబడిన కులాలకు రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. బిజెపికి అన్ని కులాల వారు దూరమయ్యారని అందుకే అగ్రకులాల రిజర్వేషన్లను తెరపైకి తెచ్చారని తెలిపారు.



ప్రభుత్వ ఆసుపత్రిని పరిశీలిస్తున్న ప్రజా ఆరోగ్యవేదిక నాయకులు

వైద్యరంగాన్ని విస్మరిస్తున్న పాలకులు

ప్రజారోగ్యవేదిక రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ రమణయ్య

ప్రజాశక్తి - మంగళగిరి (గుంటూరు)

రాష్ట్రంలోని ప్రభుత్వ వైద్యశాలల్లో పూర్తి స్థాయిలో పోస్టులు భర్తీ కాలేదని, బడ్జెట్‌లో నిధులు కూడా తక్కువ కేటాయించారని, దీంతో ప్రజలకు కనీస వైద్యం అందుబాటులో లేదని ప్రజా ఆరోగ్యవేదిక రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ రమణయ్య అన్నారు. ప్రజారోగ్యవేదిక రాష్ట్ర కమిటీ, గుంటూరు, కృష్ణాజిల్లా కమిటీల విస్తృత సమావేశం అరవింద మోడల్ స్కూల్లో ఆదివారం ప్రజారోగ్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ సుధాకర్ అధ్యక్షతన జరిగింది. సమావేశం అనంతరం మంగళగిరి ప్రభుత్వ ఆసుపత్రిని పరిశీలించారు. రమణయ్య విలేకరులతో మాట్లాడుతూ రాజధానిలో ఉన్న మంగళగిరి ప్రభుత్వ ఆసుపత్రికి రోజుకు 300 మంది వివిధ జబ్బులతో బాధపడేవారు వస్తున్నప్పటికీ ఒకే ఒక్క డాక్టర్ ఇక్కడ పనిచేయడం దారుణమన్నారు. ఆసుపత్రుల్లో మౌలిక వసతులు కల్పించలేకపోవడం వల్ల బెడ్‌లు ఉన్నప్పటికీ ఇన్‌పేషెంట్లు లేక ఖాళీగా దర్శనమిస్తున్నాయన్నారు. ఇండియన్ మెడికల్ కౌన్సిల్ సభ్యులు డాక్టర్ రామ్‌ప్రసాద్ మాట్లాడుతూ మంగళగిరి ప్రభుత్వ ఆసుపత్రిని డిఎంఇ పరిధి నుండి వైద్య విధాన పరిషత్‌లోకి మార్చాలని కోరారు. పేద ప్రజలకు వైద్యం సక్రమంగా అందేలా ప్రజాప్రతినిధులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నాన్ పొలిటికల్ జెఎసి రాష్ట్ర అధ్యక్షులు అప్పికట్ల శ్రీనివాసరావు, ప్రజారోగ్యవేదిక జిల్లా అధ్యక్షులు డాక్టర్ కె.వి.ఎస్.సాయిప్రసాద్, పిఎంసి సభ్యులు అజహర్, రీజినల్ కన్వీనర్స్ కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.0

బిసిలకు వంద అసెంబ్లీ సీట్లు

ధర్మ దీక్షలో డిమాండ్

ప్రజాశక్తి - సత్యనారాయణపురం (విజయవాడ)

వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలూ 100 శాసన సభ, 15 లోక్‌సభ సీట్లు కేటాయించాలని డిమాండ్ చేస్తూ జాతీయ బీసీ సంఘం ఆధ్వర్యంలో 'బీసీ ధర్మ దీక్ష' జరిగింది. విజయవాడలోని ధర్నా చౌక్ వద్ద ఆదివారం జగిరిన ఈ దీక్షలో అన్ని బీసీ కులాలకు చెందిన నాయకులు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న జాతీయ బీసీ సంఘం జాతీయ అధ్యక్షులు దేరంగుల ఉదయ్‌కిరణ్ మాట్లాడుతూ బీసీలకు రాజ్యాధికారం లభించకపోవటంతో అన్ని రంగాల్లోనూ వెనుకబడి ఉన్నారని అన్నారు. ఇప్పటికీ వడ్డెర, రజక, విశ్వబ్రాహ్మణ, మేదర, నాయీ బ్రహ్మణ కులాలు అసెంబ్లీలో అడుగుపెట్టలేదని తెలిపారు. ఆయా కులాలకు 5 అసెంబ్లీ సీట్లు కేటాయించాలని రాజకీయ పార్టీలను కోరారు. వచ్చే ఎన్నికల్లో బీసీలకు ప్రాధాన్యత ఇచ్చే పార్టీలకే అండగా ఉండాలని బీసీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సభకు ఎ.ఒ.కామాచార్యులు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్‌విఎస్.ప్రసాద్, కోశాధికారి బాలాంజ నేయులు, జాతీయ మహిళా అధ్యక్షురాలు ఎం.నిర్మల, యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు టి.శ్రీకాంత్, విశ్వబ్రాహ్మణ యువజన సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి జె సుధీర్ పాల్గొన్నారు.

ఒంటరి మహిళపై దాష్టీకం

ప్రజాశక్తి - ఫిరంగిపురం (గుంటూరు జిల్లా)

మహిళ చేతికి ఉన్న గాజులను కాజేసేందుకు వచ్చిన ఒక దుండగుడు అత్యంత కిరాతకంగా వ్యవహరించిన ఘటన గుంటూరు జిల్లా ఫిరంగిపురం మండలం వేములూరిపాడులో ఆదివారం తెల్లవారుజామున జరిగింది. పోలీసుల కథనం ప్రకారం మూడేళ్ల క్రితం భర్త మృతి చెందడంతో తాటి శివకుమారి ఒంటరిగా జీవిస్తోంది. ఆమె ఇద్దరు కుమారులు మలేషియాలో స్థిరపడ్డారు. తెల్లవారుజాము 4 గంటల సమయంలో శివకుమారి నిద్రలేచి బయటికిరాగా అప్పటికే ఆమెపై దాడిచేసేందుకు కారంతో సిద్ధంగా ఉన్న అదే గ్రామానికి చెందిన తొర్లికొండ బాబురావు ఆమె కళ్ళలో కారం చల్లాడు. దీంతో ఆమె విలవిలలాడుతుండగా ఆమెను తన చీరతోనే మెడకు చుట్టి వంటగదిలోకి తీసుకువెళ్లాడు. తలపై కర్రతో బలంగా కొట్టి గ్యాస్ స్టవ్ వెలిగించి ఆమెను కాల్చే ప్రయత్నం చేయగా ఆమె అపస్మారక స్థితికి చేరుకుంది. శివకుమారి మరణించిందని భావించి ఆమె చేతులకు ఉన్న నాలుగు బంగారు గాజులను తీసుకుని అక్కడినుంచి పారిపోయాడు. కొంతసేపటి తరువాత స్పహలోకి వచ్చిన శివకుమారి చుట్టుపక్కల స్థానికులకు సమాచారం ఇవ్వడంతో స్థానికులు 108కు సమాచారం అందజేసి ఆమెను గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. నరసరావుపేట డిఎస్‌పి డి.రామవర్మ ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ఆదివారం సాయంత్రానికి నిందితుడ్ని పట్టుకున్నారు. నిందితుడు అప్పులు చేసి, తాగుడుకు బానిసై ఈ ఘటనకు పాల్పడినట్లు క్రైం డిఎస్‌పి రవికృష్ణకుమార్ చెప్పారు.

చిత్తూరుకు హంద్రీనీవా జలాలు



నెరవేరిన 33 ఏళ్ల కల

ప్రజాశక్తి- చిత్తూరు ప్రతినిధి

ఒకటి కాదు.. పది కాదు.. దాదాపు 30ఏళ్లకు పైగా నిరీక్షిస్తున్న చిత్తూరు జిల్లా కరువు రైతు కల సాకారమయ్యింది. ఈ జిల్లా వాకిట్లోకి హంద్రీనీవా జలాలు ఆదివారం చేరుకున్నాయి. ఈ నీళ్ల రావడంతో పడమటి మండలాల్లోని రైతాంగం ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడి నుంచి మరి కొన్ని రోజుల్లో ముఖ్యమంత్రి నియోజవర్గం కుప్పానికి కృష్ణాజలాలు చేరుకోనున్నాయని అధికారులు చెబుతున్నారు. ఈ కృష్ణాజలాలు అనంతపురం జిల్లా జిడిపల్లి వద్ద గల జలాశయం నుంచి 22 కిలోమీటర్లు ప్రయాణించి ఇదే జిల్లాలోని కదిరి వద్ద గల చెర్లోపల్లి రిజర్వాయర్ చేరుతూ వచ్చాయి. ఇది 1.425 టిఎంసిల సామర్థ్యం కలదు. ఇందులో 30 శాతం నీళ్ల నిండిన తరువాత మూడు రోజుల క్రితం 150 క్యూసెక్కుల నీటిని కిందికి వదలారు. అవి చిత్తూరు జిల్లాలకు ముఖ ద్వారంగా పిటిఎం వద్ద గల బొంతపల్లికి చేరుకుంది. ఇక్కడున్న చెరువు నింపిన తరువాత కిందికి వదులుతామని అధికారులు చెబుతున్నారు. ఈ దఫాలో 1.2 టిఎంసిల నీటిని తరలిస్తున్నట్లు వారు అంటున్నారు. తొలుత వేసవి అవసరాలు తగ్గట్టుగా నీళ్ల వదలనున్నారు. ఈ జిల్లా పరిధిలో 69.84 కిలోమీటర్ల పొడవున ప్రధాన కావుల సాగనుంది. ఈ జలాల వల్ల తంబళ్లపల్లి, మదనపల్లి, పలమనేరు, కుప్పం నియోజక వర్గాల్లోని ప్రజలకు మేలు చేకూరనుంది. ఈ ప్రాంతాల్లో 1.80 లక్షల ఎకరాలకు సాగుకు, 10 లక్షల మందికి తాగునీరు లభించే అవకాశం ఉంది. అనేక అవరోదాలు అధిగమించి ఆదివారం నాడు కృష్ణాజలాలు చిత్తూరు జిల్లాకు చేరుకున్నాయి. దీంతో 33 ఏళ్ల నిరీక్షణకు తెరపడినట్లు అయ్యింది.

ప్రజ్ఞ

జవాబులు

1.కేరళ
2.పోచారం శ్రీనివాసరెడ్డి
3.ముంబాయి
4.ప్రేమ్ పరమేశ్వరన్
5.ఔరంగాబాద్

క్రాంతదర్శి-కందుకూరి పుస్తకావిష్కరణ



విజయనగరంలో పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

ప్రజాశక్తి- విజయనగరం కోట

సంఘసంస్కర్త, రచయిత కందుకూరి వీరేశలింగం రచనలను రాష్ట్ర ప్రభుత్వం ఆయన శతవర్ధంతి మే 27 నాటికి సమగ్ర సంప్రదింపు గ్రంథంగా రూపొందించాలని ప్రముఖ రచయిత రామతీర్థ కోరారు. కందుకూరి వీరేశలింగం శతవర్ధంతి సంవత్సర సందర్భంగా డాక్టర్ తూమాటి సంజీవరావు రాసిన క్రాంతదర్శి-కందుకూరి పుస్తకాన్ని విజయనగరంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో మున్సిపల్ చైర్మన్ ప్రసాదుల రామకృష్ణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ప్రధాన వక్త రామతీర్థ మాట్లాడుతూ కందుకూరి జీవితం, సాహిత్యం, రచనలు, అనువాద రచనలు 'క్రాంత దర్శి-కందుకూరి'లో పొందు పరిచారని తెలిపారు. ఆనాటి రోజుల్లో కందుకూరి రచనలు ప్రగతిశీలానికి, భాషా వికాసానికి, శిశు సంరక్షణకు, మహిళా చైతన్యానికి, సమాజ అభ్యున్నతికి తోడ్పడ్డాయన్నారు. మహాత్మా గాంధీ కంటే ముందుగానే దళితుల సంక్షేమం, విద్య కోసం కందుకూరి కృషి చేశారని చెప్పారు. చెన్నై రచయిత ఎల్.ఆర్.స్వామి మాట్లాడుతూ ఆనాడు సామాజిక పరిణామాల గురించి, సమాజాభివృద్ధికి కృషి చేసిన వారి గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సాహితీవేత్త ఎన్.కె.బాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రచయితలు తూమాటి సంజీవరావు, దాట్ల దేవదానంరాజు, పలువురు రచయితలు పాల్గొన్నారు.

మైనింగ్ ఆపాలని రహదారి దిగ్బంధం

ప్రజాశక్తి- గరుగుబిల్లి(విజయనగరం)

విజయనగరం జిల్లా గరుగుబిల్లి మండలం రావివలస వద్ద చేపట్టిన మైనింగ్ తవ్వకాలను నిలిపేయాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యాన పార్వతీపురం-పాలకొండ రహదారి లోని రావివలస జంక్షన్‌ను ఆదివారం దిగ్బంది .ంచారు. దీంతో అంతర్రాష్ట్ర రహదారి వద్ద వందలాది వాహనాలు నిలిచిపోయాయి. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా (పార్వతీపురం) కార్యదర్శి రెడ్డి శ్రీరామ్మూర్తి మాట్లాడుతూ గ్రామస్తులకు తెలియకుండా మైనింగ్ తవ్వకాలకు అనుమతులు ఇవ్వడం సరికాదన్నారు. ఒక కాంట్రాక్టర్ ప్రయోజనం కోసం వేలాది మంది ప్రయోజనాలను దెబ్బతీయడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో అధికారులు అక్కడికి చేరుకొని 30న గ్రామసభ నిర్వహిస్తామని, అంతవరకూ మైనింగ్ పనులు నిలుపుదల చేయిస్తామని హామీ ఇవ్వటంతో ఆందోళన విరమించారు.



ర్యాలీలో పాల్గొన్న తోట చంద్రశేఖర్, రావెల కిషోర్‌బాబు

సిద్ధాంతాలపై అవగాహన కల్పిస్తాం

జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోట చంద్రశేఖర్

ప్రజాశక్తి - గుంటూరు జిల్లా ప్రతినిధి

జనసేన పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలు, సిద్ధాంతాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఇంటింటికీ ప్రచారం నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోట చంద్రశేఖర్ తెలిపారు. గుంటూరులోని అడపాబజార్‌లో ఆదివారం నిర్వహించిన అవగాహన ర్యాలీలో ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. గతంలో ఇతర పార్టీల మాదిరిగా ఆచరణ సాధ్యం కాని హామీలను జనసేన ఇవ్వదన్నారు. నిజమైన సమస్యలపై తమపార్టీ దృష్టి సారిస్తుందన్నారు. కులమతాలకు అతీతంగా అందరూ సమన్వయంతో జనసేన పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. విద్యార్థులు, యువత, మహిళలకు తగిన ప్రాతినిధ్యం కల్పిస్తామని చెప్పారు. కేవలం అధికారమే పరమావధి కాదని రాజకీయ వ్యవస్థలో మార్పు కోసమే తమపార్టీ అధినేత పవన్ కల్యాణ్ కృషి చేస్తున్నారని తెలిపారు. మాజీ మంత్రి రావెల కిషోర్‌బాబు మాట్లాడుతూ ప్రజా సమస్యలను విస్మరించిన టిడిపి, వైసిపిలను వచ్చే ఎన్నికల్లో ప్రజలు ఓడించాలని కోరారు. టిడిపి, వైసిపిలకు దీటుగా పార్టీ నాయకులు, కార్యకర్తలు పార్టీ సిద్ధాంతాలు, పవన్ కళ్యాణ్ ఇచ్చిన హామీలను ప్రజల్లోకి తీసుకు వెళ్లాలని కోరారు.

ప్రత్యేకం

ట్రాఫిక్ చక్రబంధంలో కర్నూలు

- ప్రజలు విలవిల
- వారధులు, రోడ్ల విస్తరణ అవసరం
- స్పందించని ప్రభుత్వం

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

కర్నూలు నగరం ఒక్కప్పుడు రాష్ట్రానికి రాజధాని. కర్నూలు పేరుకు నగరస్థాయిలో ఉన్నప్పటికీ ట్రాఫిక్ సమస్య ప్రజలను పట్టిపీడిస్తోంది. ఇంటి దగ్గర బయల్దేరి నేరుగా కార్యాలయాలకు వెళ్లలేనంతగా ట్రాఫిక్ రద్దీ రోజుకు రోజుకు పెరుగుతోంది. కర్నూలు నగరం వైశాల్యం 69.5 చదరపు కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. శివారు ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్య పెద్దగా లేకున్నా కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని మాత్రం విపరీతంగా ఉంది. పాతబస్తీ, పాతబస్టాండ్, హాస్పిటల్, పెద్దపార్కు, పూలబజార్, వన్‌టౌన్ లాంటి ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్య వాహనదారులకు చుక్కలు చూపుతోంది. సరైన వెడల్పులో రోడ్లు, అవసరమైన చోట ప్లై ఓవర్‌లు లేకపోవడంతో ట్రాఫిక్‌తో సమయం వృధా అవుతోంది. ఇది సకాలంలో పాఠశాలకు వెళ్లే విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులకు ఇబ్బందికరంగా మారింది.

రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన నగరాల్లో కర్నూలు ఐదోస్థానంలో ఉంది. కర్నూలులో దాదాపు 5.50 లక్షలకు పైగా జనాభా ఉంది. ప్రజా జీవనానికనుగుణంగా సౌకర్యాలు లేకపోవడం పెద్దలోపం. ఇటీవల కాలంలో మార్కెట్‌లోకి కొత్త వాహనాలు పెద్ద ఎత్తున రావడం, యువతకు ఇతర ఉపాధి అవకాశాలు లేక ఆటోరంగంపైనే ఆధారపడి ఆటోలను పెద్ద సంఖ్యలో కొనుగోలు చేస్తుండడంతో రోడ్లన్నీ వాహనాలతో నిండిపోతున్నాయి. ఒక్క కర్నూలు నగరంలోనే 2.68 లక్షల ద్విచక్రవాహనాలు, 30 వేలకు పైగా ఆటోలు ఉన్నాయి. ఇవన్నీ నగర రోడ్లపై రోజువారీగా రాకపోకలు కొనసాగిస్తున్నాయి. నగరం నడిబొడ్డున పేరుగాంచిన రాజ్‌విహార్ సెంటర్‌లో ట్రాఫిక్ జామ్‌కు వేళాపాళా ఉండదు. ఉదయం 7 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకూ బళ్లారి చౌరస్తా, కొత్తబస్టాండ్, బంగారుపేట, మౌర్యాఇన్, రాజ్‌విహార్, పెద్దాస్పత్రి సర్కిళ్లలో వాహనాలు కిలోమీటరు మేర అగిపోతున్న పరిస్థితి వుంది. ఈ సర్కిళ్లతో పాటు గాయిత్రీ ఎస్టేట్, ఆర్ఎస్ రోడ్డు, ఎస్‌బిఐ సర్కిల్, కొండారెడ్డి బురుజు, గడియారం ఆసుపత్రి, అబ్దుల్లాఖాన్ ఎస్టేట్, పూలబజార్, మండిబజార్, వన్‌టౌన్ ప్రాంతాల్లో ట్రాఫిక్ నిత్యం రద్దీగా ఉంటోంది.. కనీసం అరగంటకు పైగా ట్రాఫిక్‌లోనే నిలబడి పోతున్న పరిస్థితి వుంది. వాహనాల సంఖ్యకనుగుణంగా రోడ్ల విస్తరణను ప్రభుత్వం చేపట్టలేదు. అవసరమున్న ప్రాంతాల్లో ప్లై ఓవర్ల విస్తరణ ఊసే లేదు. పాతబస్తీలో దాదాపుగా 2 లక్షల మందికి పైగా జీవనం సాగిస్తున్నారు. ఈ ప్రాంతంలోకి వెళ్లేందుకు వాహనదారులు నరకయాతన పడాల్సిందే.

ట్రాఫిక్ సమస్యకు రోడ్ల విస్తరణతోపాటు ప్లైఓవర్‌లు పరిష్కారమని ట్రాఫిక్ పోలీసులు చెబుతున్నారు. బళ్లారి చౌరస్తా నుంచి రాజ్‌విహార్ మీదుగా హాస్పిటల్, సి.క్యాంపు ప్రాంతాలను దాటి నంద్యాల చెక్‌పోస్టు వరకూ మధ్యలో రోడ్లు కలిసే చోట చిన్న చిన్న ప్లైఓవర్‌లను లింక్ చేస్తూ ఓ భారీ ప్లై ఓవర్‌ను నిర్మించాల్సిన అవసరం ఉంది. మధ్య మధ్యలో ఉన్న కాలనీలకు ఉన్న సర్వీసు రోడ్లను కలిపేలా చర్యలు చేపట్టాలని నగర ప్రజలు కోరుతున్నారు. అలాగే హంద్రీ, కెసి కెనాల్‌పై అవసరమున్న ప్రతిచోటా బ్రిడ్జిలను నిర్మిస్తే ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం దొరుకుతుంది. 2007లో కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి సిపిఎం ఎమ్మెల్యే ఎంఎ గఫూర్ ఉన్న సమయంలో హంద్రీ, తుంగభద్రల వెంట రక్షణగోడల నిమిత్తం ఇరువైపులా నిధులను మంజూరు చేయించారు. అయితే ఆ తర్వాత వచ్చిన ఎమ్మెల్యేగా వచ్చిన ప్రజాప్రతినిధులు ఆ పనులను పక్కన పెట్టేశారు. దీంతో ట్రాఫిక్ సమస్య ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైంది. ప్రభుత్వం కర్నూలు ట్రాఫిక్ సమస్య పరిష్కారం కోసం రూ.150కోట్లతో రోడ్ల విస్తరణకు, బ్రిడ్జిల నిర్మాణానికి డిపిఆర్ తయారు చేసినా దానిని పట్టించుకునే నాథుడే లేడు. నగర ప్రజలు ట్రాఫిక్ సమస్యతో మగ్గిపోతున్న పరిస్థితి నిత్యకృత్యమైంది.



రోడ్డు విస్తరణ, ప్లైఓవర్ నిర్మాణాలు చేపట్టాలి

డి.గౌస్‌దేశాయ్, సిపిఎం జిల్లా నాయకులు

నగరంలో ఉన్న రోడ్లన్నీ శాస్త్రీయ పద్ధతిలో నిర్మాణాలు జరగలేదు. అవసరమున్న చోట విస్తరణ పనులు చేయకుండా అవసరంలేని చోట చేపడుతున్నారు. శాస్త్రీయ పద్ధతిలో రోడ్ల విస్తరణతోపాటు ప్లైఓవర్లను వెంటనే నిర్మించాలి.

పెరిగిన వాహనాల రద్దీ

సుధాకర్ రెడ్డి, ట్రాఫిక్ డిఎస్‌పి, కర్నూలు

వాహనాల రద్దీ నగరంలో పెరిగిపోయింది. ఇందుక నుగుణంగా ట్రాఫిక్ సిబ్బందితో ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నాం. వాహనదారులు, ప్రజలు అవగాహనతో నిబంధనల ప్రకారం నడుచుకుంటే ట్రాఫిక్ సమస్యను నియంత్రించేందుకు అవకాశం ఉంది.

రాష్ట్ర పండుగగా నిర్వహించాలి

కోటప్పకొండ పండుగ సభలో రాష్ట్ర మంత్రులు

ప్రజాశక్తి - గుంటూరు సిటీ ప్రతినిధి

కోటప్పకొండ పండుగను వచ్చే ఏడాది నుంచి రాష్ట్ర పండుగగా నిర్వహించాలని విద్యాశాఖ మంత్రి ఘంటా శ్రీనివాసరావు అన్నారు. కోటప్పకొండలో కొండ పండుగ ముగింపు సభను స్పీకర్ డాక్టర్ కోడెల శివప్రసాదరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఘంటా మాట్లాడుతూ పర్యాటక శాఖ గతంలో ఎవరూ చేయలేని విధంగా జిల్లాల వారీగా ఆయా జిల్లాల ప్రాముఖ్యతలకు అనుగుణంగా విశాఖ బీచ్ ఫెస్టివల్, నెల్లూరులో ఫ్లెమింగ్ ఫెస్ట్, గుంటూరు కోటప్పకొండలో కొండ పండుగ నిర్వహించారన్నారు. పర్యావరణ పరిరక్షణ స్పృహను ప్రజల్లో కల్పించేందుకు కొండ పండుగ నిర్వహించడం అభినందనీయమన్నారు. కోడెల శివప్రసాదరావు మాట్లాడుతూ ప్రపంచంలో ఆస్ట్రేలియా, అమెరికా తర్వాత కొండ పండుగ కోటప్పకొండలో నిర్వహించామని పేర్కొన్నారు. ప్రకృతి పట్ల అవగాహన, బాధ్యత కల్పించేందుకే కొండ పండుగకు శ్రీకారం చుట్టామని పేర్కొన్నారు. మంత్రులు అటవీ శాఖ మంత్రి సిద్ధా రాఘవరావు, దేవినేని ఉమామహేశ్వరరావు, పరిటాల సునీత ప్రసంగించారు. హనుమత్ శాస్త్రి రచించిన కోటప్పకొండ చరిత్ర పుస్తకాన్ని డాక్టర్ కోడెల శివప్రసాదరావు, రాష్ట్ర మంత్రులు ఆవిష్కరించారు. తొలుత మంత్రులు త్రికోటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. మనో, అంజనా సౌమ్య, దీపు, ఉమా నేహల్, మోహన్, ధనుంజయ్ గేయాలపన, కొరియోగ్రాఫర్ సురేష్‌వర్మ బృందం నృత్యప్రదర్శనలు, అలేఖ్యభరణి ప్లేట్ డ్యాన్స్, మేడసాని మోహన్ ఆధ్యాత్మిక ప్రసంగంతో ఆహూతులను అలరించారు. వ్యాఖ్యాతలుగా మురళీకృష్ణ, శ్యామల వ్యవహరించారు. భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు విజయభాస్కర్, పర్యాటక శాఖ ఇడి మల్లికార్జునరావును స్పీకర్ కోడెల శివప్రసాదరావు సత్కరించారు.

ఆధార్ ఉంటే చాలు!

న్యూఢిల్లీ : 15ఏళ్ళ లోపు, 65ఏళ్ళ పైబడినవారు నేపాల్, భూటాన్‌లకు ప్రయాణం చేయడానికి ఆధార్‌కార్డులను చట్టబద్ధమైన పత్రాలుగా ఉపయోగించుకోవచ్చని కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ రెండు వయస్సుల వారు కాకుండా ఇతర భారతీయులు ఈ రెండు పొరుగు దేశాలకు ప్రయాణించడానికి ఆధార్‌ను ఉపయోగించరాదని హోం శాఖ వివరించింది. నేపాల్, భూటాన్ వెళ్ళాలనుకునే భారతీయులకు పాస్‌పోర్ట్, భారత ప్రభుత్వం జారీ చేసిన ఫోటో గుర్తింపు కార్డు లేదా ఎన్నికల ఐడి కార్డు వున్నట్లైతే వారికి వీసా అవసరం లేదని ఆ ప్రకటన తెలిపింది. గతంలో 15ఏళ్ళ లోపు, 65ఏళ్ళు పైబడినవారు పాన్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన ఆరోగ్య కార్డు, లేదా రేషన్ కార్డు చూపించి ప్రయాణం చేసే వీలు వుండేది, ఆధార్ ఉపయోగించడానికి వుండేది కాదు, కానీ ఇప్పుడు దాన్ని సవరించి ఆధార్‌తో కూడా ప్రయాణాలు చేసేలా అనుమతించినట్లు హోం శాఖ అధికారి వివరించారు.

ప్రదర్శన

విద్యుత్ పంపకాన్ని ప్రైవేటు సంస్థ టోరెంట్ పవర్‌కు ఇవ్వటానికి నిరసనగా మహారాష్ట్రలోని ముంబ్రా- కాల్వా- ఖరేగావ్-షిల్ నివాసులు థానే జిల్లా కలెక్టర్ ఆఫీసుకు నిరసన ప్రదర్శన నిర్వహించారు.



ఫాసిస్ట్ శక్తుల యత్నాన్ని ఖండిద్దాం

జర్నలిస్టు వాంగ్‌ఖెమ్ కుటుంబానికి రాహుల్ లేఖ

గువహటి : భారతదేశపు భావజాలాన్ని, ఆలోచనను నాశనం చేసేందుకు ఫాసిస్ట్ శక్తులు ప్రయత్నించడాన్ని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు ఆయన మణిపూర్ జర్నలిస్టు కిషోర్‌చంద్ర వాంగ్‌ఖెమ్‌కు ఒక లేఖ రాశారు. దేశద్రోహం ఆరోపణలపై రెండు మాసాల క్రితం ఆయనను నిర్బంధంలోకి తీసుకున్నారు. రాహుల్ ఈ నెల 2నే ఈ లేఖ రాసినప్పటికీ మణిపూర్ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు టి.ఎన్.హోకిప్ ఆ లేఖ కాపీని జర్నలిస్టు భార్య ఎలంగ్‌బమ్ రంజితకు ఈ నెల 18న అందచేశారు. జాతీయ భద్రతా చట్టం కింద కిషోర్‌చంద్రను అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నానని రాహుల్ ఆ లేఖలో పేర్కొన్నారు. అసమ్మతి గొంతు నొక్కేందుకు ప్రభుత్వ యంత్రాంగం చేసిన మరో ప్రయత్నమే ఇదని వ్యాఖ్యానించారు. గత కొద్ది మాసాలుగా బిజెపి ప్రభుత్వం మణిపూర్ ప్రజల రాజ్యాంగబద్ధమైన హక్కులను కాలరాయడానికి ప్రయత్నించడాన్ని మనం చూస్తున్నామని ఆ లేఖ పేర్కొంది. కిషోర్‌చంద్ర కుటుంబానికి తమ పార్టీ పూర్తి అండగా నిలబడుతుందని రాహుల్ హామీ ఇచ్చారు. గతేడాది నవంబరు 19న ఫేస్‌బుక్‌లో ఒక వీడియో పెట్టినందుకు వాంగ్‌ఖెమ్‌ను దేశద్రోహం అభియోగాలపై 27న అరెస్టు చేశారు. మోడీ ప్రభుత్వ కీలుబొమ్మగా రాష్ట్ర ముఖ్యమంత్రి బీరేన్ వ్యవహరిస్తున్నారని ఆ వీడియో పేర్కొంది. దాన్ని దేశద్రోహంగా ప్రభుత్వం భావించి, అరెస్టు చేసింది.

అది అవినీతి కూటమి

మహాకూటమిపై ప్రధాని మోడీ

న్యూఢిల్లీ : మహా కూటమి ఒక అవినీతి కూటమి అని ప్రధాని మోడీ ఆదివారం వ్యాఖ్యానించారు. ప్రతిపక్ష పార్టీలు శనివారం కోల్‌కతాలో ఐక్యతా ర్యాలీ నిర్వహించి బల ప్రదర్శన చేసిన ఒక రోజు తరువాత మోడీ ఆ కూటమిని లక్ష్యంగా చేసుకుని తీవ్ర విమర్శలు గుప్పించారు. దానిని "అవినీతి, కుంభకోణాలు, వ్యతిరేకతలు, అస్థిరత్వంతో కూడిన కూటమి" అని ఆయన అభివర్ణించారు. మహారాష్ట్ర, గోవాలలో ఆదివారం పార్టీ కార్యకర్తల నుద్దేశించి మోడీ మాట్లాడుతూ ప్రతిపక్ష పార్టీలు ఒకదానితో ఒకటి కలిసి కూటమిగా ఏర్పడ్డాయన్నారు. కాని తన పార్టీ దేశంలోని 125 కోట్ల మంది ప్రజలను ఒక కూటమిగా రూపొందించిందన్నారు. దీనిని బట్టి ఏ కూటమి బలమైనదో తెలుసుకోవాలన్నారు. మహా కూటమి వేదికపై ఉన్న నేతలలో అత్యధికులు తమ కుమారులను రాజకీయాలలో నిలబెట్టాలని ప్రయత్నిస్తున్నవారో, నాయకుల కుమారులో ఉన్నారన్నారు. వారిది ధనశక్తి అయితే తనది జనశక్తి అని చెప్పారు. తృణమూల్ కాంగ్రెస్ కోల్‌కతాలో శనివారం నిర్వహించిన ఐక్యతా ర్యాలీలో 23 రాజకీయ పార్టీలు పాల్గొన్న సంగతి తెలిసిందే.

ఢిల్లీని ముంచెత్తిన పొగమంచు

29 విమానాలు ఆలస్యం, 25 రైళ్లు రద్దు

న్యూఢిల్లీ : ఢిల్లీని మంచు దుప్పటి కప్పేసింది. దట్టమైన పొగమంచు కారణంగా రైలు, విమాన రాకపోకలపై తీవ్ర ప్రభావం పడింది. ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి రావాల్సిన 29 విమానాలు ఆలస్యంగా నడిచాయి. దూరం ప్రాంతాలకు వెళ్లే 25 రైళ్లను అధికారులు నిలిపివేశారు. రానున్న రోజుల్లో ఉత్తర భారతం మరింత చలితో వణుకనుందని వాతావరణ విభాగం ముందస్తు హెచ్చరికలు జారీ చేసింది. జమ్ముకాశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లను మంచు తుఫాన్ ముంచెత్తనుందని, పంజాబ్, హర్యానా, ఉత్తర రాజస్తాన్, పశ్చిమ ఉత్తరప్రదేశ్‌లో రానున్న రోజుల్లో వర్షాలు కురుస్తాయని వెల్లడించింది. అదేవిధంగా త్రిపుర, ఢిల్లీ, యుపి, ఆంధ్ర, ఒడిశాల్లో పొగ మంచు ఎక్కువగా ఉండటంతో ఆయా రాష్ట్రాల్లో కూడా రైలు, విమాన రాకపోకలపై తీవ్ర అంతరాయం ఏర్పడింది.

ఢిల్లీలో మోడీ పప్పులుడకవు

షీలాదీక్షిత్

న్యూఢిల్లీ : 2014లో మాదిరిగా రానున్న లోక్‌సభ ఎన్నికల్లో దేశరాజధానిలో బిజెపికి మోడీ ప్రణాళిక పనిచేయదని ఢిల్లీ కాంగ్రెస్ అధ్యక్షురాలు షీలాదీక్షిత్ తెలిపారు. నాలుగున్నర ఏళ్ల పాలనలో ఢిల్లీకి బిజెపి ఏమీ చేయలేదని, వచ్చే ఎన్నికల్లో ప్రజలు కోపాన్ని ఆ పార్టీ ఎదుర్కోవాల్సి ఉంటుందని ఆమె పేర్కొన్నారు. రాష్ట్రంలో కోల్పోయిన పట్టును కాంగ్రెస్ వేగంగా తిరిగి దక్కించుకుంటుందని ఆమె చెప్పారు. ఆప్‌తో ఎలాంటి ఒప్పందాలు లేవని, ఆ పార్టీని నమ్మదగని పార్టీ అని గతంలోనే తెలిపామని ఆమె గుర్తు చేశారు. రాహుల్ గాంధీపై తమ నేతలు, కార్యకర్తలు పూర్తి నమ్మకంతో ఉన్నారని, లోక్‌సభ ఎన్నికల్లో మరింత ఉత్తమ ఫలితాలు సాధిస్తామని అన్నారు. వచ్చే ఎన్నికల్లో బిజెపికి గుణపాఠం చెప్పాలని దేశంలో ప్రజలంతా కృత నిశ్చయంతో ఉన్నారని చెప్పారు.

ఎయిమ్స్ నుంచి అమిత్‌షా డిశ్చార్జి

న్యూఢిలీ : స్వైన్‌ఫ్లూతో బాధపడుతూ స్థానిక ఎయిమ్స్‌లో చికిత్స పొందుతున్న బిజెపి అధ్యక్షుడు అమిత్‌షా ఆదివారం డిశ్చార్జి అయినట్లు హాస్పిటల్ వర్గాలు తెలిపాయి. ఛాతి, శ్వాస సంబంధమైన ఇబ్బందులతో బుధవారం ఆయన హాస్పిటల్‌లో చేరిన సంగతి తెలిసిందే. షా ఆరోగ్యం మెరుగ్గానే ఉందని, డిశ్చార్జి అనంతరం నేరుగా తన ఇంటికి వెళ్లారని బిజెపి నేత అమిత్ మాల్వియా అన్నారు.

'మోడీ వర్సెస్ ఆల్' ప్రచారంలో వాస్తవమెంత?

ది వైర్ పరిశీలనలో వెల్లడైన వాస్తవాలు



న్యూఢిల్లీ : గతేడాది మే నుండి ఒకే ఒక్క హెడ్‌లైన్ మీడియాలో ప్రధానంగా చర్చకు వస్తోంది. అదే 'మోడీ వర్సెస్ ఆల్'. ఇక్కడ మోడీకి ఇతర ప్రతిపక్షాలకి మధ్యనే పోటీ అన్నట్లు మీడియా కోడై కూస్తున్నప్పటికీ వాస్తవం అలా లేదని చెప్పడానికి పలు ఉదాహరణలు కనిపిస్తున్నాయి. అయితే ఇక్కడ మరో ప్రశ్న కూడా తలెత్తుతోంది. కేవలం నరేంద్ర మోడీని దింపడానికే మొత్తంగా ఇతర పార్టీలన్నీ కలిసి ఎందుకు ప్రయత్నించాల్సి వస్తోంది? అన్నది ప్రశ్నగా వుంది. మోడీ వంద రోజుల్లో వంద ర్యాలీలు అనే బృహత్తర కార్యక్రమాన్ని ప్రకటించారు. ఈ నేపథ్యంలో మనం చాలా తరచుగా 'మోడీ వర్సెస్ ఆల్' అనే మాటను ఆయన నుండి మీడియా నుండి మరిన్ని సార్లు వినాల్సి వస్తుంది. ఈ నేపథ్యంలో అసలు ఇందులో వున్న వాస్తవమెంతో పరిశీలిద్దాం.

శనివారం కోల్‌కతాలో జరిగిన ప్రతిపక్షాల ఐక్యతా ర్యాలీ, ఇంకా ఇటువంటి సంఘటనలు చూసినపుడు బిజెపికి వ్యతిరేకంగా ఉమ్మడి ఫ్రంట్ ఏర్పడుతోందనే ఒక భావన కలుగుతోంది. అయితే, ఇక్కడ రెండు వాస్తవాలను మనం విస్మరిస్తున్నాం. ఒకటి భారత పార్లమెంటరీ వ్యవస్థలో జాతీయ ఎన్నికల ఫలితం అంటే దేశవ్యాప్తంగా రెండు పార్టీల మధ్య లేదా ఇద్దరు వ్యక్తుల మధ్య పోటీ జరగదు, రాష్ట్రాల స్థాయిలో జరిగే పోటీల ఫలితాల సమాహారమే జాతీయస్థాయి ఎన్నికల ఫలితంగా ఆవిర్భవిస్తుంది. ఇక రెండో అంశం, ఈ రాష్ట్ర స్థాయి పోటీల్లో కూడా కూటములు లేదా ఫ్రంట్‌లు ఏర్పడినా వాటి వల్ల లబ్ది పొందేది ప్రత్యర్థుల కన్నా కూడా బిజెపినే.

జర్నలిస్టు నరేంద్ర నాథ్ మిశ్రా తన ట్వీట్ల ద్వారా లేవనెత్తిన ఈ అంశంపై ది వైర్ దృష్టి సారించింది. ప్రతి రాష్ట్రంలోనూ ప్రాంతీయ రాజకీయ సమీకరణాలను పరిశీలించింది. బిజెపికి వ్యతిరేకంగా మొత్తం ప్రతిపక్షమంతా ఒక తాటిపైకి వచ్చిందన్న భావనను పరీక్షించింది. వాస్తవానికి బయటకు ప్రచారం జరుగుతున్నది ఒకటైతే వాస్తవం అందుకు విరుద్ధంగా వుందని ఈ పరిశీలనలో వెల్లడైంది.

బీహార్ రాష్ట్రంలో మొత్తంగా 40లోక్‌సభా స్థానాలు వున్నాయి. ఇక్కడ ఎన్‌డిఎ మిత్రపక్షాలైన జనతాదళ్(యునైటెడ్), లోక్‌జనశక్తి పార్టీలతో కలిసి పోటీ చేస్తున్నట్లు బిజెపి ప్రకటించింది. జెడి(యు), బిజెపిలు చెరో 17సీట్లకు పోటీ చేస్తుంటే లోక్ జనశక్తి ఆరు సీట్లకు పోటీ చేస్తోంది. ప్రతిపక్షం వైపు, ఆర్‌జెడి, కాంగ్రెస్, ఎన్‌సిపి, వామపక్షాలు, ఇంకా ఇతర పార్టీలు సీట్ల సర్దుబాటు చేసుకుంటున్నాయి.

యుపిలో మొత్తంగా 80సీట్లు వుండగా అప్నాదళ్, సుహల్‌దేవ్ భారతీయ సమాజ్ పార్టీతో కలిసి బిజెపి పోటీ చేస్తున్నది. ఇక్కడ కాంగ్రెస్ ఒంటరిగా పోటీ చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఎస్‌పి-బిఎస్‌పి కూటమి ఏర్పడింది. రాష్ట్రీయ లోక్‌దళ్ కూడా వీటితో చేతులు కలిపేందుకు చర్చలు జరుగుతున్నాయి. ఆ కూటమిని మోడీ ఎదుర్కొనాల్సి వస్తోంది.

మహారాష్ట్రలో ద్విముఖ పోటీ వుంది. ఎన్నికల ముందు పొత్తు కుదిరిన భాగస్వాములకు, 2014లో పోటీ చేసిన కూటమికి మధ్య పోటీ వుంది. కాంగ్రెస్, ఎన్‌సిపిలను ఎదుర్కొనాలంటే శివసేనతో చేతులు కలపడం బిజెపికి తప్పదు

మోడీ ఒంటరిగా పోటీని ఎదుర్కొంటున్న రాష్ట్రం అంటూ ఏదైనా వుందంటే అది పశ్చిమ బెంగాల్. ఇక్కడ కూడా మోడీ వర్సెస్ ఆల్ కాదు. వాస్తవంగా మోడీకి మమతకి మధ్య పోటీ. బిజెపి మాదిరిగా తృణమూల్ కూడా ఒంటరిగానే పోటీ చేస్తోంది. కాంగ్రెస్ వామపక్షాలతో లేదా తృణమూల్‌తో చేతులు కలపవచ్చు కానీ ఇంకా ఏదీ ఖరారు కాలేదు. బెంగాల్‌కు సంబంధించినంతవరకు ప్రతీ పార్టీ ఇతర పార్టీతో 42సీట్లకూ పోటీ పడే అవకాశం వుంది.

తమిళనాడుతో పాలక అన్నాడిఎంకె బిజెపితో చేతులు కలిపే అవకాశం వుంది. మరోపక్క ప్రతిపక్ష డిఎంకె, కాంగ్రెస్, వామపక్షాలు, ఇంకా ఇతర పార్టీలు చేతులు కలిపాయి.

ఇక్కడ రెండు కూటముల మధ్య లేదా ఒక కూటమి, అన్నాడిఎంకె, బిజెపి మధ్య పోటీ వుంటుంది. అంతేకానీ మోడీ, ఇతర పార్టీలన్నింటి మధ్య పోటీ కాదు.

కేరళలో మూడు కూటముల మధ్య పోటీ వుంది. ఎల్‌డిఎఫ్, యుడిఎఫ్, ఐయుఎంఎల్ మధ్య ప్రతీసారీ పోటీ వుంటుంది. కొత్తగా వచ్చిన బిజెపి ఇక్కడ ఒంటరిగా పోటీ చేయనుంది. ఇక ఈశాన్యంలో అయితే బిజెపి లేదా దాని ప్రాంతీయ భాగస్వామ్య పార్టీల్లో ఒకటి అధికారంలో వుంది. కాబట్టి ఇక్కడ ఆ సమస్యే రాదు. అస్సాంలో బిజెపి, బోడో గణ పరిషత్ కలిసి పోటీ చేస్తున్నాయి. మణిపూర్, మేఘాలయల్లో బిజెపితో నేషనలిస్ట్ పీపుల్స్ పార్టీ (ఎన్‌పిపి) సీట్ల సర్దుబాటు చేసుకుంటోంది. మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్, బిజెపి మధ్య పోటీ నెలకొంది. రాజస్థాన్, ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్, గుజరాత్‌ల్లో కూడా అదే పరిస్థితి వుంది. పంజాబ్‌లో కాంగ్రెస్‌ది ఒంటరిపోరు, బిజెపి శిరోమణి అకాలీదళ్‌తో జత కట్టింది. ఇక్కడ ఆప్ కూడా వుంది. ఢిల్లీలో బిజెపి, కాంగ్రెస్, ఆప్‌ల మధ్యపోటీ వుంది. హర్యానా, ఒడిషాల్లో అందరి మధ్య పోటీ వుండగా, ఆంధ్రప్రదేశ్‌లో ప్రాంతీయ పార్టీ అయిన తెలుగుదేశం బిజెపితో తెగతెంపులు చేసుకుంది. ఇక్కడ ప్రాంతీయ పార్టీల మధ్యే పోటీ ప్రధానంగా వుండనుంది. తెలంగాణ పరిస్థితి అందుకు భిన్నంగా లేదు. కర్నాటకలో మాత్రం బిజెపిని అధికారానికి దూరంగా వుంచేందుకు కాంగ్రెస్, జనతాదళ్ సెక్యులర్‌తో కలిసి పోటీ చేస్తోంది.

23 నుండి రక్షణ సిబ్బంది సమ్మె

- పాల్గొననున్న నాలుగులక్షల మంది ఉద్యోగులు
- సంపూర్ణ మద్దతును ప్రకటించిన సిఐటియు

న్యూఢిల్లీ : రక్షణరంగంలో కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ ఈనెల 23నుంచి రక్షణరంగ ఉద్యోగ సమాఖ్యలు మూడు రోజులు సమ్మెకు దిగనున్నాయి. డిఫెన్స్ ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ, పెన్షన్ వంటి డిమాండ్‌లను పరిష్కరించాలంటూ ఆలిండియా డిఫెన్స్ ఫెడరేషన్ (ఏఐడిఎఫ్), ఇండియన్ నేషనల్ డిఫెన్స్ వర్కర్స్ ఫెడరేషన్(ఐఎన్‌డిడబ్ల్యూఎఫ్), భారతీయ ప్రతిరక్షా మజ్దూర్ సంఘ్(బిపిఎంఎస్)లు సంయుక్తంగా ఈ సమ్మెకు పిలుపునిచ్చాయి. ఈనెల 25వరకు జరిగే సమ్మెలో దాదాపు నాలుగు లక్షల మంది రక్షణరంగ ఉద్యోగులు పాల్గొనను న్నారు. రక్షణరంగ పరిశ్రమ ఉత్పత్తులను ప్రయివేటుపరం చేస్తున్న కేంద్ర ప్రభుత్వ తీరును ఏఐడీఎఫ్ తప్పుబట్టింది. రక్షణరంగ పరిశ్రమ తీవ్ర విపత్తులో ఉన్నదని హెచ్చరించింది. కేంద్రం.. అంబానీలు, అదానీలు వంటి కార్పొరేట్ల చేతికి వ్యూహాత్మక రక్షణ రంగాన్ని కట్టబెడుతూ వారికి మద్దతుపలకడాన్ని సమాఖ్యలు ప్రశ్నించాయి. ప్రధాని మోడీ ప్రతిష్టాత్మకంగా భావించి తీసుకొచ్చిన మేకిన్ ఇండియా రక్షణరంగంలో చారిత్రాత్మక తప్పిదమని, దీనితో దాదాపు 85వేల మంది ఉద్యోగుల భవితవ్యం ప్రశ్నార్థకంగా మారిందని కేంద్రంపై ఆరోపించాయి. సైనికులకు, ఆర్మీ వర్క్‌షాప్‌లకు, పలువిభాగాలకు తాజా పాలను సరఫరా చేసే మిలిటరీ ఫాంలను మూసివేయడం, ఆర్మీ బేస్ వర్క్ షాప్‌లను జీవోసీఓ మోడల్ పేరుతో ప్రయివేటుపరం చేయడం పట్ల కేంద్రం తీరుపై ఉద్యోగులు తప్పుబట్టారు. అలాగే నేషనల్ పెన్షన్ స్కీం(ఎన్‌పీఎస్)ను రద్దు చేసి సీసీఎస్ రూల్స్ 1972 కింద గ్యారెంటెడ్ పెన్షన్‌ను పునరుద్దరించాలని ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు.

సిఐటియు సంపూర్ణ మద్దతు

పౌర ఉద్యోగుల మూడురోజుల సమ్మెకు సీఐటీయూ తన సంపూర్ణ మద్దతు పలికింది. దేశవ్యాప్తంగా ఉన్న ఈ మూడు సంఘాల ఉద్యోగులకు సంఘీభావాన్ని ప్రకటిస్తూ ఓ ప్రకటనను విడుదల చేసింది. కేంద్రం తీసుకున్న నిర్ణయం కారణంగా ఇప్పటికే దేశీయ ఆయుధ కర్మాగారాల్లో ఉత్పత్తి సగానికి తగ్గిందని, ఇది వాటి మూసివేతకు, అమ్మకానికి దారి తీస్తున్నదని సిఐటియు ఆందోళన వ్యక్తం చేసింది. అనేక రక్షణ కొనుగోలు ఒప్పందాలను విదేశీ కంపెనీలతో ఆదరబాదరాగా కుదర్చుకోవడం వంటి కారణాలతో రక్షణ రంగంలో భారీ కుంభకోణాలు చోటుచేసుకుంటున్నాయని, దీనితో దేశ ఖజానాకు నష్టం వాటిల్లుతోందని సీఐటీయూ ఆరోపించింది.

కేంద్ర విధానాలతో రక్షణరంగం బలహీనం: తపన్‌సేన్

కేంద్ర ప్రభుత్వ ప్రమాదకర, తప్పుడు విధానాలతో దేశంలోని 50 రక్షణ కర్మాగారాలు తిరిగి పనికిరాకుండా పోయాయని సీఐటీయూ జనరల్ సెక్రెటరీ, రాజ్యసభ ఎంపీ తపన్ సేన్ అన్నారు. దేశ రక్షణ రంగాన్ని మోడీ ప్రభుత్వం క్రమక్రమంగా బలహీనపరుస్తోందని తెలిపారు. మోడీ ప్రభుత్వంలోని రాఫెల్ స్కాంతో దేశ రక్షణ సంస్థ హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్(హెచ్‌ఏఎల్) భారీ నష్టాలను చవిచూసిందని తపన్‌సేన్ ఆరోపించారు. పౌర ఉద్యోగులు చేపట్టే సమ్మె వారి డిమాండ్ల పరిష్కారం కోసమే కాదని, ఇది దేశ ప్రయోజనాల కోసమని అన్నారు.

మందిరంపై మాటిస్తే కాంగ్రెస్‌కు మద్దతు : విహెచ్‌పి

లక్నో : వచ్చే లోకసభ ఎన్నికల ప్రణాళికలో రామాలయం నిర్మాణాన్ని చేరిస్తే కాంగ్రెస్‌కు మద్దతిస్తామని విహెచ్‌పి ప్రకటించింది. ఆర్‌ఎస్‌ఎస్ ప్రధాన కార్యదర్శి, సంఘ్‌లో రెండవ స్థాయి నేత అయిన భయ్యాజి జోషి ఆలయం నిర్మాణంపై ప్రకటన చేసిన రెండు రోజుల తర్వాత విహెచ్‌పి ఆదివారం బిజెపి ప్రభుత్వంపై ఈ మేరకు ఒత్తిడి పెంచింది. అయితే, శ్రీరామ నవమి రోజున ఆలయ నిర్మాణాన్ని ప్రారంభించాలని సాధువులకు పిలుపునివ్వాలని విహెచ్‌పి నేతలు నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఆలయ నిర్మాణంపై జరుగుతున్న ఆలస్యంపై విహెచ్‌పి కార్యనిర్వాహక ఉపాధ్యక్షుడు అలోక్ కుమార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ తన ఎన్నికల ప్రణాళికలో ఆలయ నిర్మాణాన్ని చేరిస్తే మేం ఆ పార్టీకి మద్దతిచ్చే విషయాన్ని ఆలోచి స్తామని ప్రకటించారు. కాంగ్రెస్‌లో చేరడంపై ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలపై వున్న నిషేధాన్ని ఎత్తి వేయాల్సిన అవసరం కూడా వుందని అన్నారు.

డిఫెన్స్ కారిడార్ ప్రారంభం

తిరుచిరాపల్లి : రక్షణరంగంలో దేశీయ ఉత్పత్తులకు ప్రాధాన్యత కల్పించేందుకు తమిళనాడులో నిర్మించిన డిఫెన్స్ ఇండస్ట్రియల్ కారిడార్‌ను రక్షణశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డిఫెన్స్ కారిడార్‌కు స్థానిక పారిశ్రామికవేత్తల నుండి మంచి స్పందన వచ్చిందన్నారు. ఈ కారిడార్‌ను పాలక్కడ్ వరకు పొడిగించాలని వారు కోరినట్లు తెలిపారు. ప్రస్తుతం ఈ కారిడార్‌లో ఐదు నగరాలు మాత్రమే ఉన్నాయని చెప్పారు. చెన్నై, హోసూర్, సేలం, కోయంబత్తూర్, తిరుచిరాపల్లి నగరాలు కారిడార్‌లో ఉన్నాయి.

అపహరణ, దోపిడి కేసులో మహారాష్ట్ర ఎస్‌పికి జీవిత ఖైదు

ముంబయి : 2009నాటి అపహరణ, దోపిడి కేసులో ఒక పోలీస్ సూపరింటెండెంట్(ఎస్‌పి) రేంజ్ అధికారితో పాటు మరొకరికి మహారాష్ట్రలోని ఒక కోర్టు యావజ్జీవ కారాగార శిక్షను విధించింది. ప్రస్తుతం ముంబయిలోని హోంగార్డు విభాగంలో ఉన్నత పదవిలో ఉన్న మనోజ్ లోహార్‌ను, అతడి బంధువు ధీరజ్ యావలేలను దోషులుగా నిర్ధారిస్తూ ఈ నెల 16న విచారణ సందర్భంగా జలాన్ సెషన్ జడ్డి పివై లదేకర్ తీర్పునిచ్చారు. అయితే ఆ రోజు శిక్షను వాయిదా వేయగా శనివారం నాడు జీవిత ఖైదును ఖరారు చేస్తూ ఇద్దరికి ఐదు వేల రూపాయల జరిమానా విధించింది. వీరిద్దరిని ఐపిసి సెక్షన్ 342, 346, 364-ఎ, 385, 506 కింద దోషులుగా గుర్తించింది.

బిజెపి మహిళా ఎమ్మెల్యేకు నోటీసులు



న్యూఢిల్లీ : బహుజన్ సమాజ్ పార్టీ(బిఎస్‌పి) అధినేత్రి మాయావతిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బిజెపి ఎమ్మెల్యే సాధన సింగ్‌ను జాతీయ మహిళా కమిషన్ (ఎన్‌సిడబ్ల్యు) ప్రశ్నించనుంది. ఈ వ్యాఖ్యలపై ఆమె వివరణ ఇవ్వాలని కోరుతూ నోటీసులు పంపనుంది. మీడియా కథనాల ప్రకారం గతంలో బిఎస్‌పి, సమాజ్‌వాదీ పార్టీ(ఎస్‌పి)లు బద్ధశత్రువులుగా ఉండేవి. 1995లో లక్నోలోని ఓ గెస్ట్ హౌస్‌లో మాయావతిపై ఎస్‌పి కార్యకర్తలు పలుమార్లు దాడికి పాల్పడగా..ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని సాధన సింగ్ అనుచిత వ్యాఖ్యలు చేసినట్లు సమాచారం. 'ఆమెకు(మాయావతి) స్వీయ గౌరవం లేదు, ఆమె గతంలో లైంగిక వేధింపులకు గురయ్యారు. ద్రౌపదికి కూడా ఇటువంటి అవమానమే జరిగితే ఆమె తన పగను తీర్చుకుంది. కానీ ఈ మహిళ అధికారం కోసం తన గౌరవాన్ని అమ్ముకున్నారు. దీనిని పూర్తిగా ఖండిస్తున్నాం మాయావతి జీ. స్త్రీ జాతికే ఆమె ఒక మచ్చ. ఆమె నపుంసకుడి కంటే ఘోరం' అని శనివారం ఓ ర్యాలీలో సాధన వివాదాస్పదంగా వ్యాఖ్యా నించారు. ఈ వ్యాఖ్యలు ఖండిస్తున్నామని, దీనిపై సాధనకు వివరణ ఇవ్వాలని కోరుతూ సోమవారం నోటీసులు పంపనున్నట్లు. ఈ అంశాన్ని సుమోటోగా తీసుకున్న ఎన్‌సిడబ్ల్యు చైర్‌పర్సన్ రేఖా శర్మ తెలిపారు. బిజెపి ఎమ్మెల్యే చేసిన వివాదాస్పద వ్యాఖ్యలను ఎస్‌పి నేత అఖిలేష్ యాదవ్, రాష్ట్రీయ లోక్ దళ్ (ఆర్‌జెడి) నేత ఖండించారు. అయితే రానున్న ఎన్నికల నేపథ్యంలో ఇటీవల ఉత్తరప్రదేశ్‌లో ఎస్‌పి,బిఎస్‌పి పొత్తు పెట్టుకోవడంతోనే ఆమె ఈ వ్యాఖ్యలు చేసినట్లు కూడా సమాచారం. అయితే మాయావతిపై తాను చేసిన వ్యాఖ్యల పట్ల చింతిస్తున్నాని సాధన అన్నారు. ఎవరి మనోభావాలు దెబ్బతీసే ఉద్దేశం తనకు లేదని ఆమె పేర్కొన్నారు. గతంలో ఆమెకు ఎదురైన అనుభవాన్ని చెప్పాలని అనుకున్నానని, తనను అవమానించే ఉద్దేశంతో ఈ వ్యాఖ్యలు చేయలేదని క్షమాపణలు తెలిపారు. అయినప్పటికీ బిఎస్‌పి నేత రామచంద్ర గౌతమ్ బాబూరీ పోలీస్ స్టేషన్‌లో ఆమెపై ఫిర్యాదు చేశారు.

కర్ణాటకలో కలకలం

- ఆసుపత్రిలో చేరిన కాంగ్రెస్ ఎమ్మెల్యే
- రిసార్ట్స్‌లో ఘర్షణవల్లేనని కథనాలు
- ఛాతినొప్పితోనేనంటూ పిసిసి ఖండన
- నలుగురు ఎమ్మెల్యేలకు షోకాజ్ నోటీసులు

ప్రజాశక్తి ప్రతినిధి - బెంగళూరు



కర్ణాటక రాజకీయాల్లో ఆదివారం కలకలం చెలరేగింది. కాంగ్రెస్‌కు చెందిన నలుగురు ఎమ్మెల్యేలు శాసనసభాపక్ష సమావేశానికి గైర్హాజరవ్వడంతో వారికి ఆ పార్టీ నోటీసులు జారీ చేసింది. ఇదిలావుండగానే రిసార్ట్స్‌లో బస చేసిన ఎమ్మెల్యేలలో ఒకరిని ఆసుపత్రిలో చేర్పించారు. రిసార్ట్స్‌లో ఎమ్మెల్యేల మధ్య ఘర్షణ జరగడంతో గాయాలపాలైనందునే ఆసుపత్రిలో చేర్పించారని కథనాలు వచ్చాయి. బిజెపి ఆపరేషన్ కమల్ నేపథ్యంలో బెంగళూరులోని ఎగ్లాటన్ రిసార్ట్‌లో కొంతమంది ఎమ్మెల్యేలు బస చేశారు. రిసార్ట్స్‌లో శనివారం రాత్రి హోస్పేట ఎమ్మెల్యే ఆనంద్ సింగ్, కంప్లీ ఎమ్మెల్యే జెఎన్ గణేష్ గొడవపడ్డారని, ఈ ఘర్షణలో ఆనంద్ సింగ్ తలకు తీవ్ర గాయమవ్వడంతో ఆయనను ఆసుపత్రికి తరలించారని వార్తలు వెలువడ్డాయి. అయితే ఈ కథనాలను కాంగ్రెస్ ఖండిం చింది. ఇవన్నీ తప్పుడు కథనాలనీ, ఇద్దరు ఎమ్మెల్యేల మధ్య ఘర్షణేదీ జరగలేదని, మద్యం సీసాలు కూడా లేవనీ కాంగ్రెస్ నేత డికె శివకుమార్ తెలిపారు. ఇద్దరు ఎమ్మెల్యేలు త్వరలోనే మీడియాతో మాట్లాడుతారని చెప్పారు. ఛాతిలో నొప్పి రావడంతోనే ఆనంద్ సింగ్‌ను ఆసుపత్రిలో చేర్పించారనీ ఆయనను పరామర్శించిన అనంతరం కాంగ్రెస్ మరో నేత డికె సురేశ్ తెలిపారు. 'గొడవ గురించీ నాకు సమాచారం లేదు. ఛాతినొప్పి వల్లే ఆనంద్ సింగ్ ఆసుపత్రిలో చేరారు. గాయాల్లాంటివేవీ లేవు. అవన్నీ ఊహాగానాలే' అని సురేశ్ అన్నారు.

బిజెపి చేపట్టిన 'ఆపరేషన్ లోటస్'కు ఆకర్షితులై ఆనంద్ సింగ్, గణేష్ ఇరువురు బిజెపిలో చేరేందుకు సిద్ధమైనట్లు కథనాలు వచ్చాయి. తదనంతర పరిణామాల్లో ఆఫరేషన్ లోటస్ బెడిసికొట్టింది. ఈ విషయంపై వాదోపవాదాలే ఘర్షణకు దారితీశాయంటూ ఊహాగానాలు చెలరేగాయి. బిజెపి కర్ణాటక కమిటీ చేసిన ట్వీట్ ఈ వదంతులకు కారణమని కాంగ్రెస్ శ్రేణులు పేర్కొన్నాయి. 'కాంగ్రెస్ పరిస్థితి ఏమీ బాగోలేదని చెప్పడానికి ఇంత కంటే ఆధారాలు ఏం కావాలి. ఎగ్లాటన్ రిసార్ట్‌లో కాంగ్రెస్ ఎమ్మెల్యేల మధ్య భౌతిక ఘర్షణ జరిగింది. ఒకరు ఆసుపత్రిలో చేరారు' అని కర్ణాటక బిజెపి ఆదివారం ట్వీట్ చేసింది.

నలుగురు ఎమ్మెల్యేలకు షోకాజ్

శుక్రవారం జరిగిన శాసనసభాపక్ష సమావేశానికి గైర్హాజరైన నలుగురు ఎమ్మెల్యేలకు కాంగ్రెస్ షోకాజ్ నోటీసులు జారీ చేసింది. క్రమశిక్షణారాహిత్యం కింద చర్యలు ఎందుకు తీసుకోరాదో వివరణ ఇవ్వాలని కోరింది. ఇటీవల మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణలో తొలగింపునకు గురైన రమేశ్ జర్కిహోళి, బి నాగేంద్ర, ఉమేశ్ జాదవ్, మహేశ్ కుమతహల్లి కి ఈ నోటీసులు జారీ చేసినట్లు కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. జెడిఎస్-కాంగ్రెస్ కూటమి ప్రభుత్వాన్ని అస్థిరపర్చే కుట్రతో బిజెపి కుయుక్తులు పన్నుతున్న నేపథ్యంలో తమ బలాన్నీ చాటేందుకు కాంగ్రెస్ సిఎల్పీ సమావేశం నిర్వహించిన సంగతి తెలిసిందే.

ప్రత్యేకం

మతాల మధ్య చిచ్చుకే కాశీలో కూల్చివేతలు



వారణాసి : ప్రధాని నరేంద్రమోడీ తలపెట్టిన కాశీవిశ్వనాథ్ టెంపుల్ కారిడార్ ప్రాజెక్టు ఆయన సొంతనియోజకవర్గం వారణాసి నగర రూపురేఖలను మార్చటమే కాక మతాల మధ్య చిచ్చు పెట్టేవిధంగా తయారవుతోందన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ ప్రాజెక్టు అమలులో భాగంగా షాపులు, భవన్‌ల వంటి వాటితో పాటు అనేక చిన్నా, చితకా ప్రాచీన ఆలయాలను కూడా అధికారులు తొలగిస్తున్నారు. ఈ ఆలయాల తొలగింపు చర్యలు నగర హిందూ సాంస్కృతిక వారసత్వానికి గొడ్డలి పెట్టులా మారుతోందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాశీ విశ్వనాథ మందిరం నుండి గంగానదికి నేరుగా వెళ్లే దారిలో వున్న దాదాపు 296 నిర్మాణాలను తొలగించాలని అధికారులు ఇప్పటికే గుర్తించారు. ఇందులో కాశీ విశ్వనాధాలయాన్ని అనుకుని వున్న మొగలుల కాలం నాటి జ్ఞాన్‌వాపి మసీదు గేట్ నెం3 ప్రాంతం కూడా వుంది. ఈ తొలగింపుల్లో అనేక మంది తమ జీవనాధారాలను కోల్పోతున్నారు. నిన్న, మొన్నటి వరకూ ఈ ప్రాంతంలోని దుకాణాలలో చేతి వృత్తులతో పొట్టపోసుకునే వారు ఇప్పుడు ఈ భవనాల తొలగింపులతో జీవనోపాధి కోల్పోయి రోడ్డున పడుతున్నారు. ఆయా భవనాల యజమానులకు కోట్లాది రూపాయల పరిహారం చెల్లిస్తున్న ప్రభుత్వం అందులోని దుకాణాలలో చిరు వ్యాపారాలు చేస్తూ, చేతివృత్తులు నిర్వహించుకుంటూ పొట్టపోసుకునే వారికి కంటితుడుపు పరిహారాన్ని మాత్రమే అందచేస్తోంది. ఆ చిన్న మొత్తంతో ప్రత్యామ్నాయ ప్రదేశంలో ఎలా జీవించాలో తెలియక వారు తలపట్టుకుంటున్నారు. తమకు ప్రత్యామ్నాయ ఉపాధి మార్గం చూపాలంటూ అధికారులకు వారు చేసే విజ్ఞప్తులు చెవిటి వాని ముందు శంఖం ఊదిన రీతిగా మారుతున్నాయి. ముఖ్యంగా హిందూ, ముస్లింలు సోదర ప్రేమతో కలిసి జీవిస్తున్న వారణాసి నగరంలో కేంద్రంలోని మోడీ సర్కారు చేపట్టిన ప్రాజెక్టు ఇరువర్గాలలో ఆందోళన రేపుతూ వారి మధ్య చిచ్చు పెడుతోంది. ఈ ఆందోళన రేపు రానున్న లోక్‌సభ ఎన్నికల్లో ప్రతిఫలిస్తుందా అన్న ప్రశ్నకు మౌనమే సమాధానంగా ఎదురవుతోంది. అధికార పార్టీ శ్రేణుల కండబలానికి వారు భయపడుతుండటమే ఇందుకు ప్రధాన కారణం కావచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. కాగా అధికారుల తొలగింపుల నేపథ్యంలో ఇప్పుడు నగరంలోని అనేక ప్రాంతాలు యుద్ధంతో చిన్నాభిన్నమైన ప్రాంతాలను తలపిస్తున్నాయి. అనేక ప్రాచీన భవనాలు శిధిలాల కుప్పలుగా మారాయి. 'పర్యాటకులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రధాని మోడీ ఈ డ్రీమ్ ప్రాజెక్టును చేపట్టారు. అయితే ఇది తమకు తీరని నష్టాన్ని మిగిల్చింద'ని బాధితులు వాపోతున్నారు. కాగా విశ్వనాథ మందిరాన్ని అనుకుని వున్న జ్ఞాన్‌వాపి మసీదు ప్రహరీగోడను కాంట్రాక్టర్ తొలగించటంతో గత అక్టోబర్‌లో ముస్లింలు ఆందోళన చేపట్టారు. అయితే ఇది మత ఘర్షణలకు దారి తీస్తుందన్న భయంతో అధికార యంత్రాంగం కూల్చివేసిన గోడను రాత్రికి రాత్రే పునర్నిర్మించింది. కాగా ఈ గోడ తొలగింపు ప్రక్రియతో తీవ్ర ఆందోళనకు గురైన ముస్లింలు తమ మసీదును కూడా తొలగిస్తారన్న భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. గతంలో నాటి మొగల్ చక్రవర్తి ఔరంగజేబు మందిరాన్ని ధ్వంసం చేసి అక్కడ మసీదును నిర్మించినట్లు ఆరెస్సెస్ శ్రేణులు ప్రచారం చేస్తున్న నేపథ్యంలో ఈ మసీదును త్వరలోనే కూలగొట్టటం ఖాయమన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. మసీదు చుట్టూ ప్రహరీగోడను అధికారులు ఇప్పటికే కూలగొట్టటంతో తమకు భద్రత కరువైందని మసీదు నిర్వాహక కమిటీ సంయుక్త కార్యదర్శి సయీద్ యాసిన్ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంలో జోక్యం చేసుకోవాలని తాము సుప్రీంకోర్టును ఆశ్రయించగా అక్కడ తమకు నిరాశే ఎదురయిందని ఆయన చెప్పారు. తమ పిటిషన్‌ను కొట్టివేసిన కోర్టు దానిని లిఖితపూర్వకంగా ఎందుకు ఇవ్వలేదని ఆయన ప్రశ్నిస్తున్నారు. తమకు ఏ స్థాయిలోనూ భద్రతకు హామీ లభించటం లేదని ఆయన వాపోయారు. ముస్లింలు ఈ ప్రాజెక్టును ఎన్నికల ప్రాజెక్టుగా భావించటం లేదని, ఇక్కడ ఏ రాజకీయ పార్టీ కూడా హిందువుల ప్రయోజనాలను వ్యతిరేకించటం లేదని స్థానిక ముస్లిం ప్రముఖుడు అతీక్ అన్సారీ చెబుతున్నారు. అయితే దీర్ఘకాలంగా పెండింగ్‌లో వున్న కూల్చివేతను ఇప్పుడు ప్రారంభించటంతో ఔరంగజేబు కాలం నాటి బానిసత్వ చిహ్నం కూల్చివేస్తున్నారన్న సందేశం స్థానిక హిందువుల్లోకి వెళ్తోందని ఆయన అన్నారు. అనధికారికంగా ఆరెస్సెస్ శ్రేణులు, కాంగ్రెస్ శ్రేణులుకూడా ఇదే పాఠాన్ని వల్లె వేస్తుండటం గమనార్హం. కాశీలో మరో అయోధ్య సృష్టించాలన్న బిజెపి అజెండాలో భాగంగానే ఈ తొలగింపులు జరుగుతున్నాయని ఒక సీనియర్ జర్నలిస్టు వ్యాఖ్యానించారు.

ప్రపంచ వయో వృద్ధుడు కన్నుమూత



టోక్యో : ప్రపంచంలోనే అత్యంత వృద్ధుడు మసాజో నోనక(113) ఆదివారం కన్నుమూశారని జపనీస్ మీడియా వెల్లడించింది. మొట్టమొదటి మానవ సహిత విమానాన్ని రైట్ బ్రదర్స్ ప్రారంభించిన రెండు సంవత్సరాల అనంతరం, ప్రముఖ శాస్త్రవేత్త ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ తన సాపేక్ష సిద్ధాంతాన్ని ప్రచురించడానికి కొన్ని నెలల ముందే మసాజో జన్మించారు. మసాజో 1905 జులై 5న జన్మించగా, గత ఏడాది ఏప్రిల్‌లో ప్రపంచంలోనే అత్యంత వయో వృద్ధుడిగా గిన్నిస్ రికార్డును అందుకున్నారు.



5జి కోసం చైనా తొలి ఇన్నోవేషన్ పార్కు

బీజింగ్: అయిదో తరం నెట్‌వర్కు (5జి) కోసం తూర్పు చైనా జెజియాంగ్ ప్రావిన్స్‌లో అధునాతన ఇన్నోవేషన్ పార్కును ఆదివారం ప్రారంభించారు. అందరూ ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న 5జి నెట్‌వర్కు ఆవిష్కరణకు పరిశోధనలు నిర్వహించేందుకు అన్ని వసతులతో చైనా ఏర్పాటు చేసిన తొలి ఇన్నోవేషన్ పార్కు ఇదే. 5జి నెట్‌వర్కు సేవలను ఎప్పుడైనా రావచ్చని చైనా ఇండస్ట్రీ ఇన్‌సైడర్స్ కొందరు చెబుతున్నారు. 5జి నెట్‌వర్కు స్పీడ్ ఇప్పుడున్న దానికన్నా అనేక రెట్లు అధికంగా వుంటుందని, మొబైల్ టెక్నాలజీలో అది పెను సంచలనం సృష్టిస్తుందని వార్తలొస్తున్నాయి. అయితే 5జి నెట్‌వర్కు పూర్తి స్థాయిలో అందుబాటులోకి రావడానికి ఇంకొంత కాలం నిరీక్షించక తప్పదని మొబైల్ రంగంలో చైనా దిగ్గజం హ్యూవెయి టెక్నాలజీస్ తెలిపింది. ఈ దిశగా సాగించే కృషిలో అనేక సవాళ్లు ఎదురవుతున్నాయని ఆ కంపెనీ సిఇవో సియాంగ్ లిగాంగ్ చెప్పారు.

నోడీల్ బ్రెగ్జిట్‌ను అడ్డుకునే చర్యలకు కార్బిన్ మద్దతు?

లండన్: నోడీల్ బ్రెగ్జిట్ (ఎటువంటి ఒప్పందమూ లేకుండానే ఐరోపా కూటమి నుండి నిష్క్రమించే) ప్రక్రియను అడ్డుకునే చర్యలకు మద్దతును ప్రకటించేందుకు ప్రతిపక్ష లేబర్ పార్టీ నేత జెరిమీ కార్బిన్ సిద్ధమవుతున్నారు. బ్రెగ్జిట్ గడువును పొడిగించాలని ఇటు లేబర్ పార్టీతో పాటు దేశంలోని కార్మిక సంఘాలు కూడా డిమాండ్ చేస్తున్న విషయం తెలిసిందే. మార్చి మొదటి వారంలోగా కూటమితో ఎటువంటి ఒప్పందమూ కుదరకపోతే బ్రెగ్జిట్ గడువును పొడిగించేలా కూటమిని కోరాలంటూ ప్రధాని థెరెస్సామేపై వత్తిడి తెచ్చే ప్రతిపాదనను బలపర్చేందుకు కార్బిన్ సిద్ధమవుతున్నట్లు లేబర్‌పార్టీ వర్గాలు చెబుతున్నాయి. వచ్చే వారం జరిగే లేబర్ పార్టీ మహాసభలో ఈ తీర్మానానికి ఆమోద ముద్ర లభించే అవకాశం వున్నట్లు తెలుస్తోంది. అయితే దీనిపై ఇప్పటి వరకూ తుది నిర్ణయం తీసుకోలేదని లేబర్‌పార్టీకి చెందిన కొందరు సీనియర్ నేతలు చెబుతున్నారు.

సరిహద్దు గోడకు డబ్బులిస్తే..
వలసవాసులకు మినహాయింపులు..!

ట్రంప్ ప్రతిపాదన



వాషింగ్టన్: తాను తలపెట్టిన మెక్సికో సరిహద్దు గోడ నిర్మాణానికి కాంగ్రెస్ నిధులు కేటాయిస్తే అక్రమ వలసదారుల పట్ల అనుసరిస్తున్న కఠిన వైఖరిని కొంతమేర సడలించే అవకాశాన్ని పరిశీలిస్తానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతిపాదించారు. అక్రమంగా అమెరికా వచ్చిన లక్షలాది మంది వలసవాసులను వెంటనే తిప్పి పంపేయకుండా వారికి కొంతకాలం పాటు తాత్కాలిక ఆశ్రయం కల్పించే అంశాన్ని పరిశీలిస్తానని ఆయన వైట్‌హౌస్ నుండి టెలివిజన్‌లో ప్రజలనుద్దేశించి చేసిన ప్రసంగంలో చెప్పారు. అయితే ఈ ప్రతిపాదనను ప్రతిపక్ష డెమొక్రాట్స్ నిర్ద్వంద్వంగా తిరస్కరించటంతో, గత 29 రోజులుగా కొనసాగుతున్న పాక్షిక ఆర్థిక ప్రతిష్టంభన (షట్‌డౌన్) 30వ రోజు కూడా యధాతథంగా కొనసాగింది. 29 రోజుల ఆర్థిక ప్రతిష్టంభనకు తెరదించేందుకు చేస్తున్న ప్రయత్నాలలో భాగంగా ట్రంప్ ఈ ప్రతిపాదనను తెరపైకి తెచ్చినట్లు తెలుస్తోంది. ఈ ఆర్థిక ప్రతిష్టంభన కారణంగా లక్షలాది మంది ప్రభుత్వ ఉద్యోగులు వేతనాలందక వెతలు పడుతున్నారు. మరికొందరు ప్రభుత్వ ఉద్యోగాలకు గుడ్‌బై చెబుతున్నారు. వలసల విధానంలో సంస్కరణల అమలులో భాగంగా తాను అక్రమ వలసలపై కఠిన వైఖరిని అనుసరిస్తున్నానన్న ట్రంప్ ఈ సంస్కరణల అమలుకు పరస్పర విశ్వాసకల్పన, చిత్తశుద్ధి అవసరమన్న విషయాన్ని తాను ప్రకటించిన మినహాయింపులు నిరూపిస్తున్నాయన్నారు. వలసవాసులకు కొన్ని మినహాయింపులు ప్రకటిస్తున్నందుకు ప్రతిఫలంగా తాను మెక్సికో సరిహద్దుల్లో ప్రతిపాదిస్తున్న సరిహద్దు గోడ నిర్మాణానికి నిధులు కేటాయించాలని కోరుతున్నప్పటికీ డెమొక్రాట్‌లు పదేపదే నిరాకరిస్తుండటం దురదృష్టకరమని ఆయన వ్యాఖ్యానించారు. సరిహద్దు గోడ నిర్మాణానికి నిధులను కేటాయించేందుకు కాంగ్రెస్ తిరస్కరిస్తుండటంతో వివిధ ప్రభుత్వ విభాగాలకు నిధుల విడుదలకు సంబంధించిన ఉత్తర్వులపై సంతకాలు చేయకుండా ట్రంప్ భీష్మించుకు కూర్చున్న విషయం తెలిసిందే. దీనితో పాక్షిక ఆర్థిక ప్రతిష్టంభనకు తెర లేచింది. ఈ ప్రతిష్టంభనకు తెరదించేం దుకే తాను మరోమారు కాంగ్రెస్‌కు విజ్ఞప్తి చేస్తున్నానని ట్రంప్ తన ప్రసంగంలో వివరించారు.

డెమొక్రాట్లు తిరస్కృతి

మెక్సికో సరిహద్దు గోడ నిర్మాణానికి కాంగ్రెస్ నిధులు కేటాయిస్తే అక్రమ వలసదారుల పట్ల అనుసరిస్తున్న కఠిన వైఖరిని సడలించే అవకాశాన్ని పరిశీలిస్తానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రతిపాదనను డెమొక్రాట్లు తిరస్కరించారు. ట్రంప్ చేసిన ప్రతిపాదనను 'గతంలో తిరస్కరించిన అనేక ప్రతిపాదనల సంకలనం'గా స్పీకర్ నస్సీ పెలోసి ఒక ప్రకటనలో విమర్శించారు.



మహిళల భద్రత పట్టించుకోండి! ఆస్ట్రేలియన్ల డిమాండ్

మెల్బోర్న్ : దేశంలో మహిళలకు భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ ఆస్ట్రేలియాలోని పలు నగరాల్లో వేలాది మంది ప్రజలు ఆదివారం భారీ ప్రదర్శనలు నిర్వహించారు. మెల్బోర్న్ నగరంలో పాలస్తీనా విద్యార్థి ఒకరు అగంతకుడి తుపాకి గుండ్లకు బలైన నేపథ్యంలో దేశంలో మహిళలకు భద్రత కల్పించాలన్న డిమాండ్ ఊపందుకుంది. ఆస్ట్రేలియన్ మహిళలకు సంఘీభావంగా ప్రపంచ వ్యాప్తంగా అనేక నగరాలలో మహిళలు ర్యాలీలు నిర్వహించారు. మహిళలకు హక్కులకు మద్దతుగా సిడ్నీ నగరంలో జరిగిన ర్యాలీలో దాదాపు 3 వేల మందికి పైగా మహిళలు పాల్గొన్నారు. ఆస్ట్రేలియన్ నగరాలలో వీధుల్లో సంచరించే మహిళలకు సంపూర్ణ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ వీరు పెద్దపెట్టున నినాదాలు చేశారు. కాన్‌బెర్రా నగరంలో కూడా మహిళలు భారీ నిరసన ప్రదర్శన నిర్వహించినట్లు ఆస్ట్రేలియన్ బ్రాడ్‌కాస్టింగ్ సంస్థ తన వార్తా కథనాలలో వెల్లడించింది. చైనాలోని షాంఘయ్ యూనివర్శిటీ నుండి విద్యార్థుల మార్పిడి పథకంలో భాగంగా ఆస్ట్రేలియాకు వచ్చిన పాలస్తీనా విద్యార్థిని ఆలియా మస్వారే (21) గత వారారంభంలో మెల్బోర్న్‌లో తన మిత్రులతో కలిసి వెళ్తున్న సమయంలో హత్యకు గురైన విషయం తెలిసిందే.



నల్ల సముద్రంలోకి మరో యుద్ధ నౌక

- **మిత్రులకు సాయం చేసేందుకేనన్న అమెరికా,**
- **పర్యవేక్షణకు రష్యన్ నౌక**

మాస్కో: రెండు వారాల వ్యవధిలో రెండు అమెరికన్ యుద్ధ నౌకలు నల్ల సముద్రంలో ప్రవేశించడం ఆ ప్రాంతంలో ఉద్రిక్తతలకు దారితీసింది. ఈ ప్రాంతంలోని తమ మిత్రదేశాలకు సాయం అందించేందుకే తమ యుద్ధ నౌకలు అక్కడ మోహరించినట్లు అమెరికా చెబుతోంది. నల్ల సముద్రంలో పరిస్థితిని గమనించిన రష్యా తన యుద్ధ నౌకను నల్ల సముద్రంలోకి పంపాలని నిర్ణయించింది. నల్ల సముద్రంలో పరిస్థితిని పర్యవేక్షించేందుకు ఈ నౌకలో ఎలక్ట్రానిక్, ఇతర సాంకేతిక పరికరాలను అమర్చినట్లు రష్యా రక్షణ మంత్రిత్వశాఖ ఒక ప్రకటనలో తెలిపింది. అంతర్జాతీయ చట్టాల ప్రకారం అమెరికన్ నౌకలు నల్ల సముద్ర జలాల్లోకి ప్రవేశించినప్పటికీ అక్కడ 21 రోజులకు మించి వుండటానికి వీలు లేదని రష్యా రక్షణ మంత్రిత్వశాఖ తన ప్రకటనలో గుర్తు చేసింది. గత ఏడాది దాదాపు ఆరు అమెరికన్ యుద్ధ నౌకలు ఈ ప్రాంతంలో తమ కార్యకలాపాలు నిర్వహించిన విషయం తెలిసిందే. ఇందులో డెస్ట్రాయర్ తరహా నౌకలు యుఎస్ఎస్ రోస్, యుఎస్ఎస్ కార్నీ, యుఎస్ఎస్ పోర్టర్‌తోపాటు కమాండ్ షిప్ యుఎస్ఎస మౌంట్ విట్నీ, డాక్ లాండింగ్ షిప్ యుఎస్ఎస్ ఓక్‌హిల్, రవాణా నౌక యుఎస్ఎన్ఎస్ కార్సన్ సిటీలు వున్నాయి. గత ఏడాది నవంబర్ 25న కెర్చ్ జలసంధిలో ఉక్రెయిన్ యుద్ధ నౌకలు రష్యన్ సముద్ర జలాల పరిధిని ఉల్లంఘించాయి. అప్పటి నుంచి ఈ ప్రాంతంలో ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. .

కాంగో అధ్యక్షుడుగా ఫెలిక్స్ సిసెకెడి

కిన్షాసా: డెమొక్రాటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో అధ్యక్ష ఎన్నికల్లో ఫెలిక్స్ సిసెకెడిని ఆ దేశ రాజ్యాంగ న్యాయస్థానం విజేతగా ప్రకటించింది. అధ్యక్ష ఎన్నికల్లో అధికార పార్టీ అక్రమాలకు పాల్పడిందంటూ ప్రతిపక్ష నేత మార్టిన్ ఫయులు దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేసిన న్యాయస్థానం త్షిసెకెడి 60 శాతానికి పైగా ఓట్ల మెజార్టీతో గెలుపొందినట్లు తన తీర్పులో స్పష్టం చేసింది. ఈ ఎన్నికల్లో రెండో స్థానంలో నిలిచిన ఫయులు ప్రస్తుత అధ్యక్షుడు జోసెఫ్ కబిలా సిసెకెడి మధ్య మోసపూరితంగా కుదిరిన రహస్య ఒప్పందం ఫలితంగానే ఈ ఫలితాలు వెలువడ్డాయని తన పిటిషన్‌లో ఆరోపించారు. అయితే ఈ వాదనను తిరస్కరించిన న్యాయస్థానం దేశ కొత్త అధ్యక్షుడిగా సిసెకెడి ఎన్నికయినట్లు అధికారికంగా ప్రకటించింది.

మొదటి పేజీ తరువాయి

జల్లికట్టులో విషాదం

అంబులెన్స్‌లో మనప్పరాయ్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే అతను మృతి చెందినట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. దాదాపు 20 మందికి పైగా జల్లికట్టులో గాయపడ్డారు. ఈ జల్లి కట్టు సీజన్‌లో తొలి మృతులు వీరే.

జల్లికట్టును ఒక మెగా కార్యక్రమంగా వరల్డ్ రికార్డ్స్‌లో నమోదు చేయాలని తలచిన నిర్వాహకులు అందుకు తగిన ఏర్పాట్లు చేశారు. దాదాపు 1000 ఎద్దులు, లక్ష మంది పాల్గొనేందుకు తగిన ఏర్పాట్లు చేశారు. విస్తృత స్థాయిలో భద్రతా ఏర్పాట్లు చేశారు. ఈ జల్లికట్టును ఆదివారం ఉదయం 8 గంటలకు ముఖ్యమంత్రి ఎడప్పాడి కె. పళనిస్వామి ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని నమోదు చేసేందుకు వరల్డ్ రికార్డు యూనియన్ నుండి ఒక బృందం కూడా తరలివచ్చింది. ఈ బృందం జల్లికట్టును వీక్షించి వరల్డ్ రికార్డ్స్‌లో నమోదు చేయొచ్చా లేదా అనే విషయాన్ని అంచనా వేస్తుంది.

జల్లికట్టును భారీగా నిర్వహించి రికార్డు నమోదు చేయాలన్న లక్ష్యంతో ఈ జిల్లాకు చెందిన ఆరోగ్యశాఖ మంత్రి సి.విజయ భాస్కర్ ప్రత్యేక ఆసక్తి ప్రదర్శించి ఏర్పాట్లను దగ్గరుండి పర్యవేక్షించారు. జల్లికట్టులో పాల్గొనే వారు జీవిత బీమా చేసుకోవడాన్ని తొలిసారిగా తప్పనిసరి చేశారు. ఈ ఆటలో దాదాపు 500 మంది పాల్గొన్నారు. జల్లికట్టులో ఎన్నికైన వారికి రెండు కార్లు, 10 మోటార్ సైకిళ్ళు, 700 సైకిళ్ళు , బంగారు, వెండి నాణాలు, గృహావసరాలను బహుమతులుగా ఇస్తారు. ఉప ముఖ్యమంత్రి పన్నీర్ సెల్వం, పలువురు మంత్రులు, వివిపిలు ఈ కార్యక్రమాన్ని తిలకించిన వారిలో ఉన్నారు.

170 మంది జలసమాధి

కావడంతో అందులోని ప్రయాణీకులందరూ గల్లంతయ్యారు. శుక్రవారం ప్రమాదానికి గురైన లిబియా పడవలో పది మంది మహిళలు, ఇద్దరు చిన్నారులు (ఒకరు రెండు నెలల చిన్నారి)తో సహా మొత్తం 117 మంది ఉన్నట్లు ఐఓఎం ప్రతినిధి ఫ్లావియో డి గియాకోమో ట్విట్టర్‌లో పోస్ట్ చేసిన ఒక ట్వీట్‌లో పేర్కొన్నారు. పశ్చిమాఫ్రికాకు చెందిన వీరంతా గురువారం లిబియా నుండి బయల్దేరరాని, ఇందులో 40 మంది సూడానీయులు కూడా వున్నారని ఆయన తెలిపారు. దాదాపు పది, పదకొండు గంటల ప్రయాణం అనంతరం పడవ నీట మునగటం ప్రారంభించిందని, అందులోని వ్యక్తులు సముద్రంలో పడి మునిగిపోయారని ఆయన వివరించారు. ఈ పడవ మునిగిపోవటాన్ని గమనించిన ఇటలీ సైనిక విమానం నీటిలోకి రెండు సేఫ్టీ రాఫ్ట్‌ను జార విడిచిందని, అయితే విమానంలో ఇంధన కొరత ఏర్పడటంతో ముందుగానే వెళ్లిపోయిందని ఇటలీ నౌకాదళ ప్రతినిధి ఫాబియో అగస్టినీ చెప్పారు. అనంతరం అక్కడికి చేరుకున్న నౌకాదళ హెలీకాప్టర్ డింగీలోని మగ్గురిని రక్షించిందని వారిని లాంపెడూసాలోని ఆస్పత్రికి తరలించారని ఆయన చెప్పారు.


వలసకూలీలు బతుకు తెరువు కోసం యూరపునకు పడవల్లో తరలి వెళ్తూ మార్గ మధ్యంలోనే ప్రమాదానికి గురై జలసమాధి అవుతుండడం పట్ల ఐక్యరాజ్య సమితి శరణార్థి సంస్థ ఆందోళన వ్యక్తం చేసింది. వలసవాసుల పట్ల నిర్దయగా వ్యవహరిస్తున్న యూరపు దేశాల వైఖరిని అది ఆక్షేపించింది. సముద్రంలో ప్రమాదానికి గురైన వారిని కాపాడేందుకు అన్ని విధాలా ప్రయత్నించాలని కోరింది.

ముంబయి శాస్త్రవేత్త అరుదైన పరిశోధన
ల్యాబ్‌లో 3-4 మిలియన్ల డిగ్రీ సెల్సియస్ ఉష్ణోగ్రత సృష్టి

ముంబయి : నక్షత్రాలపైకి వ్యోమగాముల్ని పంపలేము. నక్షత్రానికి సమీపంగా కనీసం వ్యోమనౌక వెళ్లే పరిస్థితి లేదు. అలాంటప్పుడు నక్షత్రం కేంద్రంలో జరిగే ప్రక్రియలు ఎలా తెలుస్తాయి? అన్న ఆలోచన ముంబయిలోని 'టాటా ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్'(టీఐఎఫ్ఆర్)కు చెందిన భౌతిక శాస్త్రవేత్త రవీంద్రకుమార్‌కు వచ్చింది. దీంతో అరేబియా సముద్రానికి అభిముఖంగా ముంబయిలోని టీఐఎఫ్ఆర్ కేంద్రంలో ప్రపంచంలోనే అత్యంత అరుదైన సైన్స్ ల్యాబ్‌ను నిర్మించారు. అత్యంత తీవ్రమైన ఉష్ణోగ్రతల్లో పదార్థ లక్షణాల్ని అధ్యయనం చేయటం కోసం శాస్త్రవేత్త రవీంద్రకుమార్ ఇక్కడ అహర్నిశలు కృషి చేస్తున్నారు. నక్షత్ర కేంద్రకాల్లో ఉండే 30-40 లక్షల డిగ్రీ సెల్సియస్ ఉష్ణోగ్రతను కృత్రిమంగా సృష్టించారు. ఈ పరిస్థితుల్లో 'పదార్థ లక్షణాల మార్పు'ను అధ్యయనం చేస్తున్నారు. ఈ పరిశోధన ద్వారా కేన్సర్ చికిత్స, అయస్కాంతత్వం నిల్వ, సెక్యూరిటీ స్కానర్స్, కేంద్రక సంలీనం...వంటి అంశాలపై మరింత సమాచారం దొరుకుతుందని శాస్త్రవేత్త రవీంద్రకుమార్ చెబుతున్నారు. ఈ పరిశోధన నిమిత్తం టీఐఎఫ్ఆర్ రూ.15కోట్లు వ్యయం చేసి చాలా అరుదైన ల్యాబ్ పరికరాల్ని విదేశాల నుంచి తెప్పించింది.

ముగ్గురిలో ఒకరు ఎస్సీఎస్టీలే!

- అండర్ ట్రయల్ ఖైదీలు
- ముస్లింలూ పెద్ద సంఖ్యలోనే
- బిసిలకు అత్యధిక మరణశిక్షలు



ప్రజాశక్తి - న్యూఢిల్లీ :

విచారణ సాగుతుండగా గాని, లేక అసలు విచారణ కూడా జరగకుండా (అండర్ ట్రయల్) జైళ్లలో మగ్గుతున్న ప్రతి ముగ్గురిలోనూ ఒకరు ఎస్సీ,ఎస్టీలకు చెందిన వారే! నేషనల్ దళిత్‌మౌవ్‌మెంట్ ఫర్ జస్టిస్, నేషనల్ సెంటర్ ఫర్ దళిత్ హ్యూమన్ రైట్స్ సంస్థలు సంయుక్తంగా నిర్వహించిన ఒక అధ్యయనంలో ఈ విషయం తేలింది. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (ఎన్‌సిఆర్‌బి) గణాంకాల ఆధారంగా ఈ సంస్థలు ఈ విశ్లేషణ చేశాయి. ఈ అధ్యయనం ప్రకారం ఎస్సీ,ఎస్టీల జనాభా నిష్పత్తికన్నా జైళ్లలో మగ్గుతున్న వారి నిష్పత్తి అధికంగా ఉంది. దేశ జనాభలో 24శాతం మంది ఎస్సీ, ఎస్టీలుండగా, జైళ్లలో ఉన్న అండర్ ట్రయల్ ఖైదీలలో వీరు 34 శాతంగా ఉన్నారని ఈ అధ్యయనం తేల్చింది. రాష్ట్రాల వారిగా చూస్తే అస్సాం, తమిళనాడు, మహారాష్ట్ర, రాజస్థాన్‌లలో ఈ పరిస్థితి మరీ ఘోరంగా ఉంది. ఎస్సీ,ఎస్టీల జనాభాతో పోలిస్తే తమిళనాడులో 17శాతం మంది అత్యధికంగా జైళ్లలో ఉన్నారు. ఈ రాష్ట్ర జనాభాలో ఎస్సీ ఎస్టీలు 21శాతం ఉండగా, అండర్ ట్రైల్స్‌గా ఉన్న వారిలో 38శాతం మంది ఎస్సీ,ఎస్టీలు. 2011 జనాభా లెక్కల ప్రకారం దళితులు, ఆదివాసీలు, ముస్లింలు 39శాతం ఉండగా, 2015 నాటి ఎన్‌సిఆర్‌బి విడుదల చేసిన లెక్కల ప్రకారం మొత్తం అండర్ ట్రయల్స్‌లో 55శాతం మంది వీరే ఉన్నారు. ఇప్పటికీ ఈ పరిస్థితిలో మార్పు రాకపోగా మరింత ఎక్కువ సంఖ్యలో జైళ్ల పాలయ్యారు. మరణశిక్షకు గురైన వారిలో అత్యధికులు బిసిలని మరో అధ్యయనం తేల్చింది. నేషనల్ లా యూనివర్శిటీ విడుదల చేసిన 'భారతదేశంలో మరణశిక్షల నివేదిక' ప్రకారం 279 మందికి వివిధ కోర్టులు మరణశిక్ష విధించగా వారిలో 127 మంది (34శాతం) బిసిలు ఉన్నారు. జనరల్ విభాగం కింద 24శాతం మంది ఉండగా, మతపరమైన మైనార్టీలకు 20శాతం మందికి మరణశిక్ష పడింది. గుజరాత్‌లో 19 మందికి మరణశిక్ష పడగా, వారిలో 15 మంది ముస్లింలే!

2016 నాటి వివరాలు ప్రకారం లా యూనివర్శిటీ ఈ గణాంకాలను ఇటీవలే విడుదల చేసింది.

ఇవీ కారణాలు

1. దళితులు, ఆదివాసీలపై వివక్ష, దాడులు కొనసాగుతుండటం
2. ఎస్సీ,ఎస్టీ వేధింపుల నిరోధక చట్టం కింద కేసు నమోదుచేసినప్పటికీ,
   కౌంటర్ కేసులు పెడుతుండటం.
3. పోలీసు అధికారుల నుండి సహాయ నిరాకరణ
4. బెయిల్ తెచ్చుకోనే ఆర్థిక స్తోమత లేకపోవడం
5. చట్టాలపై అవగాహన లేకపోవడం

వైసిపికి రాధా గుడ్‌బై

మొదటి పేజీ తరువాయి

అంటూ రాధాకష్ణ జగన్‌కు రాసిన రాజీనామా లేఖలో పేర్కొన్నారు.

సెంట్రల్ సీటు కోసం తాను గత నాలుగు మాసాలుగా వేచి చూసే ధోరణి అవలంభించినా అధిష్టానం నుండి సానుకూల స్పందన రానందున పార్టీని వీడాలని నిర్ణయించుకున్నట్లు రాధాకృష్ణ చెప్పారు. ఏ పార్టీలో చేరాలన్నది రెండు, మూడు రోజుల్లో స్పష్టమైన ప్రకటన చేస్తానని రాధా ప్రకటించారు. ఇదిలా ఉండగా రాధా రాజీనామాపై వైసిపి నేతలు మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఇస్తామని, గతంలో పోటీ చేసిన తూర్పు నియోజకవర్గం నుండి లేదా మచిలీపట్నం పార్లమెంట్ స్థానానికి పోటీ చేయాల్సిందిగా సూచించినా రాధాకృష్ణ వినలేదని చెప్పారు. రాధా రాజీనామాతో బెజవాడ రాజకీయాలు మరోసారి చర్చనీయాంశంగా మారాయి. అయితే తాను ఏ పార్టీలో చేరుతున్నాననే దానిపై మాత్రం ఆయన సస్పెన్స్ అలాగే కొనసాగించారు. ఆయన టిడిపిలోకిగానీ, జనసేనలోకి గానీ వెళ్తారనే ప్రచారం సాగుతున్నా ఈ రెండు పార్టీల నుంచి ఇప్పటి వరకూ ఆయనకు సానుకూల సంకేతాలు రాలేదు. కొద్దిరోజుల క్రితం వరకూ రాధాను విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ బాధ్యతల నుంచి తప్పించి మల్లాది విష్ణుకు అప్పగించారు. దీనిపై పార్టీ రాష్ట్రస్థాయి సమావేశంలోనే రాధా తన అసంతృప్తి వ్యక్తం చేశారు. పార్టీ నాయకత్వం రాధాకు అన్యాయం చేసేది లేదని, సెంట్రల్ నియోజకవర్గంలో నిర్వహించిన సర్వేలో ఆయనకు ప్రతికూల ఫలితాలు వచ్చాయని, అందుకే మల్లాది విష్ణుకు ఆ సీటును కేటాయిస్తున్నామని చెప్పింది. అయినా ఆయన గత కొన్ని నెలలుగా మరోసారి సెంట్రల్ సీటు కోసం ప్రయత్నాలు సాగించారు. సార్వత్రిక ఎన్నికల సమయం దగ్గరపడడం, పార్టీ అధినేత జగన్ నుంచి హామీ లభించకపోవడంతో ఆయన వైసిపికి రాజీనామా చేశారు.

రాధా వస్తే స్వాగతిస్తాం : ఎంఎల్‌సి బుద్దా వెంకన్న

రాధాకృష్ణ టిడిపిలోకొస్తే స్వాగతిస్తామని ఎమ్మెల్సీ, టిడిపి విజయవాడ అర్బన్ అధ్యక్షుడు బుద్దా వెంకన్న తెలిపారు. విజయవాడలో ఆయన ఆదివారం మీడియాతో మాట్లాడారు.

భారత్‌లో 'అండర్ ఎంప్లాయ్‌మెంట్' సమస్య

- **అత్యధికంగా..ద.కొరియాలో 74.5శాతం**
- **'ఓఈసీడీ' 15 దేశాల్లో అధ్యయనం**



లండన్ : ఉన్నత విద్యార్హతలు, నైపుణ్యాలు ఉన్నప్పటికీ సరైన ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లేకపోవటమనేది 'నిరుద్యోగం'కన్నా ప్రమాదకరమని కొద్ది నెలల క్రితం 'నిటి ఆయోగ్' మోడీ సర్కార్ దృష్టికి తీసుకెళ్లింది. 'అండర్ ఎంప్లామెంట్' అనేది భారత్‌కు పెద్ద సమస్యగా మారిందని 'నిటి ఆయోగ్' డిప్యూటీ ఛైర్మెన్ రాజీవ్‌కుమార్ సైతం ఆందోళన వ్యక్తం చేశారు. భారత్, ఇతర అభివృద్ధి చెందిన దేశాల్లో ఈ సమస్య ఎక్కువగా ఉందని తాజా అధ్యయనం ఒకటి తేల్చింది. 'ఆర్థిక సహకారం, అభివృద్ధి మండలి'(ఓఈసీడీ) లోని 15 దేశాల్లో జరిగిన అధ్యయనంలో 'అండర్ ఎంప్లాయిమెంట్'కు సంబంధించి పలు విషయాలు బయటపడ్డాయి. అవేంటంటే...

ఒకదేశంలో ఉన్నత విద్యార్హతలు, నైపుణ్యాలకు తగిన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేకపోవటం, మరోవైపు విదేశీ నిపుణులు ఎక్కువ సంఖ్యలో ఉండటమన్నది 'అండర్ ఎంప్లాయ్‌మెంట్'కు గట్ట సూచన. ఈ పరిస్థితి 'ఓఈసీడీ' సభ్య దేశాలన్నింటిలోనూ ఉందని అధ్యయనం తేల్చింది. దక్షిణ కొరియాలో అత్యధికంగా 74.5 శాతం మంది విదేశీ ఉద్యోగులకు వారి అర్హతకు తగిన పని, వేతనం లేదని తేలింది. నైపుణ్యానికి, విద్యార్హతలకు తగిన వేతనం లేదన్న భావనతో అనేకమంది తరచూ కంపెనీలను మారుతున్నారు. ఈ సమస్య ద.కొరియాలో 59.6 శాతం దేశీయ ఉద్యోగుల్లో ఉంది.గ్రీస్, స్పెయిన్, ఇటలీ దేశాల్లోనూ 'అండర్ ఎంప్లాయ్‌మెంట్' సమస్య పెద్ద ఎత్తున ఉందని తేలింది. ఉన్నతమైన విద్యార్హతలు, నైపుణ్యాలు కలిగిన ఉద్యోగులకు సరైన ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లేకపోవట మన్నది అనేక సమస్యలకు దారి తీస్తుందని ఆర్థిక విశ్లేషకులు భావిస్తున్నారు.

దళిత రైతు దీక్షపై పెట్రోబాంబ్ దాడి

పాట్నా : బీహార్‌లో అవినీతి అధికారి అండ చూసుకొని ల్యాండ్ మాఫియా రెచ్చిపోయింది. కొన్నేండ్లుగా తాము నివసిస్తున్న భూమిపై తమకు హక్కును కల్పించాలని కోరుతూ నిరాహార దీక్షకు దిగిన దళిత రైతులపై వారు పెట్రో బాంబ్‌తో దాడి చేశారు. ఈ దాడిలో ఇద్దరు మహిళలు తీవ్రంగా గాయపడగా ఒకరి పరిస్థితి విషమంగా మారింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. సీతామర్హి జిల్లాలోని రున్నీసైద్‌పూర్ గ్రామంలో 10.7 ఎకరాల్లో భూమిలేని 316 కుటుంబాలు 2003 నుంచి నివసిస్తున్నాయి. వ్యవసాయమే జీవనాధారంగా బతికే వీరిలో అధికం దళితులే ఉన్నారు.

మహారాష్ట్రలోని ఆగని రైతు ఆత్మహత్యలు

ఒకే రోజు ముగ్గురి బలవ్మరణం

ముంబయి : మహారాష్ట్రలో రుణపాశం అన్నదాతలను బలితీసుకుంటూనే ఉంది. అప్పుల బాధతో రాష్ట్రంలో ఒకే రోజు ముగ్గురు రైతులు బలవన్మరణానికి పాల్పడ్డారు. నాసిక్ జిల్లాలోని మేలాగన్ ప్రాంతంలో ముగ్గురు ఆత్మహత్య చేసుకున్నారు. ఇందులో ఇద్దరు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకోగా, మరొకరు ఉరి వేసుకుని మృతి చెందారు. అయితే వీరంతా అప్పుల బాధ భరించలేకే ఆత్మహత్య చేసుకున్నారని కుటుంబ సభ్యులు, గ్రామస్తులు చెబుతుండగా రెవిన్యూ అధికారులు మాత్రం ఈ మరణాలు ప్రమాదవశాత్తూ జరిగాయని అంటున్నారు.

ఇటీవల కాలంలో రాష్ట్రంలో వివిధ కారణాలతో ఆత్మహత్యలకు పాల్పడుతున్న రైతుల సంఖ్య గణనీయంగా పెరిగింది. అప్పుల బాధ, పంటలు సరిగ్గా పండకపోవడం, మద్దతు ధర లేకపోవడం వంటి కారణాలతో రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. వీరికి ప్రభుత్వం నుంచి ఎలాంటి సహాయం లభించడం లేదు.

ఉల్లి రైతులకు క్వింటాల్‌కు రూ200 ప్రోత్సాహం ఇస్తామని గతంలో మహారాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. నవంబరు 1 నుంచి డిసెంబరు 15 వరకూ పంటను అమ్ముకున్న రైతులకు ఈ ప్రోత్సాహం ఇస్తామని తెలిపింది. అయితే ఇప్పటికీ చాలా మంది రైతులకు ఈ ప్రోత్సాహం లభించలేదు. ఉల్లి ధరల పతనం మహారాష్ట్ర రైతులను భారీగా కుంగదీసింది. పైగా ప్రభుత్వం నుంచి ఎలాంటి మద్దతు లేకపోవడంతో రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. పైన తెలిపిన ముగ్గురు రైతులు ఆత్మహత్యలు చేసుకున్నా.. వారు ప్రమాదశాత్తూ మృతి చెందారని రెవిన్యూ అధికారులు రికార్డుల్లో నమోదు చేయడం రైతు సమస్యలపై ప్రభుత్వ ఉదాసీనతను వెల్లడిస్తుంది.

తెలుగు నుంచి నాని



ఏ సినిమాకైనా దేశమంతా ప్రేక్షకాదరణ లభించాలంటే మంచి కథ ఉండాలి... ఆ కథలో అక్కడ పరిస్థితులను ప్రతిబింబించాలి...ఇవి ఉంటే సరిపోతుందా? అంటే సరిపోతుందో లేదో చెప్పలేం కానీ వీటితో పాటు అక్కడ నటులు ఆ చిత్రం నటిస్తే మాత్రం ఆడియెన్స్‌ను ఆకర్షించొచ్చు. అలా ఉన్న చిత్రాన్ని ఎక్కడ విడుదల చేసినా ప్రేక్షకులను థియేటర్ వరకూ తీసుకురావొచ్చు. అందుకే ఈ మధ్య బాలీవుడ్ అయినా టాలీవుడ్...ఏదైనా అన్ని ప్రాంతాల నటులను తమ సినిమాలో ఉండేటట్టు జాగ్రత్త పడుతున్నారు. ఇప్పుడు ఇదే రీతిలో మణిరత్నం 'పోనియన్ సెల్వన్' అనే సినిమా తీస్తున్నాడు. ఇది అతని కలల ప్రాజెక్టు. మల్టీస్టారర్‌గా రూపొందనుంది. ఈ చిత్రంలో తమిళం నుంచి విజయ్, విక్రమ్, శింబు, బాలీవుడ్ నుంచి అమితాబ్ బచ్చన్, ఐశ్వర్యరాయ్ నటిస్తున్నారు. తెలుగు చిత్రసీమ నుంచి ఈ సినిమాలో నాని నటించాలని కోరారట మణిరత్నం. ప్రస్తుతం 'జెర్సీ' షూటింగ్‌లో బిజీగా ఉన్న నాని ఈ చిత్రంలో చేసేందుకు అంగీకరిస్తాడా? లేదా? అన్నది చూడాలి.

అలా అనీషాను ప్రేమించా



విశాల్, అనీషా

తమిళ కథానాయకుడు విశాల్ నటి అనీషాను వివాహం చేసుకోబోతున్న సంగతి తెలిసిందే. ఈ విషయాన్ని విశాల్, అనీషా సోషల్‌మీడియా వేదికగా ఇటీవల ప్రకటించారు. ఇద్దరూ ప్రేమలో ఉన్నట్లు పేర్కొన్నారు. అనీశా ఎలా పరిచయం అయ్యారనే విషయాన్ని విశాల్ తాజాగా మీడియాతో పంచుకున్నారు.

"అయోగ్య' సినిమా షూటింగ్ కోసం వైజాగ్ వచ్చినప్పుడు అనీషా పరిచయం అయింది. అనీశా స్నేహితులతోపాటు నన్ను కలవడానికి వచ్చింది. అప్పుడే 'మైఖెల్' అనే సినిమాలో అనీషా కథానాయికగా నటిస్తుందని కూడా చెప్పింది. ఇది వ్యవసాయం నేపథ్యంలో సాగే సినిమా అని, యూనిట్‌కు చెందిన వారు వ్యవసాయదారులని చెప్పడంతో చిత్రాన్ని విడుదల చేస్తానని అప్పుడు అన్నా. అలా కొన్నిసార్లు అనీషాను కలుసుకున్న తరుణంలో ఆమెపై ప్రేమ పుట్టింది. కొన్ని రోజులు గడిచాక నా ప్రేమను ఆమె వద్ద వ్యక్తం చేశాను. దానికి అనీషా కొంత సమయం తీసుకుంది. తర్వాత నా ప్రేమను అంగీకరించింది. అనీషా కేవలం నటిగానే కాకుండా బాస్కెట్‌బాల్ క్రీడాకారిణిగా, సామాజిక కార్యకర్తగా గుర్తింపు పొందింది' అని విశాల్ చెప్పారు.



ఆత్మ విమర్శ చేసుకోవాలంటే దమ్ముండాలి

– ఎన్టీఆర్

ఓ నటుడికి ముఖ్యంగా కావాల్సిన ఆత్మ విమర్శ అఖిల్‌లో ఉన్నట్లు ఎవరికీ ఉండదు. ఆత్మ విమర్శ చేసుకోవాలంటే దమ్ముండాలి. ఎన్నిసార్లు తనని తాను ఆత్మ విమర్శ చేసుకుంటూ, తనని తాను మార్చుకుంటూ, తన పంథాని తాను మార్చుకుంటూ ఈ మజిలీకి చేరాడు. 'అఖిల్ విల్ బి ఫైనెస్ట్ ఆర్టిస్ట్' అని అందరూ అనుకునేంత గొప్పనటుడు అవుతాడని నేను చెబుతున్నాను. మీరు రాసి పెట్టుకోండి. నేను స్టార్ డమ్ గురించి మాట్లాడటం లేదు. నేను కూడా మీ అందరితో పాటు ఆరోజు కోసం వెయిట్ చేస్తుంటాను. ఆరోజు ఎంతో దూరంలో లేదు. దగ్గర్లోనే ఉంది. అది మిస్టర్ మజ్ను అనే చిత్రంతో తెలుస్తుంది" అని ఎన్టీఆర్ అన్నారు.

అఖిల్ అక్కినేని హీరోగా శ్రీవెంకటేశ్వర సినీ చిత్ర ఎల్‌ఎల్‌పి పతాకంపై రూపొందిన చిత్రం 'మిస్టర్ మజ్ను'. వెంకీ అట్లూరి దర్శకత్వంలో బి.వి.ఎస్.ఎన్.ప్రసాద్ నిర్మించారు. ఈనెల 25న విడుదల కానున్న ఈ సినిమా ప్రీ రిలీజ్ వేడుక శనివారం రాత్రి నిర్వహించారు. ఎన్టీఆర్ ముఖ్య అతిథిగా హాజరై ట్రైలర్‌ను విడుదల చేశారు. తొలి టికెట్‌ను నాగార్జున చేతుల మీదుగా ఎన్టీఆర్ కొనుగోలు చేశారు.

నాగార్జున మాట్లాడుతూ 'మా పెద్ద పెద్దబ్బాయి తారక్. అతను నన్ను ఎంతో ఆప్యాయంగా బాబాయ్ అని పిలుస్తుంటాడు. అలా అన్నప్పుడల్లా సంతోషంగా అనిపిస్తుంది. తారక్ నుండి యాక్టింగ్, మాస్‌ను అఖిల్ నేర్చుకోవాలి. తమన్ తాతగారు ఘంటసాల బలరామయ్యగారు ఎక్కడో నాన్నగారిని రైల్వేస్టేషన్‌లో చూసి ఆర్టిస్టుగా పనికొస్తావని చెన్నైకు తీసుకెళ్లారు. తమన్ ఈ సినిమాకు పని చేయడం చూస్తుంటే ఓ సర్కిల్ పూర్తయినట్లుగా ఉంది. వెంకీ అట్లూరి, మా సినిమాలను చూసి ఇన్‌స్పైర్ అయ్యి ఇక్కడకు వచ్చాడని తెలిసింది. తొలిప్రేమ చూశాను. లవ్‌స్టోరీకి ఏ అంశాలు కావాలో వెంకీ బాగా తెలుసు. నవ్వించడం, ఏడిపించడం, ప్రేమించడం వెంకీకి తెలుసు' అని తెలిపారు.

ఎన్టీఆర్ మాట్లాడుతూ ' ఓ మంచి సినిమా తీయాలంటే నిర్మాతకు వ్యామోహం ఉంటే సరిపోదు. వ్యాపారం కూడా తెలిసి ఉండాలి. వ్యాపారం తెలిస్తే, ఓ సినిమాకు ఎంత ఖర్చు పెట్టాలి?. దాన్ని ఎలా మార్కెట్ చేయాలి? అది హిట్ అయిన తర్వాత మనం కూడా ఎలా డబ్బులు సంపాదించుకోవాలి? అనేది తెలుస్తుంది. వ్యామోహం ఉన్నప్పుడు ఈ సినిమాను ఎంత అద్భుతంగా తెరకెక్కించాలి. ప్రేక్షక దేవుళ్లకు అందించాలనేది తెలుస్తాయి. కాబట్టి నిర్మాతకు వ్యామోహం, వ్యాపారం రెండు తెలియాలి. నేను ఈ బ్యానర్‌లో ఊసరవెళ్లి, నాన్నకు ప్రేమతో అనే రెండు సినిమాలు చేశాను. ప్రసాద్‌గారిని దగ్గరగా గమనించాను. ఆయనకు వ్యాపారం తెలియదు. సినిమా అంటే ఆయనకు వ్యామోహం. అదే ఆయనలో గొప్ప లక్షణం. సంపాదించిన ప్రతి రూపాయిని తిరిగి చలనచిత్ర సీమకే అందించే గొప్ప నిర్మాత. అలాంటి నిర్మాత పది కాలాల పాటు సుఖంగా ఉండాలి. నేను ఇండస్ట్రీకి వచ్చిన కొత్తల్లో చాలా తక్కువ మంది ఫ్రెండ్స్ ఉండేవాళ్లు. వాళ్లతో వెంకీ ఒకడు. తను నాకొక నటుడిగా పరిచయం. తర్వాత రచయితగా పరిచయం. తర్వాత దర్శకుడిగా పరిచయమైయ్యాడు. సుదీర్ఘమైన తెలుగు ఇండస్ట్రీలో ఎన్నో ప్రేమకథలు వచ్చాయి. ఎందరో ఎన్నో ప్రేమకథలు రాశారు... నటించారు. మళ్లీ ప్రేమకథ అంటున్నాడు. తొలిప్రేమ అనే టైటిల్‌ను పెట్టుకున్నాడు. కొత్తగా ఏం చూపిస్తాడనే బెరుకు ఉండేది. ఆ చిత్రం చూసిన తర్వాత తనను చూసి గర్వపడ్డాను. ఆషామాషీ విషయం కాదు. ఐదు ఫైట్స్ , నాలుగు డ్యాన్సులు పెట్టి కమర్షియల్ సినిమా చేయడం కంటే కేవలం కథా బలంతో, నటీనటుల బలంతో ఓ కథను తెరకెక్కించడం చాలా కష్టమైన పని. తొలి చిత్రంతో తను సాధించాడు. తను ఇక వెనుదిరిగి చూసుకోవాల్సిన పనిలేదు" అని అన్నారు.



అల్లు అర్జున్



రవి తేజ



రామ్



శర్వానంద్

రంగుల లోకంలో ఎవరి స్థానం ఎప్పుడు ఎలా ఉంటుందో చెప్పలేం. ఒకప్పుడు అగ్రహీరోలుగా రాణించిన వారు ఇప్పుడు కథలు లేక ఖాళీగా ఉండొచ్చు. మరొకరికి ఒక్క రోజులోనే స్టార్‌డమ్ వచ్చేయొచ్చు. ప్రస్తుతం తెలుగు చిత్రసీమ వీటికి అద్దం పడుతోంది. ఇంతకు ముందు ఎవరి చిత్రాలైతే వరుసగా విజయాలు సాధించాయో ఇప్పుడు వాళ్లే ఓ హిట్ కోసం ఎదురు చూస్తున్నారు. ఈసారి చేసేది విజయాన్ని చేకూరుస్తుందని ఆశించినా బాక్సాఫీస్ వద్ద మాత్రం నిరాశ తప్పడం లేదు. కొందరికి వరుసగా నాలుగైదు చిత్రాలు కూడా పరాజయం పాలై హిట్టుకోసం ఎదురు చూసే పరిస్థితి. ఈ జాబితాలో అగ్రహీరోలు నుంచి కొత్త కథానాయకుల వరకూ అందరూ ఉన్నారు.

ఒక్క హిట్ ప్లీజ్..!

ప్రేక్షకులు ఆలోచనా విధానం మారింది. ఒకప్పటిలా కాదు. ఇప్పుడంతా కథ, కథనాలు బాగున్నాయా? అయితే ఒకే హీరో, డైరెక్టర్‌తో పని లేదు. వెళ్లి చూసొద్దాం రండి..అని అంటున్నారు. అందుకే చిన్న చిత్రాలే పెద్ద విజయాలు సాధిస్తున్నాయి. భారీగా పెట్టుబడి పెట్టినవి కూడా బాక్సాఫీస్ వద్ద బోల్తా కొడుతున్నాయి. అందులోనూ కథలో కొత్తదనం ఉండాలి. అది ప్రేక్షకులదై ఉండాలి. తెరపై ఆడే పాత్ర ఆడియెన్స్‌లో ఒక్కడిదైతే హిట్టే. అలా ఉన్న కథలే కాసులు కురిపిస్తున్నాయి. వినూత్నంగా లేకపోతే మెగా హీరో అయినా, అగ్ర నటుడైనా చెక్ పెడుతున్నారు. సామాజిక మాధ్యమాలు అంతగా లేకముందు సినిమాల రివ్యూలు, వాటిపై అభిప్రాయాలు పెద్దగా ప్రచారంలోకి వచ్చేవి కాదు. ఇప్పుడలా కాదు. మొదటి షో సగంలోనే హిట్టా? ఫట్టా అని చెప్పేస్తున్నారు. విభిన్నమైన నేపథ్యాలు ఉన్న కథలను ఎంపిక చేసుకోవడంలో కథానాయకులు విఫలం కావడం వల్ల వారి చిత్రాలు విజయం సాధించడం లేదు. అందులో ముందు వరుసలో రవితేజ ఉన్నారు. రెండేళ్లుగా ఆయన చేస్తున్న సినిమాలన్నీ నిరాశ పరిచాయి. టచ్ చేసి చూడు, రాజా ది గ్రేట్, నేల టికెట్, అమర్ అక్బర్ అంటోని వంటి చిత్రాలు అనుకున్నంతలా ఆడలేదు. ఇందులో రాజా ది గ్రేట్ మాత్రం పర్వాలేదనిపించింది. ఇప్పుడు ఇతను కొత్త దర్శకుడితో చేసేందుకు ఆసక్తిగా ఉన్నాడు. కథ వినూత్నంగా ప్రస్తుత ట్రెండ్‌కు తగ్గట్టు ఉంటే ఏ దర్శకుడితోనైనా చేసేందుకు సిద్ధంగా ఉన్నాడు.

అల్లు అర్జున్‌కు 'సరైనోడు' తర్వాత మంచి కథే దొరకడం లేదు. ఆ సినిమా చేశాక చాలా కథలు విన్నాడు కానీ అవేవీ అతన్ని మెప్పించలేకపోయాయి. ముందు బన్నికి నచ్చితే కదా ప్రేక్షకులను కన్వేచేయగలరు. 'దువ్వాడ జగన్నాథమ్', 'నా పేరు సూర్య నా ఇల్లు ఇండియా' ఈ రెండు సినిమాలూ విభిన్నమైన కథలే కానీ కథనంలో కొత్తగా లేదు. 'నా పేరు సూర్య నా ఇల్లు ఇండియా' కథను కొత్త దర్శకుడు వక్కంతం వంశీ చేశాడు. దేశభక్తి నేపథ్యంలో మంచి కాన్సెప్ట్‌నే తీసుకున్నా కథనంలో గందరగోళం వల్ల నష్టం వచ్చింది. బన్ని ఎంత ఆశపడి ఈ సినిమా చేసినా ఆశించిన ఫలితం రాలేదు. సినిమాలో సూర్య పాత్రకు ఎంత కోపం ఉంటుందో ఆ కోపాన్ని ఈ చిత్రంపై రివ్యూలు ఇచ్చిన సినీ విమర్శకులపైనా చూపాడు. ఈ చిత్రం తర్వాత మళ్లీ చాలా కథలు విన్నాడు. మరోసారి త్రివిక్రమ్ దర్శకత్వంలో నటించేందుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చాడు. త్వరలోనే ఈ చిత్రం సెట్స్‌పైకి వెళ్లనుంది.

కథలు ఎంపిక చేసుకోవడం లోపముందో, ప్రేక్షకులు అర్థం చేసుకోలేకపోతున్నారో అని హీరో నితిన్ ఓ ఇంటర్వ్యూలో వాపోయాడు. ఎందుకంటే అతను ప్రాణం పెట్టి చేసిన చిత్రాలన్నీ బోల్తా కొడుతున్నాయి. ఇటీవల ఎంతో ఇష్టపడి చేసిన 'శ్రీనివాస కల్యాణం' ఛేదు అనుభవం మిగిల్చింది. ఇదే కాదు 2016 'అ..ఆ' వచ్చాక మరే చిత్రమూ విజయం సాధించలేదు. ఈ సినిమా తర్వాత డిఫరెంట్ లుక్స్‌లో కనిపించాడు. విభిన్నంగా ఉంటాయనుకొని 'లై', 'ఛల్ మోహన్‌రంగా', 'శ్రీనివాస కల్యాణం' వంటివి చేశాడు. ఇవేవీ కమర్షియల్‌గా సక్సెస్ కాక ఇప్పుడు కొత్త చిత్రం 'భీష్మ'లో చేస్తున్నాడు. ఇందులో రష్మిక మడన్నా కథానాయికగా చేస్తోంది. రాధాకృష్ణ నిర్మిస్తున్నారు. వెంకీ కుడుమల దర్శకత్వం వహించనున్నాడు. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనుల్లో ఉంది. ఈ సినిమాతో పాటు 'కుమారి 21ఎఫ్' దర్శకుడితో మరో చిత్రం చేసేందుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చాడు. బన్నీ వాసు దీన్ని నిర్మించనున్నాడు. మార్చిలోగానీ, ఏప్రిల్‌గానీ రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుంది.

హీరో రామ్‌కి వీరందరి కంటే అత్యధికంగా పరాజయాలు ఎదురవుతున్నాయి. ఈయన సినిమా కొత్తగానే ఉంటాయి. ఆయన వేషధారణ కూడా ట్రెండ్‌కు దగ్గట్టే ఉంటుంది. కానీ ఎక్కడో ప్రేక్షకుడి కోణాన్ని టచ్ చేయకపోవడం వల్ల అంతగా అతని చిత్రాలు విజయం సాధించలేకపోతున్నాయి. 'నేను శైలజ' విజయం తర్వాత ఆ స్థాయిలో సక్సెస్ మళ్లీ అతని చిత్రాలకు రాలేదు. ఆ సినిమా తర్వాత వచ్చిన హైపర్, ఉన్నది ఒకటే జిందగీ, హలో గురు ప్రేమ కోసమే చిత్రాలేవీ ఆశించిన విజయాన్ని అందించలేకపోయాయి. ఈసారి పూరీ జగన్నాథ్‌తో ఓ సినిమా చేస్తున్నాడు. ఇది ఎలా ఉంటుందో చూడాలి.

సాయి ధరమ్ తేజ్‌లో మంచి నటుడు ఉన్నాడు కానీ కథల ఎంపికలో మాత్రం జాగ్రత్తలు తీసుకోవడం లేదని అతని సినిమాలే స్పష్టం చేస్తున్నాయి. తేజూ చేసిన చిత్రాల్లో 'సుప్రీమ్' అంతటి విజయం మరొకటి ఇవ్వలేదు. ఆ చిత్రం చేసిన తర్వాత మరేచిత్రమూ బాక్సాఫీస్ వద్ద కాసులు కురిపించలేదు. కనీసం పెట్టిన పెట్టుబడి కూడా రానిపరిస్థితులు ఉన్నాయి. అందులో తిక్క, విన్నర్, జవాన్, ఇంటిలిజెంట్, తేజ్ ఐ లవ్ యూ ఈ సినిమా అన్నీ నిరాశ పరిచినవే. అందుకే ఈ సారి కథల ఎంపికలో చాలా జాగ్రత్తలు తీసుకుంటున్నాడు. కొత్త దర్శకుడితో చేయాలనే ఆలోచనలో ఉన్నాడు.


శర్వానంద్ జీవితంలో ఓ గొప్ప చిత్రంగా 'శతమానం భవతి' నిలిచిపోతుంది. ఇలాంటి హిట్ కోసం శర్వా మళ్లీ ఎదురు చూస్తున్నాడు. కొత్తగా ఉంటుందని 'రాధా', మహానుభావుడు, పడి పడి లేచే మనసు వంటి చిత్రాలు చేశాడు. కానీ ఇందులో మహానుభావుడు కాస్త బిజినెస్ అయినట్టు ఉంది. తాజాగా విడుదలైన 'పడి పడి లేచే మనసు' కూడా ఆకట్టుకోలేకపోయింది. కొత్తగా సుధీర్ వర్మ కాంబినేషన్‌లో ఓ చిత్రం చేస్తున్నాడు. ఇది కాకుండా దిల్ రాజ్ నిర్మాత తమిళంలో విజయం సాధించిన '96' రీమేక్‌లో ఈయనే విజయ్ సేతుపతి పాత్రను పోషించబోతున్నాడు. ఇందులో సమంత కథానాయికగా చేయనుంది.

అగ్రహీరోల్లో నాగార్జున పరిస్థితి కూడా అంతే. ఆయన చేస్తున్న సినిమాల్లో తాజాదనం లేకపోవడంతో ప్రేక్షకాదరణ లభించడం లేదు. సోగ్గాడే చిన్నినాయనా తర్వాత చేసిన చిత్రాలేవీ మెప్పించలేకపోయాయి. భక్తి చిత్రం 'ఓం నమో వెంకటేశాయ', హారర్ చిత్రం 'రాజుగారి గది 2', చాలా కాలం తర్వాత రామ్ గోపాల్ వర్మ దర్శకత్వంలో చేసిన 'ఆఫీసర్' వైఫల్యం చెందాయి. ఈ చిత్రానికి ముందు మల్టీస్టార్ 'దేవదాసు' చేశాడు. అదీ అంతే. ఇద్దరు పెద్ద హీరోలు ఉన్నా ప్రేక్షకులు థియేటర్లకు రాలేదు. ఇప్పుడు నూతన దర్శకుడు ఒకరు చెప్పిన కథకు ఈయన ఫిదా అయ్యాడట. ఆ వివరాలైతే ఇంకా బయటకు చెప్పలేదు కానీ ఆ చిత్రం త్వరలో పట్టాలెక్కబోతుంది.

ఇక ఈయన కొడుకులు నాగచైతన్య, అఖిల్ చిత్రాలూ అంతే. అఖిల్ ఇప్పటి వరకూ చేసిన రెండు చిత్రాలూ ఆశించనట్టుగా ఫలితాలు లేవు. ఈనెల 25న ఆయన హీరోగా చేసిన 'మిస్టర్ మజ్ను' రాబోతుంది. ఇందులో పాటలు కొత్తగానే ఉన్నాయి. ఈ సినిమా విజయం కోసం అతను ఎదురు చూస్తున్నాడు. 'ప్రేమమ్' తర్వాత నాగచైతన్యకు ఒక హిట్టూ లేదు. 2016 నుంచి ఇప్పటి వరకూ ఐదు చిత్రాలు చేశాడు. అందులో భారీ అంచనాలతో వచ్చిన 'శైలజా రెడ్డి అల్లుడు', 'సవ్యసాచి' కూడా ఛేదు అనుభవాన్ని మిగిల్చాయి. ఈయన హీరోగా శివ నిర్వాణ దర్శకత్వంలో 'మజిలి' రూపొందుతోంది. క్రికెట్ నేపథ్యంలో తెరకెక్కుతోంది. తర్వాత వెంకటేశ్‌తో కలసి మల్టీస్టారర్ 'వెంకీ మామ'లో నటించబోతున్నాడు.



సాయి ధరమ్ తేజ్



నాగార్జున



నితిన్

'మణికర్ణిక' నిర్మాతకు అనారోగ్యం

కంగనా రనౌత్ టైటిల్ రోల్ పోషించిన 'మణికర్ణిక' నిర్మాతల్లో ఒకరైన కమల్ జైన్ అనారోగ్యానికి గురయ్యారు. ఊపిరితిత్తులకు ఇన్‌ఫెక్షన్ కావడంతో ఆస్పత్రిలో చేరారు. ముందుగా కమల్‌జైన్ ఆకస్మాత్తుగా పక్షవాతానికి గురయ్యారని ప్రచారం జరిగింది. ఇది వాస్తవం కాదని చిత్రబృందం పేర్కొంది. జైన్‌కి మొదట గొంతు నొప్పి మొదలైంది. 'మణికర్ణిక' సినిమా ప్రమోషన్ పనుల్లో బిజీగా ఉండడం వల్ల గొంతు నొప్పిపై దృష్టి పెట్టలేకపోయారు. దీంతో ఆ ఇన్‌ఫెక్షన్ ఊపిరితిత్తుల వరకూ వ్యాపించి శ్వాస తీసుకోవడానికి కష్టతరంగా మారింది. దీని చికిత్స నిమిత్తం జైన్ ఆస్పత్రిలో చేరారు. మూడు నాలుగు రోజుల్లో డిశ్చార్జ్ కానున్నారు. ఈ సందర్భంగా జైన్ ట్వీట్ చేస్తూ ' ఇది ఆస్పత్రిలో ఉండే సమయం కాదు. చేసిన పనికి ఫలితం దక్కుబోతున్న తరుణంలో ఇక్కడ ఉండడం అంతకన్నా మంచిది కాదు. ప్రమోషన్లలో బిజిగా ఉన్న 'మణికర్ణిక' చిత్రం టీమ్‌ను మిస్సవుతున్నా. ప్రమోషన్ బాధ్యతలు మీరే చూడండి" అని పేర్కొన్నారు.



కంగనా, జైన్

ఫిబ్రవరి 22న 'ప్రేమకథా చిత్రమ్ 2'

హారర్ చిత్రంగా రూపొందిన 'ప్రేమకథా చిత్రమ్' మంచి విజయాన్ని నమోదు చేసుకుంది. ఇప్పుడు దానికి సీక్వెల్‌గా 'ప్రేమకథా చిత్రమ్ 2' రాబోతుంది. ఆర్.పి.ఎ క్రియేషన్స్ బ్యానర్‌లో హరి కిషన్ దర్శకత్వంలో తెరకెక్కుతోంది. సుమంత్ అశ్విన్, సిద్ధి ఇద్నాని జంటగా నటిస్తున్నారు. శాటిలైట్, హిందీ డబ్బింగ్ రైట్స్ ద్వారా కోటి 43 లక్షలు దక్కించుకోవడం విశేషం. నందిత శ్వేత మెయిన్ హీరోయిన్‌గా నటిస్తోంది. సూపర్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా మొదటి పార్ట్‌కి ధీటుగా వస్తున్న ఈ చిత్రానికి నందిత శ్వేతా నటన మరో ప్లస్ అవుతుందని దర్శకుడు భావిస్తున్నాడు. ఆర్. సుదర్శన్ రెడ్డి నిర్మాత. ఈ చిత్రం రావు రమేష్ వాయిస్ ఓవర్‌తో నడుస్తుంది. చిత్రీకరణ పూర్తయింది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఫిబ్రవరి 22న ఈ చిత్రాన్ని విడుదల చేయడానికి నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు.



నందిత శ్వేత, సుమంత్ అశ్విన్

అప్పులబాధతో రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి–తాడిపత్రి టౌన్

అప్పుల బాధతాళలేక రైతు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన అనంతపురం జిల్లా తాడిపత్రిలో ఆదివారం జరిగింది. మృతుని కుటుంబ సభ్యుల కథనం ప్రకారం... తాడిపత్రి మండలం ఎర్రగుంటపల్లి గ్రామానికి చెందిన రైతు జనార్ధన్ రెడ్డి(43) తనకున్న నాలుగెకరాల్లో కరివేపాకు, వేరుశనగ సాగు చేసి జీవనం సాగించేవాడు. ఈ ఏడు కరివేపాకు సాగుకు తన భూమిలో మూడు బోర్లు వరకు వేశాడు. బోర్లు వేసేందుకు గ్రామంలోని కొందరి వద్ద రూ.3 లక్షలు, బ్యాంకులో రూ.లక్ష అప్పు చేశాడు. వర్షాభావంతో ఉన్న కొద్దిపాటి బోర్లలో నీరు తగ్గిపోయాయి. దీంతో పంట చేతికి రాక అప్పుల పాలయ్యాడు. తీసుకున్న డబ్బు చెల్లించాలని అప్పులవారు ఒత్తిడి తెచ్చారు. దీంతో జీవితంపై విరక్తి చెందిన జనార్ధన్‌రెడ్డి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చివరిగా తన బావమరిదికి ఫోన్ ద్వారా సమాచారం అందించాడు. వెంటనే బంధువులు జనార్ధన్ రెడ్డిని చికిత్స కోసం తాడిపత్రి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమం కావడంతో అతను మృతి చెందాడు. మృతునికి భార్య, కుమార్తె, కూమారుడు ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఫ్లెమింగో ఫెస్టివల్

శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా సూళ్లూరుపేటలో నిర్వహిస్తున్న ఫ్లెమింగో ఫెస్టివల్‌లో సాంస్కృతిక ప్రదర్శనలు



అట్టహాసంగా ఫ్లెమింగో ఫెస్టివల్

ప్రజాశక్తి–సూళ్లూరుపేట

శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా సూళ్లూరుపేట మండలంలో మూడ్రోజులు జరిగే ఫ్లెమింగో ఫెస్టివల్‌ను మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆదివారం ప్రారంభించారు. జ్యోతి ప్రజ్వలన చేసి బెలూన్స్‌ను వదిలారు. వేదిక ఆవరణలో ఏర్పాటు చేసిన వివిధ శాఖల స్టాల్స్‌ను పరిశీలించారు. సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించిన చిన్నారులను అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విదేశాల నుంచి వేల కిలోమీటర్లు ప్రయాణం చేసి నేలపట్టు ప్రాంతంలో పక్షులు విడిది చేసి సంతానోత్పత్తి తర్వాత వెళ్లడం ఆశ్చర్యకర విషయమన్నారు. ప్రతేడాది ఫ్లెమింగో ఫెస్టివల్‌కు రాష్ట్ర ప్రభుత్వం రూ.3కోట్లు విడుదల చేసిందని ఇది అట్టహాసంగా జరుగుతుందని తెలిపారు. నేడు పక్షుల పండుగ జరుగుతోందని, ఫిబ్రవరి మొదటి వారంలో పేదల పండుగ జరగనుందని తెలిపారు. పేదల కోసం చంద్రబాబు నాయుడు అనేక నిర్ణయాలు తీసుకున్నారని వృద్ధులకు ఎన్‌టిఆర్ భరోస కింద ఫించన్ల రెట్టింపు చేశామన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టరు వెట్రిసెల్వీ, జాయింట్ కలెక్టర్2 కమలకుమారి, నాయుడుపేట ఆర్‌డిఒ శ్రీదేవి, తెలుగుదేశం నాయకులు, మాజీ మంత్రి పరసారత్నం, జెడ్‌పి ఫ్లోర్ లీడర్ వేనాటి రామచంద్రారెడ్డి, మాజీ ఎంపి నెలవల సుబ్రమణ్యం, కామిరెడ్డి రాజారెడ్డి, ముప్పాళ్ల వెంకటేశ్వర రెడ్డి, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

ఆదర్శ కమ్యూనిస్టు నరసింహయ్య

- కొనియాడిన బివి.రాఘవులు
- అంతిమ యాత్రలో అశేష జనవాహిని



నరసింహయ్య చితికి నిప్పంటిస్తున్న చంద్రం, రవి, హరీంద్రశర్మ, రాఘవులు

ప్రజాశక్తి – కర్నూలు ప్రతినిధి

ఎన్ని ఒడుదొడుకులొచ్చినా.. ఆత్మవిశ్వాసంతో, నిబ్బరంగా కమ్యూనిస్టు ఉద్యమాన్ని నిర్మించిన టి.నరసింహయ్య తుది శ్వాస దాకా సమాజం కోసం పరితపించారని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి.రాఘవులు పేర్కొన్నారు. శుక్రవారం తుదిశ్వాస విడిచిన నరసింహయ్య అంతిమయాత్ర ఆదివారం కర్నూలులో భారీ జనసందోహం మధ్య సాగింది. ముందుగా స్థానిక సుందరయ్య భవన్ నుంచి ఈద్గా, శ్రీరామ టాకీస్, రాజ్‌విహార్, పెద్ద పార్కు, వన్‌టౌన్ మీదుగా పాతబస్తీలోని జమ్మిచెట్టు శ్మశాన వాటిక వరకూ అంతిమయాత్ర సాగింది. కర్నూలు జిల్లాతో పాటు అనంతపురం, మహబూబ్‌నగర్, హైదరాబాదు, విజయవాడ తదితర ప్రాంతాల నుంచి పార్టీ శ్రేణులు, శ్రేయోభిలాషులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం జమ్మిచెట్టు వద్ద హిందూ శ్మశానవాటికలో నరసింహయ్య అంత్యక్రియలు నిర్వహించారు. అంతకుముందు సుందరయ్య భవన్‌లో పలువురు నివాళు లర్పించారు.

సిపిఎం జిల్లా కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సంతాప సభలో రాఘవులు మాట్లాడుతూ నరసింహయ్య జీవితాంతం ప్రజల కోసం పాటుపడ్డారని తెలిపారు. ఆయన అర్ధశాస్త్ర బోధన ఎంతో మందిని ప్రజా ఉద్యమంలోకి తీసుకొచ్చిందని, ఉన్నతమైన న్యాయకత్వాన్ని తయారు చేసిందని చెప్పారు. ఓ వైపు కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణంలో చురుకుగా ఉంటూనే... కుటుంబాన్ని ఏ మాత్రమూ నిర్లక్ష్యం చేయలేదని తెలిపారు. కుటుంబం కూడా కమ్యూనిస్టు ఉద్యమంలో మమేకమయ్యేలా చేసి ఆదర్శంగా తీర్చిదిద్దారన్నారు. ఆయన ఆశయ సాధన కోసం ప్రతి నాయకుడూ, కార్యకర్తా కృషి చేయాలని పిలుపునిచ్చారు. సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ నరసింహయ్య నిరంతరం ప్రజల సమస్యలను ఆలోచించే వ్యక్తి అని అన్నారు. కమ్యూనిస్టు పార్టీలో రెండు పర్యాయాలు చీలికవచ్చి నాయకత్వ లోపం ఉన్న రోజుల్లో ఒంటరిగా ఉద్యమాన్ని నిర్మించి, అగ్ర పార్టీల సరసన నిలిపారని కొనియాడారు. మరో కేంద్ర కమిటీ సభ్యులు ఎంఎ.గఫూర్ మాట్లాడుతూ... ఆదర్శ కమ్యూనిస్టు, మానవతా వాది, అందరూ గౌరవించే నిరాడంబరుడు నరసింహయ్య అని, ఆయనలో ఎప్పుడూ నిరాశ చూడలేదని తెలిపారు. నిస్వార్థం, ప్రేమ, అనురాగం పంచిన ఆదర్శ దంపతులుగా నరసింహయ్య, లక్ష్మమ్మ పార్టీకు కేరాఫ్‌గా నిలిచారని తెలిపారు. పెద్ద దిక్కును కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు.

సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎస్.వీరయ్య మాట్లాడుతూ... నరసింహయ్య రాష్ట్రవ్యాప్తంగా సాగునీటి ప్రాజెక్టులు, గిట్టుబాటు ధరల కోసం ఎన్నో పోరాటాలు నిర్మించారని చెప్పారు. సిపిఐ రాష్ట్ర నాయకులు టి.రామచంద్రయ్య, ఎస్‌యుసిఐ నాయకులు నాగన్న మాట్లాడుతూ... నరసింహయ్య తమలాంటి వారికి కుటుంబ పెద్దగా వెన్నుతట్టి ప్రోత్సహించేవారన్నారు. ఆయన మృతి వామపక్ష ఉద్యమానికి తీరని లోటని చెప్పారు. టిడిపి సీనియర్ నాయకులు, మాజీ మంత్రి ఏరాసు ప్రతాపరెడ్డి మాట్లాడుతూ సుదీర్ఘ కాలం జిల్లాలో కమ్యూనిస్టు ఉద్యమంలో నరసింహయ్య పని చేశారన్నారు. తన తండ్రి అయ్యపురెడ్డి కర్నూలు పార్లమెంటు నియోజకవర్గం నుంచి ఎంపీగా గెలుపొందేందుకు అహర్నిశలూ కృషి చేశారని గుర్తు చేసుకున్నారు. బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు కపిలేశ్వరయ్య మాట్లాడుతూ నరసింహయ్య నమ్మిన సిద్ధాంతం కోసం నిబద్ధతతో చివరి వరకూ పని చేశారన్నారు. సిపిఎం తెలంగాణ నాయకులు సారంపల్లి మల్లారెడ్డి, బి.వెంకట్, బాబురావు, రాయలసీమ సబ్ కమిటీ సభ్యులు జి.ఓబులు మాట్లాడారు. ప్రముఖ గేయ రచయిత, గాయకులు గోరేటి వెంకన్న, కోడుమూరు, నందికొట్కూరు శాసనసభ్యులు మణిగాంధీ, ఐజయ్య, వైసిపి రాష్ట్ర కార్యదర్శి తెర్నేకల్లు సురేందర్‌రెడ్డి, కర్నూలు ఎమ్మెల్యే ఎస్వీ.మోహన్‌రెడ్డి సతీమణి విజయ మనోహరి, కర్నూలు మార్కెట్‌యార్డు ఛైర్మన్ పెరుగు పురుషోత్తంరెడ్డి, చెరుకుచెర్ల రఘురామయ్య నరసింహయ్యకు నివాళులర్పించారు.

ముగిసిన బెలూన్ ఫెస్టివల్

- చివరిరోజు స్పందన అంతంత మాత్రమే
- లోపలకు రానివ్వకపోవడంతో పాత్రికేయుల ఆందోళన



బెలూన్ ఎక్కిన కిడారి సర్వేశ్వరరావు భార్య పరమేశ్వరి

ప్రజాశక్తి– అరకులోయ, అరకు రూరల్ (విశాఖపట్నం)

విశాఖ జిల్లా ప్రముఖ పర్యాటక కేంద్రం అరకులోయలో మూడురోజుల పాటు నిర్వహించిన బెలూన్ ఫెస్టివల్ ఆదివారం సాయంత్రం ముగిసింది. ఉదయం 20 బెలూన్లు గాలిలోకి ఎగురవేయగా, 40 మంది పర్యాటకులే గగనతలంలో విహరించారు. సాయంత్రం 4 గంటలకు 10 బెలూన్లలో 20 మంది విహరించారు. అరకు మాజీ ఎమ్మెల్యే కిడారి సర్వేశ్వరరావు భార్య పరమేశ్వరి, కుమార్తె బెలూన్లు ఎక్కారు. చీకటి పడిన తరువాత తాళ్లు కట్టి ఐదు బెలూన్లను నాలుగైదు అడుగుల వరకు ఎగురవేశారు. ఎగిరిన బెలూన్లు డుంబ్రిగుడ మండలం జంగిడివలస సమీపంలోని పొలాల్లో దిగడంతో ఇబ్బందులు పడ్డారు. ఇవన్నీ అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగానే జరిగినట్టు పర్యాటకులు అంటున్నారు.

ఈ బెలూన్ ఫెస్టివల్‌ను మొదటిరోజు పాడేరు ఐటిడిఎ పిఒ బాలాజీ ప్రారంభించగా, ఆ రోజు సాయంత్రం మంత్రులు భూమా అఖిలప్రియ, కిడారి శ్రావణ్‌కుమార్ ఫెస్టివల్‌ను సందర్శించి బెలూన్లు ఎక్కి విహరించారు. రెండోరోజు నారా బ్రాహ్మణి వచ్చారు. మూడోరోజు జనాధరణ పూర్తిగా తగ్గిపోయింది. రాజకీయ నాయకులు, అధికారుల బంధువులకు, వారు సిఫార్సు చేసే వారికే అవకాశం కల్పించారు తప్ప పర్యాటకులకు పెద్దగా అవకాశం కల్పించలేదు. దీంతో దూర ప్రాంతాల నుంచి వచ్చిన పర్యాటకులు తీవ్ర నిరాశకు గురయ్యారు. ఇందులో స్థానికులను ఏ మాత్రమూ భాగస్వాములను చేయలేదు. దీనికి తోడు స్థానిక పాత్రికేయులను కూడా పట్టించుకోలేదు. కనీసం వారిని లోపలకు కూడా అనుమతించలేదు. దీంతో ఆదివారం వారు పున్నమి అతిథి గృహం వద్ద ఆందోళన చేపట్టి ఐటిడిఎ పిఒకు ఫిర్యాదు చేశారు. పాత్రికేయుల పట్ల అమర్యాదగా ప్రవర్తించిన పాడేరు ఐటిడిఎ ఎపిఆర్ఒ గౌడ్‌పై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.



రోడ్డు ప్రమాదంలో తల్లీ, కొడుకు దుర్మరణం

ప్రజాశక్తి – కామవరపుకోట

రోడ్డు ప్రమాదంలో తల్లి, కొడుకు మృతి చెందిన సంఘటన పశ్చిమగోదావరి జిల్లా కామవరపుకోట మండలం తడికలపూడి గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నల్లజర్ల మండలం పోతినీడుపాలెంకు చెందిన మట్టా సావిత్రమ్మ (55), కుమారుడు మట్టా లక్ష్మీనారాయణ (25) వీరిద్దరూ ద్విచక్రవాహనంపై పెదవేగి మండలం కొప్పులవారిగూడెం గ్రామంలోని తమ బంధువుల ఇంటికి వెళ్లారు. మధ్యాహ్న సమయంలో తిరిగివస్తుండగా తడికలపూడిలోని పోలీస్‌స్టేషన్ సమీపంలో జంగారెడ్డిగూడెం నుండి ఏలూరువైపుకు వెళ్తున్న టాటాసుమో వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరూ మతి చెందారు. కేసు నమోదు చేసినట్లు తడికలపూడి ఎఎస్‌ఐ సత్యనారాయణ తెలిపారు.

అరటి తోటకు నిప్పు

రూ.లక్ష పంటనష్టం

ప్రజాశక్తి– నార్పల

అనంతపురం జిల్లా నార్పల మండలంలో గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం అరటితోటకు నిప్పుపెట్టారు. లక్ష రూపాయల వరకు నష్టం వాటిల్లింది. బాధిత రైతు కథనం ప్రకారం... నార్పల మండలం గూగూడు గ్రామానికి చెందిన రైతు నల్లప్ప అరటితోట సాగు చేశాడు. ఆదివారం మధ్యాహ్నం గుర్తుతెలియని వ్యక్తులు తోటకు నిప్పు పెట్టారు. దీంతో మంటలు అరటి తోటంతా వ్యాపించాయి. ఈ మంటల్లో అరటి చెట్లు దగ్ధమయ్యాయి. సుమారు లక్ష రూపాయల వరకు నష్టం సంభవించిందని రైతు వాపోయారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తిరుగు ప్రయాణమూ కష్టమే..

- ముగిసిన పండుగ సెలవులు
- కిటకిటలాడిన బస్టాండ్, రైల్వేస్టేషన్లు
- రద్దీగా బుకింగ్ సెంటర్లు



ప్రయాణికులతో రద్దీగా విశాఖపట్నం రైల్వేస్టేషన్

ప్రజాశక్తి – యంత్రాంగం

సంక్రాంతి సెలవులు ముగించుకుని తమ తమ గమ్యస్థానాలకు బయల్దేరిన ప్రయాణికులతో బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు కిటకిటలాడాయి. ప్రయాణికుల రద్దీతో విజయవాడ పిఎన్ బస్‌స్టేషన్ రద్దీగా మారింది. ఎటు చూసినా ప్రయాణికులే అన్నట్లుగా తయారైంది. సంక్రాంతి పండుగను జరుపుకొని తిరిగి వారి వారి గమ్యస్థానాలకు చేరుకునేందుకు బయలుదేరిన ప్రయాణికులతో పిఎన్ బస్‌స్టేషన్ కిక్కిరిసింది. ఆదివారంతో సెలవులు ముగియడంతో రాష్ట్రంలోని ఆయా జిల్లాల నుంచి హైదరాబాద్, చెన్నయ్, బెంగుళూరు, ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన ప్రయాణికులు బస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. ప్రయాణికులతో ప్లాట్‌ఫారాలు, బుకింగ్ సెంటర్లలో రద్దీ ఏర్పడింది. ఆదివారం సాయంత్రం నాటికి ముందస్తుగా రిజర్వేషన్ చేయించుకున్న ప్రయాణికులను 64 సర్వీసుల ద్వారా తరలించగా, రాత్రి పొద్దు పోయేంత వరకు మొత్తం వంద సర్వీసులను ఆయా ప్రాంతాలకు నడిపినట్లు ఆర్‌టిసి అధికారులు తెలిపారు.



కీసర టోల్‌గేట్ వద్ద నిలిచిపోయిన వాహనాలు

విశాఖలోని ఆర్టీసీ, రైల్వే స్టేషన్లు కిక్కిరిసిపోయాయి. ద్వారకా బస్సు స్టేషన్, మద్దిలపాలెం, గాజువాక డిపోల్లో జనం తాకిడి నెలకొంది. హైదరాబాద్, చెన్నయ్, బెంగళూరు తదితర ప్రాంతాలకు ప్రయాణమైన వారితో రైళ్లన్నీ నిండిపోయాయి. రత్నాచల్, గోదావరి, సింహాద్రి, జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌లలో ఉత్తరాంధ్ర వాసులు ఇరుక్కుని ప్రయాణాలు సాగించారు.

కీసర టోల్‌గేట్ వద్ద ట్రాఫిక్ జామ్

ఆదివారంతో సంక్రాంతి సెలవులు ముగియడంతో తెలంగాణా రాష్ట్రంలో ఉంటున్న కోస్తా ప్రాంత వాసులు తిరుగు ప్రయాణమయ్యారు. సోమవారం నుండి విద్యాలయాలు, ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు తెరుచుకోనుండటంతో ఆదివారం నుండే కోస్తా ప్రాంతం నుండి జనం తిరుగుప్రయాణం అయ్యారు. దీంతో హైదరాబాద్ మార్గంలో జాతీయ రహదారిపై వాహనాల రద్దీ పెరిగింది. ఆదివారం మధ్యాహ్నం నుండి కార్లతో రద్దీ ఏర్పడింది. దీంతో మండలంలోని కీసర టోల్‌గేట్ వద్ద ట్రాఫిక్ నిలిచిపోయింది. సుమారు అరకిలోమీటరు మేర వాహనాలు నిలిచిపోయాయి.

రాష్ట్రాభివృద్ధికి ఉద్యోగుల సేవలు కీలకం

రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి కళా వెంకట్రావు

ప్రజాశక్తి–మద్దిలపాలెం, విశాఖ

రాష్ట్రాభివృద్ధికి విద్యుత్ ఉద్యోగుల సేవలు కీలకమని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి కిమిడి కళా వెంకట్రావు అన్నారు. ఆంధ్రా యూనివర్సిటీ (ఏయు) స్నాతకోత్సవ మందిరంలో ఆదివారం నిర్వహించిన రాష్ట్ర విద్యుత్ బిసి ఉద్యోగుల సంఘం 13వ మహాసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావుతో కలిసి 2019 డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ డిస్కమ్‌లు ఏర్పాటైన తర్వాత విద్యుత్ శాఖ పని తీరు మెరుగుపడిందని తెలిపారు. షిఫ్ట్ ఆపరేటర్ల నుంచి ప్రిన్సిపల్ సెక్రటరీ వరకు ఆయా స్థాయిల్లో అందరూ కష్టపడి పని చేస్తున్నారని చెప్పారు. సమిష్టి కృషితోనే విద్యుత్ ఉత్పత్తిలో దేశంలోనే మూడో స్థానానికి చేరామని తెలిపారు. దేశంలో 24 గంటలు కరెంట్ ఇచ్చిన మొదటి రాష్ట్రంగా నిలబడ్డామన్నారు. గిరిజన గ్రామాలకు కరెంట్ అందించిన ఘనత ఉద్యోగులకే దక్కుతుందని స్పష్టం చేశారు. శాఖలోని అసోసియేషన్లు రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములవ్వాలన్నారు. ప్రభుత్వ చీఫ్ విప్ కూన రవికుమార్ మాట్లాడుతూ అందరినీ ఒకేగూటికి చేర్చేవే యూనియన్లు అని అన్నారు. విద్యుత్ బిసి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోలాకి శ్రీనివాసరావు మాట్లాడుతూ 13 ఏళ్ళుగా సంఘం ఆధ్వర్యంలో జరిగిన పోరాటాలను వివరించారు. ప్రజా గాయకుడు వంగపండు జానపద గేయాలతో అలరించారు.

శాసనసభ సభ్యత్వానికి, బిజెపికి 'ఆకుల' రాజీనామా

ప్రజాశక్తి – రాజమహేంద్రవరం ప్రతినిధి

రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆకుల సత్యనారాయణ ఆదివారం తన శాసనసభ్యత్వానికీ, బిజెపి ప్రాథమిక సభ్యత్వానికీ రాజీనామా చేశారు. ఈ నెల 21న జనసేన పార్టీలో చేరుతున్నానని ప్రకటించిన నేపథ్యంలో ఆయన తన రాజీనామా లేఖను శాసనసభ స్పీకర్‌కు ఆదివారం పంపారు. తక్షణం తన రాజీనామాను ఆమోదించాల్సిందిగా ఆయన లేఖలో స్పీకర్‌ను కోరారు. బిజెపిని వదిలి జనసేన పార్టీలో చేరుతున్న నేపథ్యంలో బిజెపికీ, ఆ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికీ రాజీనామా చేశారు. తన రాజీనామా లేఖను బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణకు పంపారు. ఆయనతోపాటు బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు లాల్ బహుదూర్ శాస్త్రి, అయ్యల గోపి, నాళం పద్మశ్రీ, ఒబిసి మోర్చా రాష్ట్ర కార్యదర్శి కొవ్విడి సురేష్ కుమార్, బిజెవైఎం రాష్ట్ర కార్యదర్శులు కొప్పిశెట్టి లోవరాజు, ఎం.కల్యాణ్, ఎస్‌సి మోర్చా రాష్ట్ర కార్యదర్శి తోట రామసత్యశ్రీ, ఒబిసి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆర్.వాసుదేవరావు, రాజమహేంద్రవరం పార్లమెంటరీ సోషల్ మీడియా కన్వీనర్ ఎం.శ్రీనివాస నాయుడు, మహిళా మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు ఎస్.గౌసియాబేగం, ఎస్‌వి.రాణి తదితరులు రాజీనామా చేశారు.

టిడిపి సమావేశం గందరగోళం

మేడాను ఆహ్వానించలేదని అనుచరుల ఆందోళన

పొమ్మనలేక పొగపెడుతున్నారు : మేడా

ప్రజాశక్తి – రాజంపేట అర్బన్/టౌన్

కడప జిల్లా రాజంపేట పట్టణంలో ఆదివారం టిడిపి నేతల వేర్వేరు సమావేశాలు ఆందోళనలు మధ్య వాడీవేడిగా సాగాయి. మంత్రి ఆదినారాయణరెడ్డి, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి (వాసు) నేతృత్వంలో రాజంపేట ఆర్‌అండ్‌బి వద్ద ముఖ్యనేతల సమావేశం ఏర్పాటు చేశారు. ముందస్తు జాగ్రత్తగా పోలీసులు అక్కడ భారీగా మోహరించారు. టిడిపి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ మేడా మల్లికార్జునరెడ్డిని ఆహ్వానించకుండా సమావేశం నిర్వహిస్తున్నారని తెలుసుకున్న ఆయన అనుచరులు ఆర్‌అండ్‌బి వద్ద మంత్రి ఆదినారాయణరెడ్డి, శ్రీనివాసరెడ్డికి వ్యతిరేకంగా ఆందోళన చేపట్టారు. పార్టీ మారుతున్నారంటూ మేడాపై పత్రికల్లో వస్తున్న కథనాలను ఖండించాలని కోరినా ఆయన స్పందించకపోవడంతో అధిష్టానం తమను ఇక్కడకు పంపిందని మంత్రి ఆది, శ్రీనివాసరెడ్డి తెలిపారు.

పార్టీ నుంచి పొమ్మనలేక పొగ పెడుతున్నారని మేడా మల్లికార్జునరెడ్డి అన్నారు. రాజంపేటలో ఏర్పాటు చేసిన సమావేశం విషయం తనకు చెప్పలేదని ఆయన అన్నారు. ఆదివారం మధ్యాహ్నం మేడా గెస్ట్‌హౌస్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. సిఎం చంద్రబాబుతో భేటి అవుతానని, జిల్లా నేతలకు బెదరనని చెప్పారు. కార్యకర్తలతో చర్చించి భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తానని తెలిపారు.

సమకాలీన అంశాలపై పట్టు

- గ్రూప్స్ పరీక్షల అవగాహన సదస్సులో కెఎస్ లక్ష్మణరావు సూచన



విభజన చట్టం హామీలు, సవాళ్లు పుస్తకాన్ని ఆవిష్కరించి

ప్రజాశక్తి – కార్పొరేషన్(గుంటూరు)

గ్రూప్స్ పరీక్షలకు సిద్ధపడే అభ్యర్థులు సమకాలీన అంశాలపై పట్టు సాధించాలని, అందుకు వార్తా పేపర్లు నిత్యం అధ్యయనం చేయాలని మాజీ ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం వివిధ శాఖల్లో ఉన్న ఖాళీలన్నీ భర్తీ చేయాలని, నిరుద్యోగులకు ఎన్నికల ముందు చంద్రబాబు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆదివారం గుంటూరు ఎసి కళాశాల సమావేశ మందిరంలో డివైఎఫ్ఐ, యుటిఎఫ్, గుఱ్ఱం జాషువా విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో గ్రూప్ 2, 3 పరీక్షలపై అవగాహన సదస్సు జరిగింది. డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బి.లక్ష్మణరావు అధ్యక్షతన జరిగిన సభలో లక్ష్మణరావు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం 444 గ్రూప్ 2 పోస్టులకే ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చిందని, వీటిలో ఎగ్జిక్యూటివ్, నాన్ ఎగ్జిక్యూటివ్ పోస్టులు ఉన్నాయని పేర్కొన్నారు. విభజన అనంతరం రాష్ట్రంలో 4 జోన్లు ఉన్నాయని, అభ్యర్థులు పక్కా ప్రణాళికతో చదివి ఉద్యోగాలు సాధించాలని సూచించారు. సభలో భారత, ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థలపై అల్లాడి అంజయ్య, ఆంధ్రుల చరిత్రపై పి.మల్లిఖార్జునరావు, జనరల్ స్టడీస్, పాలిటీ అంశాలపై కెఎస్.లక్ష్మణరావు అవగాహన కల్పించారు. అనంతరం విభజన చట్టం హామీలు, సవాళ్లపుస్తకాన్ని ఆవిష్కరించి అభ్యర్థులకు ఉచితంగా పంపిణీ చేశారు.

మోదీ పర్యటనను అడ్డుకుంటే రాష్ట్రపతి పాలన : కన్నా

ప్రజాశక్తి – గుంటూరు జిల్లా ప్రతినిధి

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ రాష్ట్రంలో త్వరలో పర్యటిస్తారని, ఆయన పర్యటనను అడ్డుకుంటే రాష్ట్రపతి పాలన వస్తుందని రాజ్యసభ సభ్యులు జివిఎల్ నరసింహారావు హెచ్చరించారు. గుంటూరులో బిజెపి రాష్ట్ర అధ్యక్షులు కన్నా లక్ష్మీనారాయణతో కలసి ఆదివారం సాయంత్రం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రతిపక్షాల నిరసనలకు భయపడి మోదీ తన పర్యటనను వాయిదా వేసుకోలేదన్నారు. కేంద్రం ఇచ్చిన నిధుల్లో టిడిపి నేతలు పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. కేంద్రం ఇచ్చిన నిధులేగాక లక్షన్నర కోట్ల ప్రపంచ బ్యాంకు నిధులను మాయం చేశారని తెలిపారు. సీఎం చంద్రబాబు రాష్ట్ర ప్రభుత్వ నిధులతోచేపట్టి పూర్తి చేసిన మూడు భారీ ప్రాజెక్టుల పేర్లు చెప్పాలన్నారు. చంద్రబాబు నాయుడు చేస్తున్న విమర్శలను తిప్పికొట్టేందుకు ఇక నుంచి ప్రతి వారం ఒక కేంద్ర మంత్రి రాష్ట్రానికి వచ్చి కేంద్రం ఏం చేసిందో చెబుతారని అన్నారు. కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ సోమవారం కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ రాష్ట్రానికి వస్తున్నారని తెలిపారు. తొలుత విజయవాడలో పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని తరువాత ఆకివీడులోఅభివృద్ధి పనుల్లో పాల్గొంటారని తెలిపారు.



ముగిసిన రాష్ట్రస్థాయి కుస్తీ పోటీలు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం కార్పొరేషన్

తూర్పుగోదావరి జిల్లా రాజానగరం మండలం వెలుగుబందలోని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో ఈ నెల 18 నుంచి మూడురోజుల పాటు జరిగిన రాష్ట్రస్థాయి కుస్తీ పోటీలు ఆదివారంతో ముగిశాయి. రాష్ట్రంలోని 13 జిల్లాల నుంచి వచ్చిన 450 మంది క్రీడాకారుల్లో 16 ఏళ్లలోపు వయస్సు కలిగిన బాలబాలికలు సబ్ జూనియర్ కేటగిరిలోనూ, 19 ఏళ్లలోపు బాలబాలికలకు జూనియర్ కేటగిరీల్లోనూ సెమీఫైనల్, ఫైనల్ పోటీలు జరిగాయి. సబ్ జూనియర్స్, జూనియర్స్ కేటగిరీల్లో బాలురకు ఫ్రీస్టైల్, గ్రీక్ రోమన్ స్టైల్, బాలికలకు ఫ్రీస్టైల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు అల్‌రౌండ్ ఛాంపియన్‌షిప్‌లను అందజేశారు. వీరిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సబ్ జూనియర్స్‌లో ఒకరు, జూనియర్స్‌లో ఒకరు ఛాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకున్నారు. అలాగే పోటీల్లో నైపుణ్యతను కనబరిచిన క్రీడాకారులకు మెడల్స్ అందజేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కుస్తీ జట్టుగా సబ్ జూనియర్స్ నుంచి 30 మందిని, జూనియర్స్ నుంచి 30 మంది క్రీడాకారులను ఎంపిక చేశారు. ఎంపికైన సబ్ జూనియర్స్ జట్టును ఫిబ్రవరి 10 నుంచి 20వ తేదీ వరకు కటక్‌లో జరిగే ఆల్ ఇండియా రెజ్లింగ్ టోర్నమెంట్‌కు, జూనియర్స్ జట్టును ఫిబ్రవరి 1 నుంచి 4వ తేదీ వరకు జరిగే ఆల్ ఇండియా రెజ్లింగ్ టోర్నమెంట్‌కు పంపనున్నారు. పోటీలను విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించిన ఇన్‌ఛార్జి విసి సుంకరి రామకృష్ణారావు, రెక్టార్ ఆచార్య పి.సురేష్ వర్మ, రిజిస్ట్రార్ ఆచార్య ఎస్.టేకికి నిర్వహకులు కృతజ్ఞతలు తెలిపారు

ముంబయి మారథాన్‌లో అపశృతి

డీహైడ్రేషన్‌తో బాధపడ్డ పలువురు

ముంబయి : ముంబయి మారథాన్‌లో అపశృతి చోటుచేసుకుంది. ఆదివారం జరిగిన ఈ మారథాన్‌లో పాల్గొన్న అనేక మంది స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. చాలా మంది డీహైడ్రేషన్, నరాల తిమ్మిరి వంటి వాటితో ఇబ్బంది పడటంతో వైద్య సహాయం అందించారు. ఈ మారథాన్‌లో సుమారు 3226 మంది పాల్గొనగా అనేక మంది అస్వస్థతకు గురికావడంతో ఆసియన్ హార్ట్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ డాక్టర్ విజయ్ డి సెల్వ ఆధ్వర్యంలో ప్రాథమిక వైద్య చికిత్స అందించారు. 15 మంది ఆసుపత్రి పాలు కాగా..వీరిలో 13 మంది డిశ్చార్జి కానున్నారు. వాతావరణ పరిస్థితులు, దుమ్ము కారణంగా మారథాన్ చేసిన వారు ఇబ్బందులకు గురయ్యారని డాక్టర్ విజయ్ తెలిపారు. గతంలో కూడా ఇటువంటి పరిస్థితులేర్పడ్డాయని వెల్లడించారు. కాగా, ఈ మారథాన్‌లో పురుషుల విభాగంలో కెన్యాకు చెందిన కోస్మాస్ లగత్, మహిళల విభాగంలో ఈథిపియాకు చెందిన వోర్కనేష్ అలేమూ విజేతలుగా నిలిచారు. లగత్ ఈ రేసును రెండు గంటల 9 నిమిషాల 15 సెకన్లలో ముగించగా, అలేమూ రెండు గంటల 25 నిమిషాల 45 సెకన్లలోనూ పూర్తి చేశారు.





ఆస్ట్రేలియా ఓపెన్ ఆదివారం పెను సంచలనాలు నమోదయ్యాయి. ఢిఫెండింగ్ చాంపియన్, అగ్రశ్రేణి ఆటగాడు రోజర్ ఫెదరర్, రష్యా టాప్ స్టార్ షరపోవా టోర్నీ నుంచి వైదొలిగారు. నాలుగో రౌండ్ మ్యాచ్‌లో రోజర్ ఫెదరర్‌పై 14వ సీడ్ సిసిపస్ సంచలన విజయం సాధించగా, మహిళల సింగిల్స్‌లో మారియా షరపోవాను ఆష్‌బార్టీ ఇంటిదారి పట్టించింది.

ఫెదరర్ అవుట్

అదే బాటలో షరపోవా

ఆస్ట్రేలియా ఓపెన్

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియా ఓపెన్ పురుషుల సింగిల్స్‌విభాగంలో ఢిఫెండింగ్ చాంపియన్ రోజర్ ఫెదరర్ టోర్నీ నుంచి నిష్క్రమించాడు. ఆదివారం నాలుగో రౌండ్ మ్యాచ్‌లో 3వ సీడ్ ఆటగాడు రోజర్ ఫెదరర్‌పై 6-7(11/13), 7-6(7/3), 7-5, 7-5(7/5) తేడాతో పద్నాలుగువ సీడ్ సీసిపస్ సంచలన విజయం సాధించాడు. ఈ విజయంతో గ్రాండ్ స్లామ్‌లో క్వార్టర్ ఫైనల్స్ చేరుకున్న మొదటి గ్రీకు టెన్నిస్ క్రీడాకారుడిగా కొత్త రికార్డు లిఖించాడు. ఫెదరర్-సీసిపస్ మ్యాచ్ చివరి వరకూ హోరాహోరీగా జరిగింది. సీసిపస్ 20 ఏస్‌లతో ఒక బ్రేక్ పాయింట్‌తో చివరి వరకూ పోరాడి క్వార్టర్ ఫైనల్లోకి చేరాడు. ఇదే విభాగంలో మిగిలిన మ్యాచ్‌ల్లో రెండో సీడ్ రఫేల్ నాదల్(స్పెయిన్) 6-0, 6-1, 7-6(7/4)తేడాతో అన్‌సీడ్ బెరిడిచ్(క్రీచ్ రిపబ్లిక్)పై , ఇరవై రెండవ సీడ్ బౌటిస్టా అగట్(స్పెయిన్)6-7(6/8), 6-3, -2, 4-6, 6-4 తేడాతో సిల్లిక్ (క్రోటియా)పై, టియాపోయ్(యుఎస్) 7-5, 7-6(8/6), 6-7(1/7), 7-5 తేడాతో ఇరవై సీడ్ డిమిత్రావ్(హల్గేరియా)పై గెలిచి క్వార్టర్ ఫైనల్లోకి చేరారు. అలాగే, ఆస్ట్రేలియన్ ఓపెన్ మహిళల సింగిల్స్ విభాగంలో మాజీ చాంపియన్ మారియా షరపోవా (రష్యా) కథ ముగిసింది. ఆదివారం జరిగిన ప్రీక్వార్టర్ మ్యాచ్‌లో క్రికెటర్ కమ్ టెన్నిస్ స్టార్ ఆష్‌బార్టీ (ఆస్ట్రేలియా)ఈ రష్యాస్టార్‌ను మట్టికరిపించింది. షరపోవాపై 4-6, 6-1, 6-4 తేడాతో ఆష్‌బార్టీ విజయం సాధించింది. అషబార్టీ ఆరు ఏస్‌లు, నాలుగు డబుల్ పాల్ట్స్‌తో షరపోవాకు ఏ సందర్భంలోనూ అవకాశం ఇవ్వలేదు. మరోమ్యాచ్‌లో కోలిన్స్(యుఎస్) 6-0, 6-2 తో రెండో సీడ్ కెర్బర్(జర్మని)పై, క్విటోవా(సీచ్ రిపబ్లిక్) 6-1, 6-3తేడాతో అన్‌సీడ్ బేగూ(రోమానియా)పై, ఐదో సీడ్ పావలించోకోవ 6-7(3/7),6-3,6-3 తేడాతో స్టీపెన్స్‌పై గెలిచి క్వార్టర్ ఫైనల్లోకి చేరారు. అష్‌బార్టీ ఈ విజయంతో తొలిసారిగా గ్రాండ్‌స్లామ్ క్వార్టర్ ఫైనల్‌కు చేరింది. 2014లో టెన్నిస్‌కు విరామం ఇచ్చి అనూహ్యంగా క్రికెట్ ఆడిన ఆష్‌బార్టీ.. మహిళల బిగ్‌బాష్‌లీగ్‌లో బ్రిస్బేన్ హీట్ జట్టుకు ప్రాతినిథ్యం ఇచ్చింది. టెన్నిస్ రాకెట్ వదిలి బ్యాట్ పట్టుకున్నఈ యంగ్ లేడీ క్రికెట్‌లోనూ అదరగొట్టింది. లీగ్ అరంగేట్ర మ్యాచ్‌లోనే 29 బంతుల్లో 37 పరుగులు చేసి అందరి ద ష్టిని ఆకర్షించింది. అనంతరం మళ్లీ టెన్నిస్ రాకెట్ పట్టుకున్న ఆష్‌బార్టీ గతేడాదే కెరీర్ బెస్ట్ 15వ ర్యాంకును సొంత చేసుకుంది. ఇక తాజాగా ఐదు గ్రాండ్ స్లామ్‌లు గెలిచిన టెన్నిస్ దిగ్గజం షరపోవాను మట్టికరిపించి ఔరా అనిపించింది.



ఆమ్లా శతకం వృథా

ఐదు వికెట్ల తేడాతో పాకిస్తాన్ గెలుపు

పోర్ట్ ఎలిజిబెత్: దక్షిణాఫ్రికాతో జరిగిన తొలి వన్డేలో పాకిస్తాన్ ఐదు వికెట్ల తేడాతో విజయం సాధించింది. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్‌కు దిగిన దక్షిణిఫ్రికా రెండు వికెట్లు కోల్పోయి నిర్ణీత 50 ఓవర్లలో 266 పరుగులు చేసింది.వెటరన్ ఓపెనర్ హషీమ్ ఆమ్లా 108 పరుగులతో తనదైన ఇన్నింగ్స్ ఆడాడు. ఇతనికి తోడు ఆరంగేట్ర ఆటగాడు వాన్‌డెర్ డసెన్(93)తో మెరవడంతో 266 పరుగులు లక్ష్యాన్ని పాకిస్తాన్ ముందుంచింది. అనంతరం 267 పరుగుల విజయలక్ష్యంతో దిగిన పాకిస్తాన్ జట్టులో బ్యాట్స్‌మ్యాన్‌లు హిమామ్ హుల్ హక్(86) మహ్మద్ హాఫీజ్(71) అర్ధసెంచరీలతో రాణించారు. ఐదు వికెట్లు కోల్పోయిన పాకిస్తాన్ 49.1 ఓవర్లలో విజయం సాధించింది. ఓలివర్, తాహిర్ తమ బంతులతో రాణించినా పాకిస్తాన్ గెలుపును ఆపలేకపోయారు.

కోహ్లీ రికార్డు బ్రేక్

పాకిస్తాన్‌తో జరిగిన వన్డే మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా సీనియర్ బ్యాట్స్‌మెన్ హషీమ్ ఆమ్లా తన 27వ శతకం కొట్టి కోహ్లీని అధిగమించాడు. వన్డేల్లో వేగంగా 27 సెంచరీల మార్క్ అందుకున్న ప్లేయర్‌గా అతడు నిలిచాడు. కోహ్లీ 169 ఇన్నింగ్స్‌ల్లో ఈ మార్క్ అందుకోగా.. ఆమ్లా 167 ఇన్నింగ్స్‌ల్లోనే 27 సెంచరీలు చేశాడు. కోహ్లీ కంటే ముందు సచిన్ 254 ఇన్నింగ్స్‌ల్లో ఈ రికార్డు ఉంది. 2017 జనవరిలో ఇంగ్లండ్‌తో జరిగిన మ్యాచ్‌లో కోహ్లీ ఆ రికార్డును బ్రేక్ చేశాడు. అయితే ఈ మ్యాచ్‌లో చేతిలో ఎనిమిది వికెట్లు చేతులో ఉన్నప్పటికీ ధాటిగా ఆడకుండా సెంచరీ కోసం తాపత్రతయ పడ్డాడని నెటిజన్లు విమర్శలు గుప్పించారు.

ప్రపంచ కప్ సందేహాలకు చెక్

మిడిలార్డర్ సమస్యకు పరిష్కార వేదికగా ఆస్ట్రేలియా టూర్

కొన్ని నెలలో జరగనున్న ప్రపంచ కప్పుకు భారత్‌కు ప్రధాన సమస్యగా ఎప్పటి నుంచో పట్టిపీడిస్తున్న మిడిలార్డర్ సమస్య పరిష్కారం ఆస్ట్రేలియా పర్యాటనలో లభించినట్టయింది. ఆస్ట్రేలియాతో జరిగిన వన్డే సిరీస్‌లో టీమిండియా గెలవడం ఒక వంతు అయితే కొంతకాలంగా జట్టు కూర్పు విషయంలో వేధిస్తున్న సందేహాలకు సమాధానం దొరికినట్టయింది. ఈ టూర్‌లో ఆడిన జట్టును రెండు, మూడు మార్పులతో ప్రపంచ కప్‌కు పంపవచ్చు అన్న నమ్మకం కూడా కలుగుతుంది. బ్యాటింగ్ ఆర్డర్‌లో ఎవరిని ఎప్పుడు ఆడించాలో ఒక క్లారిటీ వచ్చిందనే చెప్పొచ్చు. టీమిండియా టాప్ త్రీ స్థానాల్లో ఆడే రోహిత్, శిఖర్ ధావన్; విరాట్ కోహ్లీ రాణిస్తే తప్ప గెలుస్తూ వచ్చామే తప్ప ఎక్కువ సార్లు వీరు విఫలం అయితే ఓటమే వచ్చేది. గతంలో మిడిలార్డర్‌లో సురేష్‌రైనా, యువరాజ్, మనీష్ పాండే, శ్రేయస్ అయ్యర్; రిషబ్‌పంత్ లాంటి కుర్రాళ్ళను పదుల సంఖ్యలోనే ఆడించారు. అయితే వీరిలో ఎవరూ కుదురుకోలేదనే చెప్పొచ్చు. ఇటీవలి కాలంలో వెస్టిండీస్, ఆస్ట్రేలియా సిరీస్‌లలో మిడిలార్డర్‌లో ధోనీ, దినేశ్ కార్తిక్, కేదార్ జాదవ్, అండటి రాయుడు, రిషబ్‌పంత్‌లు ప్రపంచ కప్పులో మిడిలార్డర్ స్థానాలు సమర్థవంతంగా భర్తీ చేయగలరన్న స్పష్టత ఆస్ట్రేలియా టూర్‌లో వచ్చిందనే చెప్పాలి. ఆస్ట్రేలియా సిరీస్‌కు ముందు ప్రపంచకప్ జట్టులో వికెట్ కీపర్ స్థానంపై కొంత గందరగోళం నెలకొన్న విషయం తెలిసిందే. ఇలాంటి సందర్భంలో ధోనీని పక్కన పెట్టి రిషబ్ పంత్‌కు కీపింగ్ అప్పగించాలన్న విమర్శలకు ఆస్ట్రేలియా వన్డే సిరీస్‌లో మూడు అర్ధసెంచరీలు చేయడంతో చర్చలన్నింటికీ పుల్‌స్టాప్ పెట్టినట్టయింది.

ప్రభుత్వ విధానాలతో అసమానతలు

- వ్యవసాయాన్ని హైజాక్ చేసిన కార్పొరేట్లు
- గ్రామీణ సమస్యలపై మీడియా దృష్టి పెట్టాలి
- కంఠంనేని రవీంద్రరావు స్మారకోపన్యాసంలో పాలగుమ్మి సాయినాథ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కేంద్ర ప్రభుత్వం 1991 నుండి అనుసరిస్తున్న నయా ఉదారవాద ఆర్థిక విధానాలతో అసమానతలు పెరుగుతున్నాయని, దేశంలో నిరుద్యోగం పెరుగుతోందని ప్రముఖ జర్నలిస్టు, రామన్ మెగసెసె అవార్డు గ్రహీత పాలగుమ్మి సాయినాథ్ అన్నారు. ఆదివారం విజయవాడ సిద్ధార్థ ఆడిటోరియంలో కంఠంనేని రవీంద్రరావు మెమోరియల్ ట్రస్ట్ ఏర్పాటు చేసిన సదస్సులో 'సమాజంలో అసమానత - మీడియా పాత్ర' అంశం పై ఆయన ప్రసంగించారు. గడచిన మూడు దశాబ్దాల్లో కేంద్రంలో అధికారంలో ఉన్న ప్రభుత్వాల ఆర్థిక విధానాలు కార్పొరేట్లకు అనుకూలంగా ఉన్నాయని సాయినాథ్ అన్నారు. ప్రభుత్వాన్ని కొన్ని కార్పొరేట్ శక్తులే నియంత్రిస్తున్నాయని, లోక్‌సభ సభ్యుల్లో ఎక్కువశాతం వారే ఉన్నారని విమర్శించారు. భారత రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాలను అమలు చేయడం ప్రభుత్వాల బాధ్యత అని ఆయన చెప్పారు.

నీటి సరఫరా నుంచి బ్యాంకు రుణాల మంజూరు వరకు రైతులను, సామాన్యులను దెబ్బతీసి, కార్పొరేట్లకు లాభం చేకూరేలా ప్రభుత్వ విధానాలున్నాయని విమర్శించారు. సాగు కంటే పరిశ్రమలకే చౌకగా నీరు అందుతోందని, దీంతో తాగడానికి కూడా నీటిని అధిక ధరకు కొనుక్కునే పరిస్థితి ఏర్పడిందన్నారు. విదర్భ ప్రాంతంలో సామాన్యులు నీటి ట్యాంకర్ల నుండి లీటరు రూపాయికి కొంటుండగా మహారాష్ట్ర ప్రభుత్వం అక్కడి బీర్, ఆల్కహాల్ పరిశ్రమలకు లీటర్ నీటిని నాలుగు పైసలకే అందజేస్తోందని చెప్పగా సభికులు నివ్వెరపోయారు. సాగునీటి వినియోగంలో అసమానత వల్ల వ్యవసాయం నష్టదాయకమై రైతులు గ్రామాలు వదిలి పట్టణాలకు వలస వెళ్లిపోతున్నారని అన్నారు. అందరికీ దక్కాల్సిన సహజ వనరులు కొందరు సంపన్నులకు కట్టబెడుతున్నారని చెప్పారు. దేశంలో వ్యవసాయాన్ని కార్పొరేట్ శక్తులు హైజాక్ చేశాయని వివరించారు.

దేశంలో 1990లో లేని డాలర్ బిలియనీర్లు (వంద కోట్ల డాలర్లు- సుమారు 70వేల కోట్ల రూపాయలు) 2000 నాటికి ఫోర్బ్స్ జాబితాలో 53 మంది బిలియనీర్లుగా ఎలా ఎదిగారన్నారు. ముఖేష్ అంబానీ 2017 నుండి 2018కి ఒక్క ఏడాదిలో 1.5 లక్షల కోట్లు ఆదాయం ఎలా ఆర్జించాడని ప్రశ్నించారు. ఫోర్బ్స్ శత కోటీశ్వరుల ఫోటోలను ప్రముఖంగా ప్రచురించే మీడియా ఈ అంశాన్నిమాత్రం చర్చించకపోడం శోచనీయమన్నారు. ప్రభుత్వ విధానాల వల్ల వ్యవసాయంలో ఉత్పత్తి వ్యయం గతంలో కంటే దాదాపు ఐదు రెట్లు పెరిగి నష్టాలపాలై రైతు ఆత్మహత్యలు పెరిగాయని, రైతులు రుణమాఫీ డిమాండ్ చేసే పరిస్థితి వచ్చిందన్నారు. బ్యాంకులిచ్చే వ్యవసాయ రుణాల్లో 53 శాతం అగ్రి బిజినెస్ కంపెనీలకే వెళుతోందని, దాంతో సన్న చిన్నకారు రైతులు వడ్డీ వ్యాపారులనాశ్రయించ వలసి వస్తోందన్నారు. మహిళలకు ఇచ్చే వేతనాలలో కూడా వ్యత్యాసం ఉంటోందని, దాదాపు 75 శాతం గ్రామీణ మహిళలు వారు చేసే పనికి తగిన వేతనం పొందడంలేదన్నారు. సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ నివేదిక ప్రకారం ఒక్క 2017లోనే దేశంలో దాదాపు 1.1 కోట్ల మంది ఉపాధి కోల్పోయారని వివరించారు. ప్రభుత్వ రంగాలలో ఉద్యోగాలు భర్తీ చేయడంలేదన్నారు. కులాల అసమానతలున్నాయని బాల్యం నుంచే వాటిని పిల్లలకు అలవరుస్తున్నారని, వివిధ అంశాలలో అసమానతలపై ఎదురైన అనుభవాలను ఆయన సదస్సులో పంచుకున్నారు. ఆత్మహత్యలకు పాల్పడిన రైతు కుటుంబాలను పరిశీలిస్తే వారు వైద్యానికి వెచ్చించడంవల్లే ఎక్కువగా అప్పులపాలవుతున్నారని తెలిపారు. విద్య, వైద్యం ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా పోరాడాలన్నారు.

రాజా రామ్మోహన్ రాయ్, గాంధీజీ, అంబేద్కర్, భగత్‌సింగ్ పాత్రికేయులుగా ప్రజలను చైతన్యపరిచారని, ప్రస్తుత మీడియా వారిని స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. వ్యవసాయం, రైతు సమస్యలు, గ్రామీణ ప్రాంతాల వార్తలపై మీడియా దృష్టి పెట్టాలని సూచించారు. మహిళా సమానత్వం, హక్కుల కోసం ఏర్పడిన కేరళ మహిళా కుడ్యం చారిత్రాత్మక ఘట్టంగా పేర్కొన్నారు. బిఆర్. అంబేద్కర్ లా కాలేజీ ప్రొఫెసర్ ఎస్. నిర్మల మాట్లాడుతూ ప్రస్తుతం అసంఘటిత రంగాలలో పనిచేస్తున్న వారికి కార్మిక చట్టాలు అమలుకావడంలేదన్నారు. సదస్సుకు అధ్యక్షత వహించిన నాయవాది బండ్ల సాంబశివరావు మాట్లాడుతూ 169 మంది పార్లమెంట్ సభ్యులపై క్రిమినల్ కేసులున్నాయని, వారే పారిశ్రామికవేత్తలుగా కొనసాగుతున్నారని విమర్శించారు.. బెజవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షులు కొండపల్లి సత్యనారాయణ, ఏపి బార్ కౌన్సిల్ సభ్యులు ఎస్. మల్లేశ్వరరావు తదితరులు వేదికనలంకరించారు.

జనసేనతో కలిసి కూటమికి సన్నాహాలు

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి మధు



ప్రజాశక్తి - బాపట్ల (గుంటూరు జిల్లా)

జనసేనతో కలిసి వామపక్ష పార్టీలు వచ్చే ఎన్నికల్లో లౌకిక ప్రజాతంత్ర కూటమి ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నామని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు వెల్లడించారు. ప్రముఖ వైద్యులు, సిపియం నాయకులు దొప్పలపూడి మల్లిఖార్జునరావు సంస్మరణ సభకు ఆదివారం బాపట్ల వచ్చిన మధు విలేకర్లతో మాట్లాడారు. జాతీయ స్థాయిలో రాజకీయాల్లో ప్రస్తుతం పెనుమార్పులు చోటు చేసుకుంటున్నాయన్నారు. రాబోయే రోజుల్లో కేంద్రంలో ప్రత్యామ్నాయ లౌకిక ప్రభుత్వం ఏర్పడే అవకాశం ఉందని మధు అభిప్రాయపడ్డారు. సరళీకృత ఆర్థిక విధానాలు, మతోన్మాదంపై ఒక పెద్ద ఉద్యమం జరగాలన్నారు. నూతన రాజకీయ ప్రత్యామ్నాయం కోసం సిపిఎం, సిపిఐ, జనసేన పార్టీలతో కలిసి పనిచేస్తాయని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో తెలుగుదేశం, వైసిపిల పట్ల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందన్నారు. ఈ రెండు పార్టీలు విధానాల పరంగా ఒకటేనన్నారు. బిజెపి, టిడిపి, వైసిపి, కాంగ్రెస్ అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టేందుకు వామపక్ష పార్టీలు, జనసేన ఒక బలమైన శక్తిగా ప్రజాపోరాటానికి సిద్ధమౌతున్నాయని చెప్పారు.

23 నుంచి పవన్ విశాఖ పర్యటన

గిరిజన సమస్యలపై పాడేరులో బహిరంగ సభ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ఈ నెల 23 నుంచి 25 వరకు విశాఖపట్నంలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా ఉత్తరాంధ్ర మూడు జిల్లాలకు చెందిన పార్టీ నాయకులతో సమీక్షా సమావేశాలు నిర్వహించనున్నారు. 23న శ్రీకాకుళం జిల్లా నాయకులతో సమీక్ష అనంతరం గిరిజన సమస్యలపై పాడేరులో బహిరంగ సభ నిర్వహించనున్నట్లు పార్టీ కార్యాలయం నుంచి ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. 24న విజయనగరం జిల్లా, 25న విశాఖపట్నం జిల్లా నాయకులతో సమీక్షా సమావేశాలు ఉంటాయని పేర్కొన్నారు.

నేడు జనసేనలోకి బిజెపి ఎమ్మెల్యే ఆకుల

రాజమండ్రి బిజెపి ఎమ్మెల్యే ఆకుల సత్యనారాయణ ఈ నెల 21న జనసేన పార్టీలో చేరనున్నారు. విజయవాడలోని ఆ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ సమక్షంలో ఆయన పార్టీలో చేరతారని జనసేన పార్టీ ఆదివారం తెలిపింది. బిజెపి రాష్ట్ర అధ్యక్షపదవి ఆశించిన ఆయన, కన్నా లక్ష్మీనారాయణకు ఆ పదవిని కట్టబెట్టడంతో కొంత కాలంగా పార్టీకి దూరంగా ఉంటున్నారు. బిజెపి ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తూ లేఖను ఆదివారం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కన్నాకు పంపారు. అసెంబ్లీ స్పీకర్‌కు కూడా లేఖను పంపినట్లు తెలిసింది.

అసమర్థుడు చంద్రబాబు : పార్థసారథి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయం గురించి, ప్రత్యేక హోదా గురించి మాట్లాడలేని అసమర్థుడు సిఎం చంద్రబాబు అని వైసిపి అధికార ప్రతినిధి కె పార్థసారథి అన్నారు. విజయవాడలోని ఆ పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు దొంగ కాబట్టే కేంద్రం ఇడి, సిబిఐ, ఎన్ఐఎ, ఆదాయపన్ను శాఖలను ప్రత్యర్థులపై ప్రయోగిస్తోందన్నారు. ఫెడరల్ ఫ్రంట్ అని కేటిఆర్ చర్చలు జరిపితే జగన్ తొలి ప్రాధాన్యంగా ప్రత్యేక హోదా గురించే మాట్లాడారని, అదే జగన్‌కు, చంద్రబాబుకు ఉన్న తేడా అని తెలిపారు.

నిలువునా మోసం : జంగా కృష్ణమూర్తి

బిసిలు, నిరుద్యోగుల్ని సిఎం చంద్రబాబు నిలువునా మోసం చేశారని వైసిపి బిసి సెల్ రాష్ట్ర అధ్యక్షులు జంగా కృష్ణమూర్తి అన్నారు. ఆ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ 20లక్షల కోట్ల పెట్టుబడులు, 40 లక్షల ఉద్యోగాలని చెప్పి మభ్యపెటారని, ఆ పెట్టుబడులు, ఉద్యోగాలు ఏవని నిరుద్యోగులు ప్రశ్నిస్తున్నారని చెప్పారు. ఖాళీగా ఉన్న అన్ని ఉద్యోగాలను భర్తీ చేస్తామని చెప్పి ఒక్క డిఎస్సీకి మాత్రమే నోటిఫికేషన్ ఇచ్చారన్నారు.



వసంతోత్సవ వేడుకలకు చైనా సిద్ధం

బీజింగ్ : వసంతోత్సవ వేడుకలకు చైనా సిద్ధమవుతోంది. చైనా నూతన సంవత్సరం ఫిబ్రవరి 5న ప్రారంభమవుతోంది. ఈ కొత్త సంవత్సర వేడుకల కోసం లక్షలాదిమంది చైనీయులు తమ కుటుంబాలతో కలిసి స్వస్థలాకు వెళతారు. జనవరి 21 నుండి మార్చి 1వ తేది వరకు సాగే ఈ సంబరాల్లో పాల్గొనే ప్రజల కోసం, ఆ రద్దీని తట్టుకునేందుకు రవాణా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది ప్రయాణికుల రద్దీ 0.6శాతం పెరుగుతుందని అంచనా వేశారు. రైల్వే ట్రిప్పుల్లో 8.3శాతం, విమానాల ట్రిప్పుల్లో 12శాతం పెరుగుదల వుంటుందని భావిస్తున్నారు. విమాన రద్దీని తట్టుకునేందుకు షాంఘై అంతర్జాతీయ విమానాశ్రయంతో సహా 10 పెద్ద విమానాశ్రయాల్లో దేశీయ విమానాల రాకపోకలను పెంచాలని, విస్తరించాలని పౌర విమానయాన అధికారులు భావిస్తున్నారు. మొత్తంగా 5,32,000 విమానాల రాకపోకలను సిద్ధం చేస్తున్నారు. ప్రతి రోజూ 4860 రైలు సర్వీసులను కూడా రడీ చేస్తున్నారు. ప్రయాణికుల అవసరాలను దృష్టిలో వుంచుకుని కొన్ని రైల్వే స్టేషన్లు టిక్కెట్ లేకుండా ప్రయాణాలను అనుమతిస్తున్నాయి.

ఆర్టీసిలో జెఎసి ఏర్పాటు

- కన్వీనర్‌గా దామోదరరావు
- కో-కన్వీనర్లుగా సుందరయ్య, వరహాలనాయుడు
- 23న భవిష్యత్ కార్యాచరణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆర్టీసి జెఎసి కన్వీనర్‌గా ఇయు ప్రధాన కార్యదర్శి పలిశెట్టి దామోదరరావు ఎన్నికయ్యారు. ఇయు రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. కో-కన్వీనర్లుగా ఎస్‌డబ్ల్యూఎఫ్ ప్రధాన కార్యదర్శి సిహెచ్ సుందరయ్య, కార్మిక పరిషత్ ప్రధాన కార్యదర్శి వి వరహాలనాయుడును ఎన్నుకున్నారు. మొత్తం 13 మందితో జెఎసిని ఏర్పాటు చేశారు. ఆర్టీసిని పరిరక్షించుకోవాలంటే బడ్జెట్‌లో రూ.3720 కోట్లు కేటాయించాలని జెఎసి నాయకులు డిమాండ్ చేశారు.

పన్ను రూపంలో రూ.300 కోట్లు చెల్లించాల్సి వస్తోందని, వడ్డీల కోసమే రోజుకు రూ.2 కోట్లు చెల్లిస్తున్నారని తెలిపారు. 2014తో పోల్చుకుంటే ఏడాదికి రూ.2వేల కోట్ల ఆదాయం పెరిగిందన్నారు. విద్య, వైద్య రంగాల మాదిరి ఆర్టీసిని కూడా ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నెల 22న యాజమాన్యంతో జరిగే చర్చల్లో సానుకూల వైఖరి రాకుంటే, 23న జెఎసి ఆధ్వర్యంలో భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని వెల్లడించారు. ఎన్ఎంయు కూడా కలిసి రావాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో జెఎసి నాయకులు సిబిఎస్ రెడ్డి, కొండారెడ్డి, ప్రకాష్, మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు రిలే నిరాహార దీక్షలు : ఎన్ఎంయు

ఆర్టీసిలో వేతన సవరణ చేయడంతో పాటు సర్వీస్ కండీషన్లను మెరుగుపర్చాలని డిమాండ్ చేస్తూ సోమ, మంగళవారాల్లో రాష్ట్రంలోని అన్ని డిపోల వద్ద రిలే నిరాహార దీక్షలు చేపట్టనున్నటు నేషనల్ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు చల్లా చంద్రయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ దీక్షల్లో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని యాజమాన్యానికి కార్మికుల వైఖరిని తెలియజెప్పాలని పిలుపునిచ్చారు.

అర్చకులకు కనీసం వేతనంగా రూ.10వేలు

దేవాదాయ శాఖ సలహాదారు రామకోటయ్య

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

దేవాదాయశాఖ ఆధ్వర్యంలోని ఆలయాల్లో ప్రతి అర్చకునికీ కనీస వేతనంగా రూ.10 వేలు చెల్లించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సుముఖత వ్యక్తం చేశారనిదేవాదాయశాఖ సలహాదారు చెరువు రామకోటయ్య తెలిపారు. అర్చకులపై దేవాదాయశాఖ ఉన్నతాధికారులు ఒత్తిడి తెచ్చేలా వ్యవహరించొద్దని సూచించారు. మాచవరం ఆదిశైవ సంఘ కార్యాలయంలో ఆదివారం జరిగిన ఆది, శైవ అర్చక సంఘం రాష్ట్ర స్థాయి కార్యవర్గ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన రామకోటయ్య మాట్లాడుతూ దేవాలయాల అంతరాలయాల్లో అర్చకులు ఎక్కువసేపు పూజాదికాలు నిర్వహిస్తున్నందున అనారోగ్యానికి గురవుతున్నారన్నారు. అర్చకులకు ఆరోగ్యబీమా, గ్రామాల్లోని ఆలయాల్లో విధులు నిర్వహిస్తున్న అర్చకులకు ఆలయ సమీపంలో గృహవసతి కల్పించే విషయంపై త్వరలో ప్రభుత్వం ఒక ప్రకటన చేయనుందని చెప్పారు. ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న వంశపారంపర్య అర్చక విధానానికి జీఓ నెంబరు 64 ద్వారా అర్చకులందరికీ ప్రభుత్వం అవకాశం కల్పిస్తుందన్నారు. ఏపి బ్రాహ్మణ కో ఆపరేటివ్ సొసైటీ డైరెక్టర్ జివి హనుమంతరావు మాట్లాడుతూ సొసైటీలో సభ్యత్వం పొందడం ద్వారా సొసైటీ నుంచి వివిధ పథకాలకు రుణాలు పొందవచ్చన్నారు. సంఘం రాష్ట్ర అధ్యక్షులు రాంబాబు సమావేశంలో పాల్గొన్నారు.

Published and Printed by Paturu Ramaiah on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governarpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Paturu Ramaiah, Ph : 2577248, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68